తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

మంగళవారం 07.10.2025 | సంపుటి :12 సంచిక : 78 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







మరో గాడ్సే..

# సుప్రీం చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నం

## వాదనలు వింటున్న బీఆర్ గవాయ్‌పై బూటు విసిరేందుకు ఓ న్యాయవాది యత్నం

- వెంటనే అప్రమత్తమై అడ్డుకున్న భద్రతా సిబ్బంది
- అనూహ్య ఘటనతో కోర్టులో గందరగోళం

## ఇలాంటి బెదిరింపులు నన్ను ప్రభావితం చేయలేవు.. స్పష్టం చేసిన సీజేఐ

- ఘటనను తీవ్రంగా ఖండించిన రాహుల్
- బీఆర్ గవాయ్‌తో ఫోన్లో మాట్లాడిన మోదీ
- దాడి ప్రతి ఒక్క భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి చేదు అనుభవం ఎదురైంది. ఓ కేసులో వాదనలు వింటున్న జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసేందుకు ఓ న్యాయవాది యత్నించారు. ఇది గమనించిన భద్రతా సిబ్బంది, మిగతా న్యాయవాదులు సదరు లాయర్‌ను అడ్డుకుని బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనతో కోర్టులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. సోమవారం ఉదయం ఓ కేసు విచారణ జరుగుతోంది. ఆ సమయంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ఉన్న వేదిక వద్దకు వెళ్లి బూటు విసిరేందుకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ న్యాయవాదిని అడ్డుకుని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సనాతన ధర్మానికి అవమానం జరిగితే సహించేది లేదని ఆ న్యాయవాది గట్టిగా నినాదాలు చేశారు. సీజేఐ ఏమాత్రం కంగారు పడకుండా కోర్టులో ఉన్న న్యాయవాదులను తమ వాదనలు కొనసాగించమని కోరారు. ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం

మిగతా 2లో..

# రాజ్యాంగం ప్రమాదంలో పడింది



- సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై దాడి గర్హనీయం
- తీవ్రంగా ఖండించిన జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై సుప్రీంకోర్టులో దాడికి యత్నించడం తీవ్ర ఆందోళనకరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటన రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న సంకేతాలను సూచిస్తోందని తెలిపారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై సోమవారం జరిగిన ఘటనను జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి సోమవారం

మిగతా 2లో..

# దేశ చరిత్రలో ఇదో చీకటి రోజు

- జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం సరికాదు
- తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

## ఇది రాజ్యాంగంపైనే దాడి

- మొత్తం షెడ్యూల్ కులాలపై దాడిగానూ చూడాలి
- సీజేఐపై దాడి ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి
- కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లు రవి డిమాండ్

2లో..

# బీహార్‌లో మోగిన ఎన్నికల నగారా

- రెండు విడతల్లో ఎలక్షన్ల నిర్వహణ
- నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్



- నవంబర్ 14న కౌంటింగ్..అదేరోజు ఫలితాలు
- 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు
- ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు
- ఓటు వేయనున్న 7.43 కోట్ల మంది ఓటర్లు
- పురుషులు.. 3.92 కోట్లు, మహిళలు 3.50 కోట్లు
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :**బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ సోమవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్ లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్‌పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు

మిగతా 2లో..

## బీహార్‌లో అన్ని స్థానాల్లో 'ఆప్' పోటీ

11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన పార్టీ

2లో..

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు షెడ్యూల్ విడుదల

- నవంబర్ 11న పోలింగ్
- 14న కౌంటింగ్..
- అదేరోజు ఫలితం ప్రకటన
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అనంతరం నవంబర్ 14న ఓట్ల

మిగతా 2లో..



# హైదరాబాద్‌కు మరో భారీ పెట్టుబడి

- ముందుకొచ్చిన ఎలి లిల్లీ అండ్ కంపెనీ
- రూ.9000 కోట్లతో తయారీ కేంద్రం ఏర్పాటు
- పరిశ్రమలు పెట్టే వారికి అన్నిరకాల మద్దతిస్తాం
- పరిశ్రమ ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో పరిశ్రమలు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ ఎలి లిల్లీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఆ సంస్థ అధ్యక్షుడు ప్యాట్రిన్ జాన్సన్, లిల్లీ ఇండియా అధ్యక్షుడు విన్సెలో టుకర్, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ తదితరులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఎలి లిల్లీ ముందుకొచ్చింది. రూ.9 వేల కోట్లతో ప్లాంటు క్వాలిటీ సెంటర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ సంస్థను సీఎం అభినందించారు.ఫార్మా పాలసీని

మిగతా 2లో..

# మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

## ఇ.బ్రుంకో, ఫ్రెడ్‌రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచిలకు వైద్య శాస్త్రంలో అత్యున్నత పురస్కారం.. రోగనిరోధక శక్తిపై పరిశోధనకు


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**2025 సంవత్సరానికి గాను వైద్యరంగంలో ముగ్గురికి నోబెల్ బహుమతిని ప్రకటించారు. మేరీ ఈ. బ్రంకోవ్ ఫ్రెడ్ రామ్స్‌డెల్ షిమోన్ సకాగుచి ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందు కుగాను వీరికి ఈ పురస్కారం లభించింది.వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలు అని పిలిచే ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు ప్రపంచానికి తెలిపారు. మన రోగ నిరోధక వ్యవస్థ శరీర కణాలపై దాడి చేయకుండా అడ్డుకునేందుకు

మిగతా 2లో..



## 42 % బీసీ రిజర్వేషన్‌కు

# సుప్రీంలో ఊరట



- వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ కొట్టివేత
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా విచారించలేమని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ(జనంసాక్షి) :**సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివే సింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ దవే, అభిషేక్ సింఘ్వీ, ఏడీఎన్ రావు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లా రు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసిందివసంది. దీంతో బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ లభించింది. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ని విచారించడానికి నిరాకరించింది సుప్రీంకోర్టు. తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాదులు తెలిపారు.

మిగతా 2లో..

# సుప్రీం తీర్పు శుభ పరిణామం



- 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం
- అన్ని రకాల రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకం
- ఢిల్లీలో మీడియాతో మంత్రులు భట్టి, పొన్నం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును న్యాయస్థానం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం.. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం.. 42 శాతం

మిగతా 2లో..

## ఎంఐఎం మద్దతు మాకే..

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం
- సుప్రీంతీర్పు శుభపరిణామం
- 42 శాతం రిజర్వేషన్లకు ఢోకా లేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

2లో..

# భారతీయులపై అమెరికాలో ఆగని దారుణాలు

## పిట్స్‌బర్గ్‌లో చోటు చేసుకున్న కాల్పుల్లో భారత సంతతి వ్యక్తి మృతి

**వాషింగ్టన్(జనంసాక్షి) :**చంద్రమౌళి నాగమల్లయ్య ఉదంతం మరువక ముందే.. అమెరికాలో భారత సంతతి ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. పెన్సిల్వేనియాలో ఓ మోటల్ మేనేజర్‌గా పని చేస్తున్న రాకేశ్ ఇహగబన్(51)ను ఓ దుండగుడు కాల్చి చంపేశాడు.తన మోటల్ బయట జరుగుతున్న గొడవను ఆపేందుకు వెళ్లిన క్రమంలోనే ఆయన అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. అసలేం జరిగిందంటే.. పెన్సిల్వేనియా స్టేట్ పిట్స్‌బర్గ్‌లో ఉన్న ఓ మోటల్‌లో రాకేశ్ ఇహబగన్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీన(శుక్రవారం) మధ్యాహ్న సమయంలో మోటల్ బయట పార్కింగ్ వద్ద ఏదో అలజడి వినిపిం చింది. బయటకు వెళ్లిన ఆయనకు.. ఓ వ్యక్తి తన దగ్గర ఉన్న గన్‌తో

మిగతా 2లో..

# కేసీఆర్ చేసిన పనులకు రేవంత్ ప్రారంభోత్సవాలు

- మల్లన్న సాగర్ నుంచి నీళ్లు ఎలా తరలిస్తారు?
- ముఖ్యమంత్రి రేవంత్‌పై హరీశ్ విమర్శలు



**హైదరాబాద్ (జనంసాక్షి):** రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సిఎం తీరుపై ఎద్దేవా చేశారు. రేవంత్ జేబులో కత్తెర పెట్టుకొని మాజీ సీఎం కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నాడని విమర్శించారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్ చేయడమే రేవంత్ పని అని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం రేవంత్.. మల్లన్నసాగర్

మిగతా 2లో..

# మీరు వదిలేసిన పనులను మేం పూర్తి చేస్తున్నాం

- మీ బకాయిలకు మేం డబ్బులు చెల్లిస్తున్నాం
- శరవేగంగా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం
- హరీశ్‌కు మంత్రి కోమటిరెడ్డి కౌంటర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మిస్టర్ హరీష్ రావు.. మీలాగా మాటలు కాదు, చేతల ప్రభుత్వం మాది అని విమర్శించారు. విద్యా, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నాం అని, శంకుస్థాపన స్థాయిలో వదిలి వెళ్లిపోయిన హాస్పిటల్స్ ఈ 21 నెలల్లో వేగంగా నిర్మిస్తున్నాం అని అన్నారు. మీ ప్రభుత్వం 40 వేల కోట్ల బకాయి పెట్టిపోతే.. తాము చెల్లిస్తున్నాం

మిగతా 2లో..



సాగర జలాల్లోకి యుద్ధ నౌక

# 'ఆండ్రోత్'

## నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి) :** తీర ప్రాంతానికి చేరువలోని సాగర జలాల్లో శత్రు జలాంతర్గాముల ఉనికిని పట్టేసే యుద్ధనౌక 'ఆండ్రోత్' భారత నౌకాదళంలో చేరింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రెండో 'యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆండ్రోత్' జలప్రవేశం చేసింది. నేవీ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ ఆధ్వర్యంలో దీన్ని కమిషనింగ్ చేశారు. భారత నౌకాదళం

మిగతా 2లో..

# భారత్ అందరికీ స్వర్గధామంలా మారింది

- ఎవరైనా వచ్చి ఇక్కడ ఉండిపోవచ్చని అనుకుంటున్నారు
- రష్యా మహిళ కేసులో సుప్రీం కోర్టు అసహనం
- భార్యాపిల్లలు గుహాలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారు?
- పిల్లలకు తండ్రిగా చెబుతున్న వ్యక్తిని ప్రశ్నించిన ధర్మాసనం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కర్ణాటకలోని గోకర్ణ గుహాలో రహస్య జీవనం సాగిస్తూ కనిపించిన రష్యన్ మహిళ కేసులో సుప్రీం కోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె ఇద్దరు పిల్లలకు తండ్రిగా చెబుతున్న వ్యక్తిపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లలు

మిగతా 9లో..



బెంగుళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. మల్లిఖార్జున ఖర్గేకు వైద్యులు ఇటీవల పేస్ మేకర్ అమర్చారు.

## హైదరాబాద్‌కు మరో భారీ పెట్టుబడి

ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని.. అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని వెల్లడించారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని.. ఫార్మాకు సంబంధించిన ప్రముఖులు ఆ యూనివర్శిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సీఎం వివరించారు. తెలంగాణ మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలిలిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్షరింగ్ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుకు ఒక బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. దీంతో ఎలిలిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలిలిల్లీ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎంతో పాటు ఐటీ అండ్ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలిలిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. చర్చల అనంతరం ఎలిలిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

## 42 % బీసీ రిజర్వేషన్‌కు సుప్రీంకోర్టులో ఊరట

హైకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున... విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలా జోక్యం చేసుకుంటుందని ప్రశ్నించింది ధర్మాసనం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, జీవో నెంబర్- 9ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. ఈ విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. వీరు సీనియర్ న్యాయవాదులతో ఆదివారం నుంచి మంతనాలు జరిపారు. ప్రభుత్వ వాదనలను గట్టిగా వినిపించాలని కోరారు. దీంతో ఇక ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లేందుకు దాదాపుగా మార్గం సుగమమయ్యిందని భావిస్తున్నారు.

## సుప్రీం కోర్టు తీర్పు శుభ పరిణామం

రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరితో ఉన్నాం.. ఈ రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం.. మా నిర్ణయానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వి వాదనలు గట్టిగా వినిపించారన్నారు. అంతకు ముందు మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ల కల్పనకు సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. ఇందిరా సహానీ కేసు తీర్పు ఆధారంగా తెలంగాణలో రిజర్వేషన్లు కల్పించవచ్చన్నారు. సిపెక్ సర్వే ద్వారా సమగ్రమైన జన గణన వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాగా.. బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో జరిగే వాదనలు సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి కోర్టుకు హాజరయ్యారు. సుప్రీం తీర్పును మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట వ్యాప్తంగా ఇంటికి ఇంటికి సర్వే నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చట్టాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది వ్యక్తులు కోర్టుకు వెళ్తున్నారని మండిపడ్డారు.రాష్ట హైకోర్టులో వాదనలు జరిగాయని.. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు. హైకోర్టులో ఈకేసుపై 8వ తేదీ విచారణ జరగాల్సి ఉందని.. ఈ లోపే వారు సుప్రీంకోర్టుకు వచ్చారన్నారు. న్యాయబద్ధంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ వచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సుప్రీంలో కేసు ఉన్నందున ఈ క్రమంలో తెలంగాణ మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని పిటిషన్ వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరాదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని పిటిషిన్ దాఖలైంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ముందు కేసు విచారణకు రాగా పిటిషన్‌ను ధర్మాసనం విచారించేందుకు తిరస్కరించింది. దీంతో మంత్రులు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు.

## ఎంఐఎం మద్దతు మాకే..



**హైదరాబాద్(జనంసాక్షి):** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌తోనే ఉందన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం తమకు మద్దతు ఇస్తుందని తెలిపారు. కంటోన్మెంట్ మాదిరిగా జూబ్లీహిల్స్‌లోనూ విజయం తమదేనంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ టికెట్ బీసీకి వచ్చే అవకాశం ఉందన్న ఆయన.. రెండు మూడు రోజుల్లో అభ్యర్థి పేరు ఖరారవుతుందని చెప్పారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పరిస్థితులను బట్టి మిత్రపక్షాలకు టికెట్లు ఇస్తామన్నారు. సీపీఎం, సీపీఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డిసెంబర్ చివరి నాటికి పార్టీ పదవులన్నీ భర్తీ చేస్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు తీర్పు తాము ముందుగా ఊహించిందేనన్నారు. త్వరలోనే కామారెడ్డి బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని తెలిపారు. 8వ తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని మహేష్ గౌడ్ కోరారు.సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ అన్నారు. బీసీ బిడ్డలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధిగా ఉందన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌లు చేస్తున్న కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలని అన్నారు. బీసీ బిడ్డల నోటి దగ్గర ముద్దను లాక్కోవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు కుల సంఘ నాయకుని ముద్ర వేసుకుని కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ఉత్సాహాన్ని బీసీలు గమనిస్తున్నారని మహేష్ పేర్కొన్నారు.

మరో గాడ్సే..

# సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నం



చేయలేవని జస్టిస్ గవాయ్ తేల్చి చెప్పారు. అయితే దాడి యత్నం నేపథ్యంలో సుప్రీంకోర్టు వద్ద పలువురు న్యాయవాదులు ఆందోళన చేశారు. అయితే ఘటనకు కారణమైన న్యాయవాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జస్టిస్‌గవాయ్‌తో ఫోన్లో మాట్లాడిన ప్రధాని మోదీ మరోవైపు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌తో మాట్లాడారు ప్రధాని మోదీ సర్వోన్నత న్యాయస్థాన ప్రాంగణంలోనే సీజేఐపై దాడి ప్రతి ఒక్క భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పిన ఆయన, ఇలాంటి చర్యలకు సమాజంలో చోటు లేదని తెలిపారు. ఇలాంటి కఠిన పరిస్థితుల్లోనూ సీజేఐ గవాయ్ చూపిన శాంతియుత ధోరణిని ప్రశంసించిన మోదీ, న్యాయం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను ఇది చాటుతుందన్నారు. సీజేఐ గవాయ్‌పై దాడిని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది.విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన ఓ కేసు పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో ఈ దాడి యత్నం జరిగినట్లుగా తెలుస్తోంది. మధ్యప్రదేశ్ ఖజురహోలోని జవారీలో ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునర్నిర్మించి, తిరిగి ప్రతిష్ఠించేందుకు ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ సమయంలో ఇది ప్రచార ప్రయోజన పిటిషన్‌గా ఉందనీ, వెళ్లి ఏదో ఒకటి చేయాలని మీ దేవుడినే అడగండని సీజేఐ పేర్కొన్నట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని సీజేఐ జస్టిస్ గవాయ్ తోసిపుచ్చారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై సోషల్? మీడియాల్లో పలురకాల స్పందనలు వస్తున్నాయని తనకి ఒకరు చెప్పినట్లు పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించడాన్ని ఆయన కోర్టులో ప్రస్తావించారు. ఈ విషయంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందించారు. పదేళ్లుగా జస్టిస్ గవాయ్ తనకు తెలుసని, ఆయన అన్ని మతాలకు చెందిన ఆలయాలను సమాన భక్తి శ్రద్ధలతో సందర్శిస్తారని తెలిపారు. ఏ దేవుడినీ అవమానించాలన్న ఆలోచన కూడా చేయరని పేర్కొన్నారు. ప్రతి చర్యకూ సమానమైన ప్రతిచర్య ఉంటుందనే న్యూటన్ సిద్ధాంతాన్ని మనం నేర్చుకున్నామని, ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో దీని అర్థం మారిపోయిందని చెప్పారు. ప్రతి చర్యకూ తప్పుడు, విపరీతమైన, అతి ప్రతిచర్య ఉంటోందని తెలిపారు. సంబంధంలేని అంశాలను తీసుకొచ్చి సీజేఐకి అంటగట్టారని స్పష్టం చేశారు. సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ కూడా స్పందించారు. సోషల్ మీడియా అనేది కళ్లెం లేని గుర్రంలాంటిదని అన్నారు. దానిని అదుపు చేయడం కష్టమని వ్యాఖ్యనించారు. ఈ విషయంలో ప్రతిరోజూ బాధపడుతున్నామని తెలిపారు.

### రాజ్యాంగం ప్రమాదంలో పడింది

ఓ ప్రకటనలో తీవ్రంగా గర్హించారు. నేరుగా సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపైనే ఈ దుశ్చర్యకు ఒడిగట్టడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భౌతికదాడులతో క్రమంగా బలహీనపరచాలన్నదే దీనివెనుక దురుద్దేశమన్నారు. రా జ్యాంగ వ్యవస్థలను పరిరక్షించుకోవడం దేశపౌరుల కనీస కర్తవ్యంగా మారిందని ఆయన మరొకసారి గుర్తుచేశారు. తమకు వ్య తిరేకంగా మాట్లాడితే భౌతికదాడులకు దిగుతామని హెచ్చరించడం స్వతంత్ర న్యాయవ్యవస్థ, దేశ సార్వభౌమాధికారంపై దాడిగానే చూడాల్సి ఉంటుందని ఈ సందర్భంగా జస్టిస్ బీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

## దేశ చరిత్రలో ఇదో చీకటి రోజు

- జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం సరికాదు
- తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు. దేశ న్యాయవ్యవస్థలోని అత్యున్నత అధికారిపై దాడి చేసి బెదిరించడానికి జరిగిన దుర్మార్గపు ప్రయత్నాన్ని తాను మాటల్లో ఖండించలేనని చెప్పారు. ఇది మన దేశ చరిత్రలో చీకటి రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇటువంటి పిరికి దాడులకు తాను భయపడబోనని ధైర్యంగా ప్రకటించిన ధైర్యవంతుడైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ కి దేశ పౌరులతో కలిసి తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు రాసుకొచ్చారు. .సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సమయంలో సీజేఐపై దాడి చేసేందుకు ఓ లాయర్ యత్నించాడు. కేసు విచారణలో భాగంగా వాదనలు జరుగుతుండగా ఓ న్యాయవాది సీజేఐపైకి బూటు విసిరేం దుకు యత్నించాడు. గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకు న్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.. ఇలాంటి ఘటనలు తనను ప్రభావి తం చేయలేవని, తాను చలించడం లేదని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని వ్యాఖ్యానించారు. అనంతరం కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని జస్టిస్ గవాయ్ కోరారు.

## ఇది రాజ్యాంగంపైనే దాడి

- మొత్తం షెడ్యూల్ కులాలపై దాడిగానూ చూడాలి
- సీజేఐపై దాడి ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి
- కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లు రవి డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరిన చర్యను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంపైనే దాడి అన్నారు. 75 ఏండ్ల రాజ్యాంగ పాలనలో షెడ్యూల్ కేటగిరీ నుంచి అన్ని అర్హతలతో రెండోసారి సీజేఐగా జస్టిస్ గవాయి బాధ్యతల్లో ఉన్నారని గుర్తుచేశారు. న్యాయస్థానంలోనే ఆయనపై దాడికి యత్నించడాన్ని దేశంలోని మొత్తం షెడ్యూల్డ్ కులాలపై దాడిగా చూడాలన్నారు. ఇదొక్క సీజేఐ శరీరంపై జరిగిన దాడి కాదని, భారతదేశం గుండెకు గాయమని పేర్కొన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని విశ్వసించే అన్ని రాజకీయ పార్టీలు ఈ ఘటనను ఐక్యంగా ఎదుర్కోవాలని, ఈ చీకటి మచ్చను చెరిపేసేందుకు దేశం ఐక్యంగా నిలబడాలని కోరారు.

## కేసీఆర్ చేసిన పనులకు రేవంత్ ప్రారంభోత్సవాలు

నుంచి హైదరాబాద్ నగరంకి నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ చెమటోడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా? అని మండిపడ్డారు. తలకిందులుగా తపస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ఇక ప్రజలు నమ్మరు అని హరీష్ రావు అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు హరీష్ రావు సవాల్ విసిరారు. వడ్లకో నీతి, గోధుమలకో నీతా అని అడిగే దమ్ముందా? బీజేపీ ఎంపీలకు అని అడిగారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని.. బీజేపీది సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ కాదు, పూరా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చు. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుంది. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుంది. రాష్ట్రంలో ఆర్ఆర్ టాక్స్ నడుస్తుంది. పోలీసులు మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్కులో రాసుకుంటాం. మా ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతాం. అని అన్నారు

## మీరు వదిలేసిన పనులను మేం పూర్తి చేస్తున్నాం

అని మండిపడ్డారు. నిత్యం మా ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నాను అని, రేయింబవళ్లు పనులు వేగంగా జరుగుతున్నాయని కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు. 'సనత్ నగర్ టిమ్స్ అక్టోబర్ 31కి ప్రారంభిస్తామని ఇప్పటికే చెప్పాం. అల్వాల్ హాస్పిటల్ వద్ద 1000 మంది ఒకే షిఫ్టులో పని చేస్తున్నారు. వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తాం. ఎల్బీనగర్ వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తెస్తాం. నిమ్స్ హాస్పిటల్ 2 వేల కోట్లతో నిర్మిస్తున్నాం, వచ్చే డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. వరంగల్ హాస్పిటల్ ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తాం. ఎలక్షన్స్ వచ్చాయి కాబట్టి రాజకీయం కోసం పొలిటికల్ విజిట్స్ చేశారు. ప్రజల మేలు కోసం మేము చిత్త శుద్ధితో పనిచేస్తున్నాం' అని హరీష్ రావును ఉద్దేశించి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనంను మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'సుమారు 8 కోట్ల వ్యయంతో కార్పోరేట్ స్థాయి హంగులతో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నిర్మించాం. త్వరలో డిజిటల్ క్లాస్‌తో పాటు ఏసీ రూంలు ఏర్పాటు చేయనున్నాం. ప్రపంచంతో పోటీ పడే విధంగా సీఎం రేవంత్ రెడ్డి గారు, మా క్యాబినెట్ అంతా కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించాం. 20 వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో ఈ అధునాతన రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నాం. నల్గొండలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్లాబ్ లెవల్ వరకు వచ్చింది. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలను ఇంత చక్కగా నిర్మించేందుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, జిల్లా కలెక్టర్ హరి చందన, ఆర్ అండ్ బీ అధికారులు, నిర్మాణ సంస్థకు నా శుభాకాంక్షలు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నా శుభాశీస్సులు' అని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు.

## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

ఉన్న పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ వ్యవస్థను గుర్తించినందుకు ఈ అవార్డు ఇస్తున్నట్లు నోబెల్ అవార్డు కమిటీ ప్రకటించింది. రోగ నిరోధక వ్యవస్థ కాపలదారుగా వ్యవహరించే టీ-సెల్స్‌లో కొన్ని అతిగా ప్రవర్తించకుండా నియంత్రిస్తున్నట్లు వీరు గుర్తించారు.శరీరంపైకి దాడి చేసే సూక్ష్మజీవులు అడ్డుకునేందుకు రోగ నిరోధక వ్యవస్థ కొన్ని కణాలను విడుదల చేస్తూంటుంది. టీ-సెల్స్ కూడా వీటిల్లో ఒకటి. అయితే కొన్ని ప్రత్యేకమైన టీ-సెల్స్ ఇతర రోగ నిరోధక వ్యవస్థ కణాలను నియంత్రిస్తూ... అవసరానికి మించి స్పందించకుండా చేస్తాయన్నమాట. ఈ ఆవిష్కరణ ఫలితంగా ఇమ్యూనాలజీలో సరికొత్త శాఖ ఒకటి మొదలైంది. కేన్సర్‌తోపాటు మధుమేహం, కీళ్లవాపు వంటి ఆటోఇమ్యూన్ వ్యాధుల (రోగ నిరోధక వ్యవస్థే సొంత అవయవాలపై దాడి చేయడం)కు కొత్త కొత్త చికిత్సలు అభివృద్ధి చేసే వీలేర్పడింది. అంతేకాకుండా.... అవయవ మార్పిడి జరిగినప్పుడు శరీరం కొత్త అవయవాలను తిరస్కరించకుండా ఉండేలా చేసేందుకు సాయపడింది వీరి ఆవిష్కరణ. రోగ నిరోధక వ్యవస్థ ఆరోగ్యంగా ఉండే శరీర కణజాలంపై పదే పదే దాడులు చేయకపోవడం చాలాకాలంగా శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తూ వచ్చింది. దీనికి కారణాలేమిటో తెలుసుకునేందుకు చాలా ప్రయత్నాలే జరిగాయి. ఇతర రోగ నిరోధక కణాలను నియంత్రించేందుకు ప్రత్యేకమైన టీ-సెల్స్ ఉన్నట్లు ఈ ఏడాది నోబెల్ అవార్డు గ్రహీతలు గుర్తించడంతో ఈ మిస్టరీ విడిపోయింది. టైప్-1 మధుమేహం, మల్టిపుల్ స్కెలరోసిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటివన్నీ కొన్ని సందర్భాల్లో రోగ నిరోధక వ్యవస్థ దాడుల వల్ల వచ్చే వ్యాధులు కావడం గమనార్హం.

విజేతలకిచ్చే బహుమతి ఇదే..

నోబెల్ విజేతలకు ఇచ్చే మొత్తం నగదు బహుమతి 11 మిలియన్ స్వీడిష్ క్రోనోర్ భారతీయ కరెన్సీలో ఇది సుమారు 10 కోట్లు. ఈ ఏడాది వైద్య రంగంలో ముగ్గురు శాస్త్రవేత్తలు.. మేరీ ఈ. బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచి - ఈ బహుమతిని గెలుచుకున్నందున వీరు ఈ 11 మిలియన్ క్రోనోర్‌ను సమానంగా పంచుకుంటారు. నగదుతో పాటు, ప్రతి నోబెల్ గ్రహీతకు బంగారు పతకం నోబెల్ ఫౌండేషన్ తయారు చేసిన ఆల్ఫ్రెడ్ నోబెల్ చిత్రంతో కూడిన 18 క్యారెట్ల బంగారు పతకం లభిస్తుంది. ప్రతి విజేతకు ప్రత్యేకంగా రూపొందించిన డిప్లొమా లభిస్తుంది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

హైదరాబాద్ పాతబస్తీ విద్యార్థి దుర్మరణం

**హైదరాబాద్(జనంసాక్షి) :** అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి మృతిచెందారు. మూడు రోజుల క్రితం డల్లాస్‌లో దుండగుడి కాల్పుల్లో మీర్‌పేట వాసి పోలే చంద్రశేఖర్ మరణించిన విషయం తెలిసిందే. తాజాగా చికాగోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంచల్‌గూడకు చెందిన షెరాజ్ మెహతాబ్ మొహమ్మద్ (25) చనిపోయారు. ఆదివారం ఇల్లినాయిస్ ఈవెన్‌స్టన్ వద్ద జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మరణించినట్లు తెలుస్తున్నది. విషయం తెలుసుకున్న అతని కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఉన్నత అవకాశాల కోసం తమ కుమారుడు అమెరికాకు వెళ్లి చనిపోయాడంటూ షెరాజ్ తండ్రి అల్తాఫ్ మొహమ్మద్ కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాన్ని ఇక్కడికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు.

# బీహార్‌లో మోగిన ఎన్నికల నగారా

అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం అని తెలిపారు. ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే పక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. రెండు దశల్లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. నవంబర్ 22లోపు ఎన్నికల పక్రియ పూర్తి చేస్తామని సీఈసీ చెప్పింది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, ఆగస్టు 1న ఓటర్ల తుది జాబితా ప్రకటించామని సీఈసీ సభ్యులు తెలిపారు. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్ల జాబితాలో సవరణలకు ఇంకా అవకాశం ఉందని కూడా సీఈసీ తెలిపింది. నామినేషన్లకు 10 రోజుల ముందు కూడా.. ఓటరు జాబితాలో మార్పులు చేసుకోవచ్చని సూచించింది. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని,ఈసారి ఎన్నికల పక్రియ మరింత సులభతరం చేస్తున్నామని సీఈసీ వెల్లడించింది. బిహార్ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని సీఈసీ స్పష్టం చేసింది. బీహార్ మొదటి విడత ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 10న వస్తుంది. నామినేషన్ల దరఖాస్తుకు చివరి తేదీ అక్టోబర్ 17. నామినేషన్ ఉపసంహరణ గడువు అక్టోబర్ 20తో ముగుస్తుంది. నవంబర్ 6 తేదీన మొదటి విడత ఎన్నికలు జరుగుతాయి. ఇక, రెండో విడత ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 13న విడుదల చేస్తారు. నామినేషన్ల దరఖాస్తుకు అక్టోబర్ 20 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 23 వరకూ అవకాశం ఉంటుంది. తుది దశ ఎన్నికల పోలింగ్ నవంబర్ 11న జరుగుతుంది. నవంబర్14న కౌంటింగ్ చేపట్టి అదేరోజు ఎన్నికల ఫలితాలు విడుదల చేస్తారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు ఇంటి దగ్గరే ఓటింగ్ అవకాశం కల్పిస్తున్నామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎలాంటి ఫిర్యాదుకైనా 1950 నెంబర్‌కు ఫోన్ చేసే అవకాశం ఉంటుందని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల సంఘం హెచ్చరించింది. బిహార్ ఎన్నికల నుంచి కొత్తగా 17 సంస్కరణలు తీసుకొస్తున్నామని కూడా చెప్పింది. ఈ సంస్కరణలను భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలుచేస్తామంది. బిహార్‌లో మొత్తం 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 14 లక్షల మంది కొత్త ఓటర్లని సీఈసీ చెప్పింది. ఇక నుంచి ఇ÷ఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్డీయేను వీడి.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో మహాగఠ్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధమూ ఎంతోకాలం నిలవలేదు. 2024 జనవరిలో మహా కూటమిని వీడిన జేడీయూ మళ్లీ ఎన్డీయేతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు..**

ఏడు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లోని అంతా, ఝార?ండ్‌లోని ఘట్‌శిలా, తెలంగాణలోని జూబ్లీహిల్స్, పంజాబ్‌లోని తర్న్‌తారన్, మిజోరంలోని దంపా, ఒడిశాలోని నౌపాధాతోపాటు జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని బద్గామ్, నగ్రోటా స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని తెలిపింది

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల

లెక్కింపు చేస్తున్నట్లు పేర్కొంది. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ తదితర రాష్ట్రాల్లో పలు అసెంబ్లీ ఉప ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈనెల 13న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు ఈనెల 21 వరకు గడువు విధించనున్నట్లు సమాచారం. అలాగే స్వీకరించిన నామినేషన్లను 22వ తేదీన పరిశీలన చేయనున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. బీహార్‌తో పాటే నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24 పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14న ఉంటుంది.

**నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13**
**నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21**
**నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22**
**నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24**
**పోలింగ్ తేదీ: నవంబర్ 11**
**ఓట్ల లెక్కింపు : నవంబర్ 14**

## సాగర జలాల్లోకి యుద్ధ నౌక 'ఆండ్రోత్'

స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయిగా నిలిచింది.కోల్‌కతాలోని ప్రభుత్వరంగ నౌకా నిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని రూపొందించింది. ఈ శ్రేణిలో ఇది రెండో యుద్ధనౌక. మొదటిది ఐఎన్ఎస్ అర్నాలా. అది జూన్ 18న లాంఛనంగా భారత నౌకాదళంలో చేరింది. లక్షదీవుల్లోని అండ్రోత్ అనే దీవి పేరును రెండో యుద్ధనౌకకు ఖరారు చేశారు. ఆండ్రోత్ యుద్ధ నౌకలో దేశీయంగా రూపొందించిన 30 ఎంఎం సర్ఫేస్ గన్ ఉంది. లోతు తక్కువగా ఉన్న జలాల్లోని జలాంతర్గాములను వేటాడే 16 అధునాతన నౌకలకు నేవీ ఆర్డర్ పెట్టింది. ఇందులో ఎనిమిదింటిని జీఆర్ఎస్ఈ ఉత్పత్తి చేస్తోంది. తీర ప్రాంతానికి చేరువలోని జలాలపై నిఘా వేసే సామర్థ్యం వీటికి ఉంది. విమానాలతో సమన్వయం చేసుకుంటూ శత్రు జలాంతర్గాములను వేటాడగలవు. అధునాతన పోరాట నిర్వహణ వ్యవస్థలు వీటి సొంతం. ఈ యుద్ధనౌకల్లో తేలికపాటి టోర్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉన్నాయి.

## భారతీయులపై అమెరికాలో ఆగని దారుణాలు

ఓ మహిళపై కాల్పులకు దిగడం కనిపించింది. అయితే ఆ సమయంలో ఆ వ్యక్తిని "ఆర్ యూ ఆల్‌రైట్ బడ్" అంటూ రాకేష్ పలకరించాడు. అంతే తన చేతిలో గన్‌ను రాకేష్ వైపు తిప్పి పాయింట్ బ్లాక్ రేంజ్‌లో షూట్ చేశాడు ఆ దుండగుడు.బుల్లెట్ గాయాలతో అక్కడికక్కడే కుప్పకూలి రాకేష్ మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. పారిపోతున్న నిందితుడిపై కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఈ కాల్పుల్లో నిందితుడితో పాటు ఓ పోలీస్ అధికారి సైతం గాయపడ్డారు. నిందితుడిని స్టాన్లీ వెస్ట్‌గా(38) నిర్ధారించిన పోలీసులు.. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన అదనపు వివరాల ప్రకారం.. స్టాన్లీ వెస్ట్ గత రెండు వారాలుగా రాకేష్ మేనేజర్‌గా పని చేస్తున్న పిట్స్‌బర్గ్ మోటల్‌లోనే ఉంటున్నాడు. పార్కింగ్ వద్ద అతను కాల్పులు జరిపిన మహిళ కూడా అతనితోనే అక్కడే ఉంటోంది(ఓ చంటి బిడ్డతో సహా).


## బిహార్‌లో అన్ని స్థానాల్లో 'ఆప్' పోటీ

11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బిహార్‌లో రాజకీయాలు మరింత జోరందుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో (243) పోటీ చేయనున్నట్లు 'ఆమ్ ఆద్మీ పార్టీ' ప్రకటించింది. 11 మంది అభ్యర్థులతో తొలి జాబితాను కూడా విడుదల చేసింది. ఇప్పటికే జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన 'ఆప్'.. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనుండటం ఇదే తొలిసారి.దిల్లీ, పంజాబ్‌లో అనుసరించిన పాలనా విధానాలను బిహార్‌లోనూ అమలు చేస్తామని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి అజేశ్ యాదవ్ తెలిపారు. "అభివృద్ధి, పాలనకు సంబంధించి మా దగ్గర విజయవంతమైన నమూనా ఉంది. ప్రజా సంక్షేమం విషయంలో ఆప్ చేసిన పనులు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. గతంలో దిల్లీలో ఆప్ ప్రభుత్వ ఏర్పాటుకు పూర్వాంచల్ ప్రాంత ప్రజలు సహకరించారు. ఇప్పుడు బిహార్‌లోనూ అండగా నిలుస్తారని ఆశిస్తున్నామని పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విశ్వాసం వ్యక్తం చేశారు" అని అజేశ్ పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న విద్యార్థికి అండగా కేటీఆర్

- ఎంబీబీఎస్ చదువు బాధ్యత తీసుకున్న కేటీఆర్
- అనాథ విద్యార్థి గణేష్‌కు తక్షణ సాయంగా రూ. కోటి 50 లక్షల ఆర్థిక సాయం
- ఎంబీబీఎస్ పూర్తి ఖర్చు భరించేందుకు కేటీఆర్ హామీ
- అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసిన బీఆర్ఎస్ నాయకులు
- కేటీఆర్ ఆదేశాల మేరకు తక్షణ సాయంగా రూ. 1,50,000 చెక్కును వారికి అందజేసిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తల్లిదండ్రులు లేని నిరుపేద, ప్రతిభావంతుడైన విద్యార్థికి ఎంబీబీఎస్ కలను సాకారం చేసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మానవత్వంతో ముందుకు వచ్చారు. ఆర్ముళ్ల గణేష్ అనే ఆ విద్యార్థి పూర్తి వైద్య విద్య ఖర్చును తామే భరిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు, తొలి విడతగా అడ్మిషన్ ఫీజు కోసం అవసరమైన రూ. 1,50,000 ను బీఆర్ఎస్ నాయకులు సోమవారం గణేష్‌కు అందించారు.

వరంగల్‌లోని పశ్చిమ నియోజకవర్గం, పెద్దమ్మగడ్డకు చెందిన ఆర్ముళ్ల గణేష్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను, తోబుట్టువును కూడా కోల్పోయి, తన అమ్మమ్మ ఇంట్లో పెరిగాడు. పేదరికం వెంటాడుతున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివి, పట్టుదలతో కష్టపడి ఎంబీబీఎస్ ఫ్రీ సీటు (ప్రతిమ రిలీఫ్ మెడికల్ కాలేజీలో) సాధించాడు. అయితే, ఈ నెల 6వ తేదీ లోపు ట్యూషన్ ఫీజు, డిపాజిట్ కింద రూ. 1,50,000 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడువులోగా డబ్బు చెల్లించకపోతే సీటు కోల్పోయే ప్రమాదం ఉందని తెలుసుకున్న కొందరు సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

### ట్వీట్‌కు స్పందించిన కేటీఆర్

విజ్ఞప్తి అందిన వెంటనే కేటీఆర్ చలించిపోయారు. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వెంటనే స్పందించి, గణేష్ ఎంబీబీఎస్ చదువు పూర్తి బాధ్యత బీఆర్ఎస్ పార్టీ తరపున తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, బాలసముద్రంలోని హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ సోమవారం రోజున గణేష్‌ను, అతని మామ దేవదాసును కలిశారు. కేటీఆర్ ఆదేశాల మేరకు తక్షణ సాయంగా రూ. 1,50,000 చెక్కును వారికి అందజేశారు.

ఈ సందర్భంగా ధాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ సాయం అవసరమైన వేలాది మందికి అండగా నిలిచిన మనసున్న నేత కేటీఆర్ అని కొనియాడారు. కేటీఆర్ ఆదేశాల మేరకు తాము నేరుగా ప్రతిమ రిలీఫ్ మెడికల్ కాలేజీకి వెళ్లి, ఈ తక్షణ సాయంతో గణేష్ అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. భవిష్యత్తులో ఎంబీబీఎస్ చదువు పూర్తి అయ్యేంత వరకు అయ్యే ఖర్చును మొత్తం కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ తరపున అందిస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యమనేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్ఫూర్తితోనే బీఆర్ఎస్ పేద ప్రజల కష్టాలకు స్పందిస్తుందని వినయ్ భాస్కర్ అన్నారు. పేదలకు విద్య, వైద్యం అందేలా కేసీఆర్ పదేళ్ల పాలనలో కృషి చేశారని, అదే సంస్కృతిని కేటీఆర్ కొనసాగిస్తున్నారని తెలిపారు. కేటీఆర్‌కు అందిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థి ఆర్ముళ్ల గణేష్ భావోద్వేగానికి గురయ్యాడు. "ఆపద అని వస్తే కాపాడే ధైర్యం, కష్టం అని తెలిస్తే తీర్చే మంచితనం కేటీఆర్ అన్నది. నేనున్నా అని చదువు ఖర్చు అంతా నేను చూసుకుంటా అని అన్న కేటీఆర్ అన్నకు, సాయం చేసిన వినయన్నకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ఆయన కృతజ్ఞతలు తెలియజేశాడు. గణేష్ కోసం ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేసిన జర్నలిస్ట్ బొలెపాక రాజేష్‌కు, అతని మామ దేవదాసుకు, పాస్టర్ స్వామి దాసుకు, ఈ పరిస్థితిని కేటీఆర్‌కు చేరవేసిన దామెర అక్షయ్‌కు వినయ్ భాస్కర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వరుసగా రెండోరోజూ ట్రాఫిక్ జామ్

- హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఇక్కట్లు
- ఎల్‌బీనగర్ మెట్రో వద్ద కిలోమీటర్ వరకు ప్రయాణికుల క్యూ



హైదరాబాద్, అక్టోబర్6 (జనంసాక్షి) : దసరా సెలవులకు వెళ్లిన వారు తిరిగి రావడంతో వరుసగా రెండోరోజూ విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. నల్గొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పెద్దకాపర్తి, చిట్యాల వద్ద వంతెన నిర్మాణ పనుల వల్ల ఈ సమస్య ఏర్పడింది. దసరా సెలవుల తర్వాత ప్రయాణికులు నగర బాట పట్టడంతో వాహనాల రద్దీ నెలకొంది. మరోవైపు పంతంగి టోల్ ప్లాజాతో పాటు చౌటుప్పల్, దండు మల్కాపురం వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేసారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతల కుంట నుంచి కొత్తపేట వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. చింతలకుంట పైవంతెనపై ట్రావెల్స్ బస్సులు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్ కారణంగా కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. దసరా పండుగ సెలవులు ముగియడంతో ప్రజలు హైదరాబాద్ తిరిగి చేరుకుంటున్నారు. దీంతో ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఎంతకూ వాహనాలు కదలక పోవడంతో జనం మెట్రో రైలును ఆశ్రయించారు. దీంతో ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ఈ నేపథ్యంలో మెట్రో సిబ్బంది ప్రయాణికులను క్యూ పద్ధతిలో పంపిస్తున్నారు. జిల్లాల నుంచి వచ్చిన వారితోపాటు ఆఫీసులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు పెద్ద సంఖ్యలో ఉండటంతో కిలోమీటర్ మేర క్యూలైన్‌లో నిల్చున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. క్యూలైన్ నుంచి ప్లాట్‌ఫారం వద్దకు చేరేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతున్నది. మరోవైపు చౌటుప్పల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నల్లగొండ జిల్లా చిట్యాల నుంచి పెద్దకాపర్తి వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నం చేస్తున్నారు.

# మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్ (జనంసాక్షి) : మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చి నెలరోజులు కావస్తున్నప్పటికీ కోనుగోలు కేంద్రాలను అధికారులు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను మద్దతు ధర కంటే తక్కువ ధరకే దళారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నిట్ట నిలువునా దోపిడీకి గురవుతుండడంతో రైతులు నష్టపోతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను, నష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న కోనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకునేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# బీసీల నోటికాడి బుక్క లాక్కుంటున్నారు

- తీర్పులు రాకముందే కుట్రలు చేస్తున్నారు
- బీసీ లకు రిజర్వేషన్లను అడ్డుకుంటున్న ఆధిపత్య కులాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : తరతరాలుగా బీసీల ఎదుగుదలను బీసీల రిజర్వేషన్లు సహించని ఆధిపత్య కులాలు బీసీల నోటికాడ బుక్కలు లాక్కుంటున్నారని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, మాజీ ఐఎఎస్ అధికారి టి.చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు బి.బాలరాజు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించవద్దంటూ గోరేటి వెంకటేష్, వి మాధవరెడ్డి హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ నంబర్ 30218/2025 పై టి టి.చిరంజీవులు, బాలరాజు గౌడ్ ఇంప్లైడ్ అయ్యారు. ఈ సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్సు ఫోరం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేసింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు రిజర్వేషన్లను అందకుండా అగ్రకులాలు అనేక రకాలుగా కుట్రలు కుతంత్రాలు చేసే అడ్డుకుంటున్నాయని టీ చిరంజీవులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో బీసీలకు ప్రభుత్వం 42% రిజర్వేషన్లు కల్పించడానికి ఓర్వలేక కోర్టులను ఆశ్రయించి అడ్డుకోవాలని చూస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. హైకోర్టులో రిట్ పిటిషన్‌పై సోమవారం తెలంగాణ రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ ద్వారా టీ చిరంజీవులు, బి బాలరాజు గౌడ్ తరఫున ఇంప్లైడ్ అయ్యినట్లు వారు విడుదల చేసిన ప్రకటన లో తెలిపారు.గతంలో 34 శాతం రిజర్వేషన్లను కూడా అడ్డుకునేందుకు అగ్ర కులాలు కుట్రలు చేశాయని అన్నారు. 2011 సంవత్సరంలో రిట్ పిటిషన్ నెంబర్ 16560/ 2011 ద్వారా టి వెంకట్ రమణారెడ్డి, రిట్ పిటిషన్ నెంబర్ 16473 /2011 ద్వారా ఎం వెంకటరెడ్డి 31964/20 11 ద్వారా జి చంద్రశేఖర్ రెడ్డి 34 శాతం బీసీ రిజర్వేషన్లను హైకోర్టులో కేసులు వేసి వేసి కొట్టేయించారని తెలిపారు. దీనిపై అప్పటి ప్రముఖ బీసీ ఉద్యమ నేత పి. వినయ్ కుమార్ సుప్రీంకోర్టు కెళ్ళి 34 శాతం రిజర్వేషన్లు తెచ్చాడని గుర్తు చేశారు .2018 వ సంవత్సరంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన 396 జీవోను తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపు సత్యనారాయణ రెడ్డి. రిట్ పిటిషన్ 21725/ 2018 వి స్వప్న రెడ్డి పిటిషన్ నెంబర్ 21902 /2018 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కొట్టేయించి తగ్గించారని ప్రకటన లో వివరించారు. గతంలో హైకోర్టుల ద్వారా జీవోలు కొట్టేయించిన అగ్రకులాలు ప్రస్తుతం హైకోర్టులలో కేసులు విచారణకు రాకముందే, జడ్జిమెంట్లు రాకముందే ఓర్వలేని తనంతో వంగ గోపాల్ రెడ్డి సుప్రీంకోర్టు ను ఆశ్రయించి బీసీలను రాజకీయ రంగంలో అణిచివేసే దుర్బుద్ధితో ఈ కుట్రలకు తెరతీసారని అన్నారు. ప్రస్తుతం బీసీలు ఎంతో కొంత చైతన్యవంతమయ్యారని ఇప్పుడు కోర్టులలో తిప్పికొడతామని భవిష్యత్తులో ఓట్ల ద్వారా కూడా తగిన గుణపాఠం అగ్రకులాలకు చెప్తామని వారు హెచ్చరించారు. వారిలో చైర్మన్ టి.చిరంజీవులుతోపాటు బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు కె.వి గౌడ్, డాక్టర్ అవ్వారు వేణు కుమార్ ,చెన్నా శ్రీకాంత్ ,వేముల కొండల గౌడ్,బైరి శేఖర్,లింగేష్ యాదవ్,బీసీ పొలిటికల్ ఫ్రంట్ నేతలు దుర్గయ్య గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ ,నగేష్ తదితరులు ఉన్నారు.

## బెస్ట్ అవలెబుల్ స్కూల్‌లో విద్యార్థులను బయటకు పంపితే

# మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పందించరా?

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల (జనంసాక్షి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని జరిగిన ఈ ఘటనపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రకారం, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం బయటకు పంపివేయడం ఎంతో బాధాకరమని అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులు నిరుపేద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు ఆలస్యమవడంతో స్కూల్ యాజమాన్యం బయటకు పంపిందని అన్నారు. ప్రభుత్వం వైఫల్యమని ఆరోపించారు. ప్రస్తుతం ఈ శాఖ మంత్రిగా ఉన్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకుల పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది, ఇది నిరుపేద విద్యార్థులకు నష్టం కలిగించే చర్య అని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కాలంలో ఈ పథకం ద్వారా పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూల్‌లలో ఉచిత విద్య, వసతి, ఫీజు చెల్లింపులు అందజేయబడేవని, డే స్కాలర్ విద్యార్థికి రూ.28,000 రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42,000 చొప్పున ప్రతి విద్యా సంవత్సరానికి విడతల వారీగా చెల్లించేవారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థులను మళ్లీ స్కూల్స్‌లో చేర్చాలని, ఈ సమస్య పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# మెగా టెక్స్‌టైల్స్ పనులు వేగవంతం చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి,అక్టోబర్ 6(జనంసాక్షి): కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి పాల్గొని సమీక్ష నిర్వహించారు. కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్క్‌లో గ్రీన్ కవరింగ్, ఆర్ఓబి పనులు, కూడా లేఅవుట్, డ్రైనేజీ,ఎలక్ట్రిసిటీ, డ్రింకింగ్ వాటర్ తదితర పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ మాస్టర్ ప్లాన్ ఆమోదించి అత్యాధునిక సదుపాయాలతో పార్కును అభివృద్ధి చేయుటకు ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. రోడ్ల, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం,మౌలిక సదుపాయాల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, హౌసింగ్ లేఅవుట్, స్కూల్ బిల్డింగ్స్, గ్రామపంచాయతీ, వెటర్నరీ ఆసుపత్రి, పబ్లిక్ హెల్త్ సెంటర్, వాటర్ సప్లై,పవర్ సప్లయ్ పనులు వేగవంతంగా చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ స్వామి, కూడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి , ట్రాన్స్ కో ఎస్ .ఇ, ఇరిగేషన్ ఎస్. ఇ., ఇ ఇ., ఎన్పీడీసీఎల్ ఎస్ ఇ.గౌతంరెడ్డి, మిషన్ భగీరథ ఈ మాణిక్యరావు, ఆర్ అండ్ బి డి ఇ దేవిక, గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్, సంగెం తహసిల్దార్ రాజకుమార్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయ్‌పై దాడి దిగ్భ్రాంతికరం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్ (జనంసాక్షి) : భారత న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై న్యాయవాద్కెన కిషోర్‌దాస్ చెప్పు విసిరి దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్స్లీ తీవ్రంగా ఖండించారు. అతన్ని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పులివ్వడం, వ్యాఖ్యానాలు చేసే వైఖరి ఉంటుందని, కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, లేదా ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న వైఖరి వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక శక్తులను అవమానించే ఘటన అని, కుల అసమానతలు, మతోన్మాద రాజకీయాలు, మూఢ విశ్వాసాన్ని పెంచి పోషించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తన భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నదని, గతంలో బీజేపీ నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఇలాంటి వ్యాఖ్యలే చేసారని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా సిద్ధిపేట జిల్లాలో కొంత మంది ఆధిపత్య కులాల న్యాయవాదులు ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యానాలు చేసారని, గాంధీని హత్యచేసి హంతకుల్కెన ఆర్ఎస్ఎస్‌ను ఈనాడు దేశ భక్తులుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజే వారిని దేశ ప్రధానమంత్రే కీర్తిస్తున్నారని, ఇలాంటి ఘటనలకు భయపడే సమస్య లేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ, సామాజిక న్యాయం కోరే, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రజలు కూడా ఇలాంటి దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.



## భద్రాచలం శ్రీ సీతా రామ చంద్రస్వామి దేవాలయంలో

# కళ్యాణం చేయించిన ఉప్పల కుటుంబం

భద్రాచలం (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని భక్త రామదాసు నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం చేయించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్ ,కోడలు శార్వారీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పుతో కాంగ్రెస్ తొలి విజయం

- 42శాతం రిజర్వేషన్లను ఎవరూ ఆపలేరు
- బిజెపి, బిఆర్ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదు
- జనగామ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి

జనగామ, అక్టోబర్6 (జనంసాక్షి) : బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి స్వాగతించారు. ఇది స్థానిక ఎన్నికల్లో రేవంత్ సర్కార్ సాధించిన తొలి విజయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలు అయిన పిటీషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. సోమవారం విచారణలో భాగంగా పిటిషన్ ను కొట్టివేసింది న్యాయస్థానం. ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతుందని.. అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది సుప్రీంకోర్టు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు నిర్ణయంపై స్పందించారు ఆయన స్పందించారు. కోటాపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రతాపరెడ్డి అన్నారు. 42శాతం బిసి కోటాపై ప్రభుత్వ కట్టుబడి ఉన్నదని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చి జీవో కూడా ఇచ్చిందని అన్నారు. బీసీ కోటాపై అన్ని ఆలోచించే ప్రభుత్వం సజావుగా నిర్ణయం తీసుకుందని అన్నారు. అయితే కొందరు కావాలనే కోర్టులకు వెళుతున్నారని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజల భాగస్వామ్యంతోనే బీసీ కోటా సాధ్యమని సిఎం రేవంత్ ఎప్పుడో అన్నారని గుర్తు చేశారు. కోటాపై వ్యతిరేక పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. బీసీలకు 42 శాతం కోటా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టం చేశారు. సుప్రీం కోర్ట్ తీర్పు శుభ పరిణామని.. 42 శాతం బిసి రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టు లో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి లకు రిజర్వేషన్లు ఇచ్చే విశయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తుందని అన్నారు.ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ లు బిసి రిజర్వేషన్లు అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని..బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అతిపెద్ద విజయం సాధించబోతోందని అన్నారు. బిఆర్ఎస్, బిజెపిలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఓటర్ ఐడీ కార్డులు పంపిణీ

- ఈసీకి ఫిర్యాదు చేసిన ఎంపి రఘునందన్



హైదరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి) : ఎన్నికల కమిషన్‌కు ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు చేశారు. ఓటర్ కార్డులను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘునందన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు ఓటర్ ఐడీ కార్డులు పంచిపెట్టే దుకాణం పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ చేతుల్లోకి రావాల్సిన ఓటర్ కార్డులు.. కాంగ్రెస్ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. బహిరంగంగా ఓటర్ కార్డులను పంచుతుంటే ఎన్నికల కమిషన్, ఉఈఓఅ కమిషనర్లు ఎందుకు మాట్లాడటం లేదని ఎంపీ రఘునందన్ నిలదీశారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులను పంచుతున్న నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా పోటీకి ఎలా అర్హుడు అవుతాడని రఘునందన్ మండిపడ్డారు. 'నవీన్ యాదవ్‌కు ఓటర్ ఐడీ కార్డులు ఎవరిచ్చారు, ఉఈఓఅ కమిషనర్ ఇచ్చారా..? ఎన్నికల కమిషన్ ఇచ్చిందా..?' అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. చేస్తామంటే గగ్గోలు పెడుతున్న మేధావులు ఇలాంటి వాటి మీదా స్పందించాలని తెలిపారు. చేస్తామంటే ఓట్ల చోరీ అంటున్నారని, ఇది ఐడీ కార్డుల చోరీనా..? అని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ ఐడీ కార్డులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ ఐడీ కార్డుల పంపిణీపై వెంటనే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# ముగ్గురు విప్లవకారులు

భారతదేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ (లాలా లజపత్ రాయ్) కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే.పీ.సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతా లిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. లాలా లజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్ లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు.



**అక్టోబర్ 7..**
**భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులకు ఉరిశిక్ష ఖరారైన దినం**

భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. 'Warrant of Execution On Sentence Of Death' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు.

1930 అక్టోబర్ 7న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖఃదేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకు అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణ లో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్‌లోని సెంట్రల్ జైలులో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయకుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్ , మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనివాలా వద్ద నేషనల్ మెమోరియల్ ఉంది. లాహోర్ జైలులో ఉరిశిక్ష తరువాత, శివరామ్ రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్‌దేవ్ థాపర్ మృతదేహాలను రహస్యంగా అక్కడికి తీసుకు వచ్చారు. వాటిని అధికారులు అక్కడే దహనం చేశారు. ప్రతి సంవత్సరం మార్చి 23 న, అమరవీరుల దినోత్సవం (షాహీద్ దివాస్)నాడు ముగ్గురు విప్లవకారులను జ్ఞాపకం చేసుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

విశ్లేషణ పేరుతో విషం...

# మీడియా, మేధావులు, రాజకీయ నాయకుల బాధ్యత ఎక్కడ?

సమాజంలో కులమతాలను రెచ్చగొడుతుంది, కులానికి "సామాజిక వర్గం" అనే బిరుదు పెట్టి వర్గవాదానికి రంగులు దిద్దుతుంది, విలువలు లేని కొన్ని మీడియా సంస్థలే కదా!. ఇటీవల అసెంబ్లీలో జరిగిన ఒక సంఘటనలో, భాషలో స్పష్టత లేకపోవడం వల్ల కొన్ని వ్యాఖ్యలు అపార్థాలకు దారితీసాయి. ఆ సంఘటన యాదృచ్ఛికంగా, అనాలోచితంగా జరిగినదే తప్ప, ఎలాంటి పథకం ప్రకారం జరిగినది కాదు. ఆ వ్యాఖ్యల్లో తప్పు ఉంటే ఖచ్చితంగా ఖండించాలి, అలాగే అవి అసెంబ్లీ రికార్డుల నుండి తొలగించడమే సరైన చర్య. అంతకుమించి ఆ విషయానికి ప్రాధాన్యం ఇవ్వడం అర్థరహితమైనది. ఎందుకంటే, అసెంబ్లీలో ఇంతకంటే భయంకరమైన సంఘటనలు పరస్పరం తిట్టుకోవడం, కొట్టుకోవడం, అసభ్య వ్యాఖ్యలు చేయడం మనం ఇంతకుముందే చూశాం. వాటితో పోలిస్తే తాజాగా జరిగిన ఈ సంఘటన చాలా చిన్నది. సమస్య ఎంత పెద్దదో, దానికి అనుగుణంగానే ప్రతిస్పందన ఉండాలి. చిన్న సమస్యలను పెద్దవిగా చూపడం సమాజానికి ప్రయోజనం కాదు, భిన్నాభిప్రాయాలను మరింతగా పెంచుతుంది.



కానీ మీడియా, రాజకీయ పార్టీలు, మేధావులు, అభిమాన వర్గాలు అందరూ అనుకోకుండా జరిగిన ఆ సంఘటన పైనే చర్చల వర్షం కురిపిస్తున్నారు. ఒక చిన్న అపార్థాన్ని రాష్ట్రస్థాయి సమస్యగా చూపించడానికి ఎందుకంత ఉచ్చుకత?, ఎవరికి అవసరం?, రెచ్చగొడుతున్నది ఎవరు?, రెచ్చిపోతున్నది ఎవరు?, దీనికి సంబంధించిన విశ్లేషణల వలన రాష్ట్ర ప్రజలకు ఏమి ఉపయోగం?. ఈ చర్చలను చేపడుతున్న మీడియా సంస్థలు, విశ్లేషణలలో పాల్గొంటున్న మేధావులు, రాజకీయ నాయకులు, అమాయకపు అభిమానులు, ఈ ప్రశ్నలను వేసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ అభిమానులను, తమ కులాన్ని, తమ వర్గాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. అదే సమయంలో "కులమతాల పిచ్చి తప్పు" అని నీతులు చెప్పడం వ్యంగ్యంగా మారింది. కులమతాల విభేదాలను రెచ్చగొట్టడంలో ప్రధాన పాత్ర మీడియా, రాజకీయ నాయకులు, సినిమా ప్రముఖులే పోషిస్తున్నారు. బలి అయ్యేది మాత్రం అమాయక ప్రజలు, అభిమానులు. విశ్లేషణల పేరుతో అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేసే మేధావులు కూడా ఈ దుష్పరిణామానికి తోడ్పడుతున్నారు.

ఇటీవల ఒక న్యూస్ మీడియా తమ వీకెండ్ కామెంట్స్ కార్యక్రమంలో ఈ విషయంపై ప్రత్యేకంగా ఒక ఎపిసోడ్నే ప్రసారం చేయడం అందరిని ఆశ్చర్యపరిచింది. నిజానికి ఆ సంఘటన అంత తీవ్రమైనదీ కాదు. అయినప్పటికీ, ఆ చిన్న అంశానికి అంత ప్రాధాన్యం ఇచ్చి చర్చించడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రజలకే అర్థమవుతోంది. "కుల పిచ్చి, మత పిచ్చి తప్పు" అని ఒకవైపు చెబుతూనే, మరోవైపు అదే విశ్లేషణలో నాయకులను కులాల వారీగా విభజించి చూపించడం ఎంత వ్యక్తిత్వం లేని విశ్లేషణో ఆలోచించాలి. పేరుగాంచిన మీడియా సంస్థలు ప్రజలకు ప్రయోజనం లేని అంశాలపై ప్రత్యేకమైన కార్యక్రమాలు రూపొందించి ఊహాజనితమైన విశ్లేషణలను చేస్తే అవి సమాజంలో శాంతియుత వాతావరణానికి విఘాతంగా నిలుస్తాయి. కులమతాల పిచ్చి తప్పు అని సందేశం ఇవ్వాలనుకుంటే నాయకులను కులాలుగా, మతాలుగా వేరుచేసి విశ్లేషణ చేయకూడదు. నాయకుల వ్యాఖ్యలను, చర్యలను వారి కులం ఆధారంగా చూపించడం సమాజానికి తప్పుడు సందేశం ఇవ్వడమే.

ఒకప్పుడు వార్త అంటే ప్రజలకు ఉపయోగపడేది. ప్రజల్లో అవగాహన కల్పించేది. కానీ ఇప్పుడు వార్తలు, విశ్లేషణలు ప్రజలను ఆకర్షించడానికే పరిమితం అయిపోతున్నాయి. విలువలతో కూడిన జర్నలిజం ఎప్పుడో చనిపోయిందా అనే భావన కలుగుతుంది. వాస్తవం ఎవరి మాటల్లోనూ లేకుండా పోతుంది. ప్రజలే తమ వివేకంతో నిజాన్ని గుర్తించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి విశ్లేషణలోనూ పక్షపాత వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. చిన్నచిన్న సంఘటనలను పెద్ద వివాదాలుగా చూపించి కులమతాల మధ్య చిచ్చు పెట్టడం ఒక అలవాటుగా మారింది. తప్పు ఉంటే వెంటనే ఖండించాలి, అక్కడితో ఆపాలి. దానిని మరింతగా లాగి అభిమానులను రెచ్చగొట్టడం సమాజానికి ప్రమాదకరం. ఇప్పటికే ప్రజలు అర్థంలేని విశ్లేషణలను చూసి మీడియాపై విసుగు చెందుతున్నారు. కులమతాల చిచ్చు ఆగాలంటే ముందుగా విశ్లేషణల పేరుతో విషం చిమ్మే వారు మారాలి. మీడియా, రాజకీయ నాయకులు, ప్రముఖ సినిమా హీరోలు, ఆలోచనలేని అభిమానులు మారితేనే కులమతాల పిచ్చి తగ్గుతుంది. ఇప్పటికైనా అర్థం పర్థం లేని విశ్లేషణలు ఆపాలి. "కులపిచ్చి, మతపిచ్చి తప్పు" అని చెబుతూనే వాటినే రెచ్చగొట్టే జర్నలిజం, విశ్లేషణ,రాజకీయం ం సిగ్గుచేటు!

చివరిగా ఒక చిన్న మాట... అంతగా చదువుకోని సామాన్యులు, తమ తమ వృత్తుల్లో తీరికగా లేనివారు కులాలు, మతాలు, రాజకీయ విభేదాలు వంటి విషయాలపై పెద్దగా ఆలోచించరు. సమయం వచ్చినప్పుడు మాత్రం ఓటు హక్కుతో వారి నిర్ణయాన్ని నిష్పక్షపాతంగా తెలియజేసి ప్రభుత్వాలను నిర్మిస్తారు. కానీ, ఆశ్చర్యమేమిటంటే బాగా చదువుకుని, సాంకేతిక పరిజ్ఞానం మెండుగా సంపాదించి, మంచి ఉద్యోగాల్లో ఉన్నవారే సోషల్‌మీడియాలో అత్యంత చురుకుగా ఉండి, నీచమైన భాషలో కులం, మతం, ప్రాంతం, ఇంకా సినిమా హీరోల అభిమాన వర్గాల పేరిట విడిపోయి ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదు. వీరి ప్రవర్తన చూస్తుంటే నేటి విద్య విధానం నైపుణ్యాన్ని నేర్పుతూనే, వ్యక్తిత్వ వికాసాన్ని నేర్పడంలో విఫలమవుతోందనిపిస్తుంది. వ్యక్తిత్వం లేని నైపుణ్యం బూడిదలో పోసిన పన్నీరు వంటిది. మంచి భాష, సద్భావన, జ్ఞానం, సమాజం పట్ల బాధ్యత లేకపోతే చదువుకున్న ఉన్నత విద్యకు విలువ ఏమిటో ఒక్కసారి నేటి యువత ఆలోచించాలి.



**ననుబోలు రాజశేఖర్,**
**హెచ్.ఓ.డి, అసోసియేట్ ప్రొఫెసర్,**
**ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్,**
**శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల,**
**పశ్చిమగోదావరి జిల్లా,**
**9885739808,8330969808**

## పతాక వేదన

**కులాల మతాల కుళ్ళు కాలువల్లో రక్తపుమరకల గుర్తులు దాయన**
**సమానత్వం సమాధి చేసే స్వార్థపాల"కుల" సలాము చూడనా**
**రైతు చట్టాల రణరంగంలో ఆఖరి శ్వాసల గాలికి ఎగురనా**
**బడులను మరచి గుడుల మలచే బలిసిన కొడుకుల బుద్ధిని పొగడన**
**దేశ సంపదలను దర్జాగదొబ్బె కార్పొ"రేట్ల" కవాతు చూడన**
**నిశీధి చాటున నిజాలు దాచే అభాగ్య వనితల దౌర్భాగ్య చావుల**
**అంతిమ యాత్రా వెలుగులు చూడనా**
**డెబ్బైతొమ్మిది వసంతాల స్వాతంత్ర్య దేశాన**
**రెండొందల లక్షలకోట్ల అప్పులు మోయనా**
**అమృత ఉత్సవ సంబరమంటూ విషాన్ని మిగిల్చిన**
**మోసానికి నవ్వనా?**



**నేపా సంతోష్ అచ్యుత్ కుమార్**
**అసిస్టెంట్ ప్రొఫెసర్,**
**కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత,8639442397**

# అవినీతి ఎక్కడ మొదలవుతుంది?



**బిఎస్ రాములు**
**యుగకర్త మార్గదర్శి,**
**సామాజిక తత్వవేత్త**
**శతాధిక గ్రంథకర్త**

***అవినీతి మూలాలలను మతాలు పట్టించుకున్నాయా? తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, మనస్తత్వ శాస్త్ర వేత్తలు పట్టించుకున్నారా అని అపుడపుడు సందేహం రాక మానదు. ఎదుటి వారి గురించి ఎంతైనా మాట్లాడుతారు. తన అవినీతి గురించి అద్దం ముందు నిలబడి తనను తాను చెక్ చేసుకోరు. సాహితీవేత్తలు, కళాకారులు, అధికారంలో వుండేవారు ఈ అవినీతిని యధాతథంగా ఆమోదిస్తూ పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పైగా అది అవినీతి, దోపిడీ, అణిచివేత ఎలా అవుతుందని అమాయకంగా ప్రశ్నిస్తారు. వారికి అంత తొందరగా అర్థం కాదు.***

**ప్రతిఫలం ఇస్తే సరిపోతుందా?**

కలెక్టరుకు, వర్ణ ఆధిక్యవాదులకు, భూస్వాములకు, పారిశ్రామికవేత్తలకు, మంత్రులకు మాకిచ్చినంత కూలి ఇస్తాము. మా బట్టలు ఉతకండి. మా ఇల్లు ఊడ్వండి, మాకు వంట చేసి పెట్టండి. మా వాష్ రూములు , డ్రయినేజీలు బాగు చేయండి అంటే చేస్తారా?మేం కూలి చెల్లిస్తున్నాము, ప్రతిఫలం ఇస్తున్నాము అపారంగా ప్రేమిస్తున్నాము గౌరవిస్తున్నాము అంటారు. అనుకుంటారు. ఇవి చేస్తేనే సమానంగా గౌరవించినట్టు. సమాన ప్రతిఫలం ఇచ్చినట్టు!

**కోసుకొని తినడానికి ప్రేమించడం నిజమైన ప్రేమా?**


తన అవసరాల కోసం ప్రేమించడం నిజమైన ప్రేమ అవుతుందా? మనిషి పశువులను, మేకలు గొర్రెలు కోళ్లు పందులు గుర్రాలు ఏనుగులు కుక్కలను ప్రేమిస్తుంటారు. పశువులతో పని తీసుకోవడానికే గద ప్రేమించడం? మేకలను గొర్రెలను కోళ్ల ను కోసుకొనితినడానికే గద ప్రేమించేది! రైతులు పొలాన్ని, పంటలను ప్రేమిస్తారు. పంట కోసుకొని తినడానికే గద ప్రేమిస్తున్నది. కొందరు ప్రకృతిని ప్రేమిస్తున్నానంటారు. వారు ప్రేమిస్తున్నది ప్రకృతి అందాల ద్వారా కలిగే ఆనందం కోసం ప్రేమిస్తుంటారు. ఇలా ప్రేమ అని చెప్తున్నది తనను తాను తన కొరకు తాను, తన అవసరాలననుసరించి ప్రేమించడమే తప్ప ఇందులో నిజమైన ప్రేమ ఉందా? పరోపకారం చేయడంలో నిజమైన ప్రేమ ఉంది. కాని చాలామంది పరోపకారం ద్వారా సేవ ద్వారా ఆధిపత్యాన్ని, అధికారాన్ని కోరుకుంటారు. అలాంటి పరోపకారం, సేవ నిజమైన ప్రేమ, నిజమైన పరోపకారం కాదు. ఏదో తన కొరకు ఆశించి చేసేది నిజమైన ప్రేమ నిజమైన పరోపకారం కాదు.

**మనిషి స్వతహాగా స్వార్థ పరుడేనా?**

మనిషి స్వతహాగా స్వార్థపరుడా? మనిషి పుట్టుకతోనే అనేక బంధనాలు చుట్టు ముడుతుంటాయి. అమ్మ భాష, అమ్మా నాన్నల కులం, సమాజంలో వారి స్థానం, మేనమామలు, చిన్నమ్మలు పెద్దమ్మలు నానమ్మలు తాతలు మొదలైనవన్నీ చుట్టూ ఏర్పడి వుంటాయి. ఇరుగు పొరుగు ప్రాంతం భాష పరిధిలో మనిషి సంఘ జీవిగా జీవిస్తుంటాడు. సంఘ జీవితంలో ప్రతిదీ నిబంధిత అభ్యాసమే. ఏదీ ఊరికే రాదు. చూసి ర్చుకుంటారు. నేర్పుతుంటారు.. అమ్మభాష నేర్పబడుతుంది. వావి వరుసలు నేర్పబడుతాయి. కులం కుల సంస్కృతి నేర్ప బడుతుంది. నేను ఆడపిల్లను అని నేర్పబడుతుంది. అలాగే దేవుళ్ల మతాలు, సంస్కృతి సంస్కారం నేర్పబడుతాయి. బడిలో కాలేజీలో, ఆట పాటల్లో సాహిత్యం కళలతో నేర్చుకుంటారు. నేర్పబడుతాయి. ఇలా నిబంధిత ( కండిషనింగ్ లర్నింగ్) అభ్యాసం ద్వారా అలవాటుగా సంస్కృతిగా వ్యక్తిత్వంగా మారుతుంటాయి.

**ఇండియాలో అవినీతి మూలాలు**

భారతదేశంలో అన్నిరంగాల్లో విపరీతమైన అవినీతి ఉందని కొందరు పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ అవినీతి తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది. భారతదేశంలో ఇంతగా అవినీతి ఉండడానికి కారణం దేవుడికి లంచాలిచ్చి పూజలు చేసి కోరుకునే మత విధానంలోనే అవినీతి ఉందని ఒక పరిశోధన తెలిపింది. మరి కోరికలు తీర్చకపోతే, ఆపదలో ఆదుకోక పోతే దేవుళ్లెందుకు అని వెంటనే అడుగుతారు. అనగా వారు దేవుళ్లను తమ కోసం, తమ అవసరాలకోసం, తమ మనస్సు ప్రశాంతత కోసం ప్రార్థిస్తున్నామని వారికి తెలుసు. దీన్ని కొందరు అవినీతి అంటున్నారు. దేవునితో




బేరం చేయడం అంటున్నారు. కొబ్బరికాయ నీకు కోరినయన్ని నాకు అనేది ఒక బేరం, ఒక అవినీతి అని అవినీతి మతం నుండి, కోరికల నుండి మొదలవుతున్నదని వారంటారు. మతం వదిలేయడం, దేవుళ్ల ను కోరికలు కోరకుండా వుండడం అంత సులభం కాదు.

**సంస్కృతి సభ్యత పౌర సమాజం**

కనుక సంస్కృతిని సంస్కరించుకోవడం ద్వారా ప్రారంభించాలి. భారత దేశంలో అవినీతి తగ్గించాలంటే అది ఇంటి నుండి, కుటుంబం నుండి ప్రారంభమవుతున్న అవినీతిని నిర్మూలించాలి. ఈ విషయాలు చెప్తే చాలా మందికి అర్థం కావు. అవినీతి జీవిత విధానంగా మార్చుకున్న వారికి అది " మాములు" విషయంగా కనపడుతుంది. ఉదాహరణకు.. ఆడవాళ్లు వంట చేస్తే మగవాల్లు ఆరగించడంతో అవినీతి ఆరంభమవుతున్నది. ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం, బట్టలుతకడం మొదలైన పనులు మహిళలు మాత్రమే చేయాలనే దృష్టిలోనే అవినీతి ఆరంభమవుతున్నది. కనక కుటుంబ వ్యవస్థ నిలబడాలన్నా, స్త్రీలు పొలంలో పరిశ్రమలో, ఆఫీసులో, భవన నిర్మాణంలో, పనిస్థలాల్లో ఉపాధి ఉద్యోగాల్లో సమానంగా పని చేయాలన్నా ఇంటిపనిలో వంట పనిలో, ఇల్లుఊడ్వడం తుడవడం అలుకు చల్లడం, వంట, వడ్డన , అతిథి సత్కారాలు మొదలైనవన్ని మగవాలు కూడ చేయడం అవసరం. స్త్రీలకు కాస్త వెసులుబాటు, స్వేచ్ఛ లభించాలన్నా, మనుషుల్లో అవినీతి వ్యకిత్వం, అవినీతి మనస్తత్వం తగ్గాలన్నా అది మగవారి చేతిలోనే వుంది. వంట, పిల్లల పెంపకం, ఇల్లు ఊడ్వడం, బట్టలుతకడం మగవాళ్లు తమ కర్తవ్యంగా మనస్తత్వం వ్యక్తిత్వం మారినపుడు అవినీతి తగ్గుతుంది. కుటుంబ వ్యవస్థ నిలుస్తుంది.

**కుటుంబ వ్యవస్థకు మూలం వంట గదియా?**

ఇంటిలో వంట మాయమైతే కుటుంబ వ్యవస్థ మాయమవుతుందట! అమెరికా యూరపు ఆస్ట్రేలియా దేశాల అధ్యయనాలు చెపుతున్నాయట! కనక హొటల్లు మూసేస్తే, లేదా హొటల్లను నిషేధిస్తే కుటుంబ వ్యవస్థ నిలదొక్కుంటుందట! కనక దయచేసి మహానుభావులారా! మగవాళ్లు ఇంటి వంట గదిలో వంట చేస్తూ పిల్లల పెంపకం చేస్తూ స్త్రీలను వంట గది నుండి విముక్తం చేస్తేనే నేడు కుటుంబ వ్యవస్థ బలపడి కొనసాగుతుంది. గమవనించండి. కుటుంబ వ్యవస్థ కొనసాగాలంటే మగవాళ్లే వంటగదిలో వంట చేయాలి. పిల్లల పెంపకం చూసుకోవాలి. అందువల్ల కుటుంబ వ్యవస్థ కొనసాగాలో లేదో అనేది మగవాళ్ల చేతల్లోనే ఉంది.

**బహుజనులు సాంస్కృతిక వికాసంలో ముందుండాలి**

బహుజనులు మతాన్ని విమర్శిస్తుంటారు. మతం సంస్కృతి రూపంలో, మనస్తత్వంలో వ్యక్తిత్వం రూపంలో కొనసాగుతుంది. కనక సంస్కృతిని, మనస్తత్వాన్ని, మనస్తత్వాన్ని వ్యక్తిత్వాన్ని మార్చే కృషిచేయాలి. ఆచరణలో గల పురుషాధిపత్య బ్రాహ్మణీయ స్వభావాలను తొలగించుకుంటూ రావాలి. అది సాంస్కృతిక వికాసం ద్వారా జరుగుతుంది. నిన్ను మార్చుకోకుండా ఇతరులను మార్చాలనుకోవడం ఒక నీతి బాహ్య అవినీతి చర్య. పితృస్వామిక పురుషాధిపత్య సంస్కృతి స్త్రీ పురుషుల మధ్య ఆమోదించిన పని విభజనను ఆమోదించి ఆచరించినంత కాలం మతం , సగం జనాభా ఐన మహిళల, బాలల అణిచివేత కొనసాగుతూ వుంటుంది. కనక మహిళలను వంట నుండి, ఇంటి పని, పిల్లల పెంపకంమ, బట్టలుతకడం, ఇల్లు ఊడ్వడం నుండి విముక్తం చేయాలి.

**వంటరాని వారు జంతువలతో సమానమా?**

జంతువులకు పశువులకు వంట చేయడం రాదు. వంట చేయడం రాని వాల్లు, వంట చేయని వాల్లు జంతువులతో పశువులతో సమానం. ఈ విషయంలో వాళ్లు జంతు దశలో పెంపుడు జంతువుల దశలో జీవిస్తున్నారు. ఇల్లు ఊడ్వని వారు, పిల్లల పెంపకం చూడని వాల్లు బట్టలుతకని, వంట చేయని వాల్లు ఆధునిక పౌర సమాజంలో సంస్కృతి నాగరికతల్లో జంతువు దశలో, ఆహార సేకరణ దశలో జీవిస్తున్నారు. అందువల్ల వారిలో జంతు సహజాలు, క్రూరత్వం, అణిచివేత, బలహీనులను చీల్చుకొని తినడం తన మాట వినని వారిని కాల్చుకొని తినడం వంటి ఆధిపత్య స్వభావాలు నిబంధిత అభ్యసనం ద్వారా సహజాతంగా మార్చుకొని కొనసాగుతుంటారు. సాధువులు, సన్యాసులు, గురువులు , రాజులు, మొదలైన వంటచేయని వాల్లలో జంతు స్వభావాలు ప్రకోపిస్తుంటాయి. శాపాలు పెడుతుంటారు. శిక్షలు విధిస్తుంటారు. అణిచి వేస్తుంటారు. వంట నేర్చిన వారికి , నిత్యం వంట చేస్తున్న వారికి పౌర సమాజంలో , నాగరికతలో వుండే సభ్యత సంస్కారం అలవడుతుంది. కూర్చున్న కాడికి టీ కాఫీ టిఫిన్ భోజనం వస్తే ఆరగించేవారు నీతి బాహ్య అవినతి పరులు. వీటన్నిటిని మార్చుకన్నపుడు సంస్కృతి మారుతుంది. మనస్తత్వం మారుతుంది. వ్యక్తిత్వం మారుతుంది. పౌర సమాజంగా ఎదుగుతారు. ఇలా అవనీతి మూలం వంట వద్ద, పితృస్వామిక పని విభజన వద్ద ప్రారంభమవుతున్నది. ఇలా వంట చేయని వారు, ఇతరులు వండి పెడితే ఆరగించేవారు పరాన్న భుక్కులు, అవినీతి, అవినీతి మూల పురుషులు జంతు సమానం అని తేలుతున్నది

# కొమరం భీం ఆత్మగౌరవానికి ప్రతీక

ఈరోజు ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి, ఆదివాసి సమాజ చరిత్రలో మరువలేని రోజు. ఆదివాసీల ఆత్మగౌరవం కోసం "జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో ప్రజల హక్కులను కాపాడిన కొమరం భీం అమరత్వాన్ని సంతరించుకున్న రోజు. ఆయన త్యాగం కేవలం ఒక ఆదివాసీ యోధుని మరణం మాత్రమే కాదు, అది ఆదివాసీ హక్కుల కోసం జరిగిన నిరంతర పోరాటానికి నాంది. నిజాం పాలనలో ఆదివాసీలు అనేక దౌర్జన్యాలు ఎదుర్కొన్నారు. అడవులపై ప్రవేశ నిషేధం, భూముల స్వాధీనం, బలవంతపు పన్నులు, వన్యప్రాణుల వేటకు కూడా ఆంక్షలు - ఇవన్నీ వారి జీవనోపాధిని హరించాయి. తమ స్వంత భూమిలో, తమ స్వంత అడవిలోనే దొంగలుగా మిగిలిపోవాల్సిన పరిస్థితి ఆదివాసీలకు ఏర్పడింది. అప్పుడు కొమరం భీం వీరికి ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం తలెత్తి నిలబడాలని చైతన్యం కలిగించాడు.



**"జల్, జంగల్, జమీన్" – నేటికీ సజీవం**

భీం నినాదం కేవలం మూడు పదాలు కాదు, అది ఆదివాసుల జీవన మూలాలు. నీరు లేకుండా వ్యవసాయం లేదు, అడవి లేకుండా జీవనం లేదు, భూమి లేకుండా గౌరవం లేదు. ఈ త్రిముఖ హక్కుల కోసం ఆయన పోరాటం. నేడు కూడా ఆదివాసి సమస్యల పరిష్కారానికి మార్గదర్శకం.

**త్యాగం, ప్రేరణ :** 1940 అక్టోబర్ 27న జోడెఘాట్ అరణ్యంలో జరిగిన ఘర్షణలో భీం వీరమరణం పొందినా, ఆయన ఆలోచనలు మరణించలేదు. ఆయన త్యాగం ఆదివాసిలలో ధైర్యం నింపింది, ఉద్యమాలకు దిశ చూపింది. నేడు తెలంగాణలో కొమరం భీం జిల్లా ఏర్పడటం, ఆయన పేరు మీద విగ్రహాలు, స్మారకాలు నిర్మించడం ఆయన స్ఫూర్తికి ఎంత జీవం ఉన్నదో చూపిస్తున్నాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విగ్రహాలు, స్మారక స్థూపాలపై చూపించినటువంటి ప్రేమ ఆదివాసి సమాజం పైన ఏ మాత్రం లేదు. కొమురం భీం జల్, జంగల్, జమీన్ లపై సర్వహక్కులు మావే అని కొదమసింహమై గర్జించాడో, ఆ సింహగర్జనకు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంగానీ, భారత ప్రభుత్వం గానీ రాజ్యాంగంలో ఆదివాసులకు హక్కులు కల్పించారు కానీ రాజ్యాంగంలో కల్పించినటు వంటి హక్కులు ఏవైతే ఉన్నాయో వాటిని, ఆదివాసులకు అందకుండా, ఆ హక్కులను ఆస్వాదించకుండా ఈ పాలకవర్గం ఉక్కు పాదంతో అణచివేస్తుంది. 78 ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో కూడా ఆదివాసీలు వంట కట్టెల కోసం అడవికి వెళ్ళిన, పశువులను కాయడానికి అడవికి వెళ్ళిన, వ్యవసాయం చేయడానికి వెళ్ళిన, ఒకవైపు పోలీసులతో, మరోవైపు ఫారెస్ట్ అధికారులతో, ఇంకోవైపు భూ బకాసురులతో, ఆదివాసులపై ముక్కుమ్మడిగా దాడులకు ఉసిగొల్పి ఏం నేరనట్టుగా పాలకవర్గాలు ఉంటున్నాయి. ప్రజా పాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పోడు వ్యవసాయదారులపై అక్రమ కేసులు బనాయించి జైల్లకు పంపిస్తా ఉంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రామరాజ్యం పేరుతో పారా మిలటరీ బలగాలను పెట్టి, ఆదివాసులను అడవుల నుండి నెట్టి వేస్తోంది. అలాగే ప్రశ్నించే టటువంటి ఆదివాసులపై సంఘ విద్రోహ శక్తులుగా ముద్రలు వేసి చంపేస్తుంది. ఇదా ప్రజాస్వామ్యం అంటే..? కొముురం భీం ఆశయమా అది ?

**నేటి బాధ్యత**

ప్రజాపాలన పేరుతో ముందుకెళుతున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం కొమరం భీం వర్ధంతి సందర్భంగా వర్ధంతికి లక్షల రూపాయలతో వర్ధంతి చేయడం కాదు ! నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే,భీం పోరాట స్ఫూర్తితో రాజ్యాంగంలో కల్పించినటువంటి హక్కులు ఏవైతే ఉన్నాయో 1/70 కానీ, పేసా చట్టం కానీ, 2006 అటవీ హక్కుల చట్టంలో కల్పించినటువంటి హక్కులు ఏవైతే ఉన్నాయో వాటిని నూటికి నూరు శాతం అమలు చేస్తే, అది కొమరం భీమ్ కు నిజమైన ఘన నివాళి అవుతుంది తప్ప ఇవేమీ కాకుండా కన్నతల్లికి అన్నం పెట్టనోడు, పినతల్లికి పిండం పెట్టినట్టు.మసిపూసి మారేడు కాయ చేసినట్టు భీం భీమ్ విగ్రహానికి వచ్చి పూలమాల లేసి, ఆదివాసులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామంటూ ఉపన్యాసాలు ఇచ్చి, తూతూ మంత్రంగా చేతులు దులుపుకుంటే కుదరదు. కొమురం భీం ఆశయమైన ఆశయాలను రాజ్యాంగంలో పొందుపరిచారు వాటిని అమలు చేసినప్పుడు, అవి ఆదివాసి బిడ్డలకు అంది, వాటి ద్వారా వారు అభివృద్ధి చెందినప్పుడే కొమరం భీమ్కు మనం అర్పించే ఘన నివాళి అవుతుంది. ఆదివాసీల జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, భూమి హక్కుల పరిరక్షణపై మరింత కట్టుబాటు చూపడం మన సమాజపు బాధ్యత. "జల్, జంగల్, జమీన్" అన్న కొమరం భీం ఒక వీరుడు మాత్రమే కాదు – ఒక ఆలోచన, ఒక ఉద్యమం, ఒక మార్గదర్శకం. ఆయన చూపించిన దారిలోనే ఆదివాసి సమాజం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. ఆయన వర్ధంతి రోజున మనమందరం ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, ఆదివాసుల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి, వారి హక్కులను స్థిరపరచటానికి కట్టుబడి ఉండాలి. భీమ్ కల నేటి పాలకులతోటైన ఆచరణలోకి రావాలి.



**కుద్మేత శ్రీనివాస్**
**9177166152**

# టీడబ్ల్యూజేఎఫ్‌లో టీఏజేఎఫ్ సంఘం విలీనం

- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితమవుదాం
- ఐక్య కార్యాచరణతో ముందుకు సాగుదాం
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**ఖైరతాబాద్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధన, జర్నలిజం విలువల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న ఏకైక జర్నలిస్టు యూనియన్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)లో తమ సంఘాన్ని విలీనం చేస్తున్నట్లు తెలంగాణ ఆల్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీఏజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సోమవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీఏజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రఘురాం, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ రాజేందర్, జాతీయ కన్వీనర్ కూసం సారంగపాణి తదితరులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 2020లో ఏర్పడిన తమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కమిటీలు ఏర్పడి జర్నలిస్టుల సమస్యలపై అధ్యయనం చేయడం జరిగిందని చెప్పారు. అయితే ఇటీవల కాలంలో జర్నలిస్టు సంఘాలు అనేకం పుట్టుకురావడం, కొన్ని యూనియన్‌లు పాలకుల పక్షాన చేరి జర్నలిస్టులను విస్మరించడం వల్ల ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నాయని, అందుకే రాష్ట్రంలో ప్రత్యామ్నాయ జర్నలిస్టుల యూనియన్‌గా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఒక్కటే జర్నలిస్టుల సమస్యలపై చిత్తశుద్ధితో పని చేస్తుందని గ్రహించి తాము తమ టీఏజేఎఫ్ సంఘాన్ని ఆ యూనియన్‌లో విలీనం చేసి బలం చేకూర్చాలని నిర్ణయించామని వారు అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య నేతృత్వంలో తమ సంఘాన్ని టీడబ్ల్యూజేఎఫ్‌లో విలీనం చేస్తూ తాము ఆ యూనియన్‌లో చేరుతున్నామని ప్రకటించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ టీఏజేఎఫ్ సంఘం తమ టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్‌లో విలీనం కావడం మంచి పరిణామమని వారు అన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న టీఏజేఎఫ్ రాష్ట్ర నాయకులను ఆయన అభినందిస్తూ...వారికి టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ సభ్యత్వం ఇచ్చి యూనియన్‌లోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులు తీరని అన్యాయానికి, అవమానాలకు గురయ్యారని, గత ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని వారు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ చేరిన టీఏజేఎఫ్ నాయకులు శ్రీనాథరావు, షేక్ అహ్మద్, క్రాంతికుమార్ తదితరులకు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటస్వామి, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, సీనియర్ జర్నలిస్టు నాంపల్లి శ్రీనివాస్, సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మూడు మండలాలలో రైతుల అరెస్టు

- రీజనల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ వ్యతిరేకిస్తూ రైతుల ఉద్యమం
- వ్యక్తిగత పూచిపై రైతులను విడుదల చేసిన పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ రైతులకు పరామర్శ



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్ పై నిరసన ఉద్యమం ఉధ్రుతమవుతుంది. సోమవారం నాడు వికారాబాద్ పూడూర్ న వా బ్ పేట్ మోమిన్ పేట మండలాల రైతులను పోలీసులు ముందస్తు చర్యగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్ వల్ల తాము నష్టపోతున్నామని గత నెల రోజులుగా మూడు మండలాల రైతులు వినతి పత్రాలను అందజేశారు. కానీ వారి నుంచి ఎటువంటి హామీ కానీ అలైన్మెంట్ మార్పు దిద్దు విషయమై రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో మూడు మండలాల రైతులు ఉద్యమ బాట పట్టారు. అందులో భాగంగానే మూడు మండలాల రైతులు ప్రతిపక్ష నాయకులను కలిసి వినతి పత్రాలు ఇచ్చి తమ సమస్య చెప్పుకోవడానికి బయలు దేరాలని నిర్ణయించారు. అలైన్మెంట్ కు వ్యతిరేకంగా తమ ఉద్యమిస్తున్నామని తమకు మద్దతు ఇవ్వాలని రైతులు వారిని కలుస్తున్నారనే విషయాన్ని ముందుగానే పసిగట్టిన పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి రైతులను అరెస్టు చేసే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మూడు మండలాల రైతులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. తర్వాత వ్యక్తిగత పూచికపై పోలీసులు రైతులను విడుదల చేశారు. ఈ విషయం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్ తీసుకువెళ్లారు. దీంతో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలంగాణ ఉద్యమకారుడు బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్ రైతులకు మద్దతు తెలియజేశారు. వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చరవాణిలో మాట్లాడి పోలీసులు అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అరెస్టయిన రైతులను కలవడానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం నవాబ్‌పేట్ మండలంలో పర్యటించనున్నారు. అలాగే సోమవారం అరెస్ట్ అయిన రైతులను వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నవా బ్ పేట పోలీస్ స్టేషన్ వెళ్లి పరామర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీవ్రవాదులు కారు సంఘవిద్రోహశక్తులు కారు నేరస్తులు కారు తమ భూములను రక్షించుకోవడానికి శాంతియుతంగా ఉద్యమిస్తే ప్రభుత్వం నిర్బంధిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తమ సొంత జిల్లా వికారాబాద్ అని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారని అదే జిల్లాలో రైతులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుల నిర్బంధంతో రీజినల్ రింగ్ రోడ్ కోసం బలవంతంగా భూసేకరణ చేసే ప్రయత్నం చేస్తుందని పరిస్థితి ఇలాగే కొనసాగితే లగచర్ల తరహా ఉద్యమిస్తామని ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తామని అన్నారు. రైతులు అధైర్య పడవద్దు అని తమ పార్టీ మద్దతు రైతులకు సంపూర్ణంగా ఉంటుందని హామీ ఇచ్చారు. రైతులను పోలీసులు అరెస్టు చేస్తే స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దురదృష్టకరమైన విషయమని అన్నారు.

# ఎన్ఐఆర్డీపిఆర్ బ్లాక్ స్థాయి అధికారులకు దేశవ్యాప్తంగా రిఫ్రెషర్ శిక్షణ ప్రారంభం



**రాజేంద్రనగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** డేటా ఆధారిత అభివృద్ధి, ఆధారాల ఆధారిత ప్రణాళిక బ్లాక్ స్థాయిలో సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడానికి ఎన్ఐఆర్డీపిఆర్ నీతి ఆయోగ్ సహకారంతో ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారులకు రిఫ్రెషర్ శిక్షణను సోమవారం ప్రారంభించింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ , హైదరాబాద్, నీతి అయోగ్ సహకారంతో, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించింది. ప్రారంభ సెషన్‌ను ఎన్ఐఆర్డీపిఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్ అధికారికంగా హాజరై ప్రారంభించారు. ఎబిపి యొక్క విజన్ మిషన్‌ను నీతి అయోగ్, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ అదనపు మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ ప్రసంగించారు. 2023 సంవత్సరంలో ప్రారంభించిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాక్‌లను కన్వర్జెన్స్, డేటా-ఆధారిత గుర్తించబడిన 40 సూచికలలో సంతృప్త విధానంతో కేంద్రీకరించడం ద్వారా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. కీ పెర్ఫార్మింగ్ ఇండికేటర్స్ కెపిఎల్ యొక్క సంతృప్తతను సాధించే దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి బ్లాక్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్ఓ) ఇతర కీలక కార్యకర్తల సామర్థ్యాలను బలోపేతం చేయడానికి ఈ రిఫ్రెషర్ శిక్షణ రూపొందించబడింది. ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, సామాజిక అభివృద్ధి ఆర్థిక చేరిక అనే ఐదు ముఖ్యమైన రంగాలపై దృష్టి సారించి ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలు ఒకేసారి తొమ్మిది వేదికలలో అక్టోబర్ 6న ప్రారంభమై ఇది నవంబర్ 20, 2025 వరకు కొనసాగుతుంది. ఈ బ్యాచ్‌లలో 126 శిక్షణలను నిర్వహిస్తుంది. ఆస్పిరేషనల్ బ్లాక్‌ల నుండి దాదాపు 5,000 మంది బ్లాక్ లెవల్ ఆఫీసర్లు, ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోలు బ్లాక్ ప్రముఖులను కవర్ చేయనుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. అరుణ జయమణి,సిఆర్టిసిఎన్ అధిపతి డాక్టర్ పి. కేశవ రావు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



**నాచారం, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని పలు కాలనీలలో 52 లక్షల అంచనా వ్యయంతో డైమండ్ హిల్స్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వెంకటేశ్వర నగర్, తిరుమల్ నగర్‌లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అలాగే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని డివిజన్ అభివృద్ధి విషయంలో ఎల్లవేళలా సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, మల్లారెడ్డి, ఇక్బాల్, అరిఫుద్దీన్, వీరభద్రరావు, మల్లేష్ గౌడ్, బోదాసు రవి, వెంకట్, మురళి, నరసింహా గౌడ్, కృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, చక్రవర్తి, దాసు, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల బాలుడిని పరీక్షించిన డిప్యూటీ డిఎంహెచ్‌వో రవీందర్ యాదవ్

- జనం సాక్షి కథనానికి స్పందన
- బాలుడికి సోకింది స్పైనల్ మస్కులర్ అట్రోఫి వ్యాధిగా నిర్ధారించారు
- తదుపరి నివేదికను కలెక్టర్‌కు అందించడం జరుగుతుందని వెల్లడించిన డిప్యూటీ డీఎంహెచ్వో



**బొంరాస్‌పేట, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలోని ఐదేళ్ల బాలుడు వింత వ్యాధితో బాధపడుతున్నాడని వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండలం వడిచర్ల పరిధిలోని ఊరేనికి తండాకు చెందిన మూడవత్ గోరిబాయి,శ్రీను దంపతుల కుమారుడు మూడవ గణేష్‌కు సోకిన స్పైనల్ మస్కులర్ ఆటో వ్యాధి గురించి సోమవారం జనం సాక్షి కథనం ప్రచురించింది.కథనానికి జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ స్పందించి డిప్యూటీ డిఎంహెచ్వో రవీందర్ యాదవ్ ను ఆదేశించడంతో ఆయన సోమవారం బొంరాస్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం బాలుడికి తల్లిదండ్రులు చేయించిన వైద్య పరీక్షల నివేదికను చూసి బాలుడికి సోకింది జన్యు సంబంధామైన స్పైనల్ మస్కులర్ ఆట్రోఫి వ్యాధిగా నిర్ధారించాడు.అనంతరం స్థానిక వైద్యాధికారి హేమంత్ కుమార్ తో కలిసి ఆయన మాట్లాడుతూ లక్ష మందిలో ఒకరికి ఇలాంటి జన్యు సంబంధ వ్యాధి వస్తుందని వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని వెల్లడించారు.వ్యాధిని కట్టడి చేసేందుకు ఐదు సంవత్సరాల వరకు బాలుడికి చికిత్స అందించాల్సి ఉంటుందన్నారు.బాలుడి యొక్క వైద్య పరీక్షల నివేదికను జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ కు పంపించి మెరుగైన చికిత్స కోసం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మవతి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాలు
జనంసాక్షి
06 Oct 2025 - Page 10

## పోలింగ్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను నోడల్ అధికారులు, పోలింగ్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల నోడల్ అధికారులు, అడిషనల్ కలెక్టర్లతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు ప్రొసైడింగ్, సహాయ ప్రొసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సైబరాబాద్ పోలీస్ శాఖ అడిషనల్ డీసీపీలు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, అబ్కారి శాఖ సుపరిడెంట్లు కృష్ణప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అదికారులు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీ ద్వారా పార్టీని విస్తరించాలి



**వనపర్తి టౌన్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయటం ద్వారా ఎర్రజెండాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు అన్నారు. రేవల్లి మండలం తలుపునూరులో గోపాల్పేట ఏదుల రేవల్లి మండలాల ముఖ్య నాయకుల సమావేశం యూసుఫ్ అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. వీలైనంత ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అదే సందర్భంలో ప్రజా సమస్యలను గుర్తించాలన్నారు. ఎన్నికల అనంతరం కూడా ఆ సమస్యలపై పోరాడాలన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

**ఆరు ఎంపిటిసి, ఒక జడ్పిటిసి స్థానంలో పోటీ**

మూడు మండలాల్లో ఆరు ఎంపిటిసి స్థానాలకు ఒక జడ్పిటిసి స్థానానికి పోటీ చేయాలని తలుపునూరులో జరిగిన మూడు మండలాల ముఖ్యుల సమావేశంలోనిర్ణయించామని విజయరాములు చెప్పారు. గోపాల్పేట మండలంలో 2 రేవల్లి మండలంలో రెండు, ఏదుల మండలంలో రెండు ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేస్తామన్నారు. ఇదే సమయంలో ఒక జడ్పిటిసి స్థానాన్ని కూడా పోటీ చేసేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి జే రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య, వనపర్తి పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, గోపాల్పేట మండల కార్యదర్శి శాంతయ్య, రేవల్లి మండల కార్యదర్శి యూసుఫ్, గ్రామ శాఖల కార్యదర్శులు శేఖర్, తిరుపతయ్య, పుల్లయ్య, దశరథం, అంజి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

- మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు
- మండల కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియ
- మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో వెంటనే నియమావాళి అమలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ ఐ సి హాలు నందు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిపిఓలతో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిటిసి, జెడ్పిటిసి గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని పేర్కొన్నారు. గ్రామపంచాయితి ఎన్నికలను మూడు విడతలుగా జిల్లాలోని 20 మండలాల్లోని 594 గ్రామపంచాయితీలకు 5058 వార్డులలోని పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని అదే విధంగా 20 జడ్పిటిసి, 227 యంపిటిసి స్థానాల ఎన్నికలను రెండు విడతలలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. గ్రామపంచాయితి ఎన్నికలను రెండవ విడతలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్ పేట్, దుద్యాల, వికారాబాద్, ధరూర్, మోమిన్ పేట, నవాబ్ పేట్, బంట్వారం, మార్పల్లి, కోట్‌పల్లి 11 మండలాల్లోని 288 గ్రామపంచాయితిలలో 2490 వార్డులలో, మూడవ విడతలో పరిగి, పూడూర్, కుల్కచెర్ల, చౌడాపూర్, దోమ, తాండూర్, భాసీరా బాద్, యాలాల్, పెద్దేముల్, 9 మండలాల్లోని 306 గ్రామపంచాయితిలలోని 2568 వార్డులలో ఎన్నికలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జడ్పిటిసి, యంపిటిసి ఎన్నికలను రెండు విడతలలో 594 గ్రామపంచాయితీలలోని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామని,జిల్లా లో మొత్తం ఓటర్లు 6,98 ,472 మంది, పురుషులు 3,43,668, మహిళలు 3,54,788, ఇతరులు 16,మొత్తం పోలింగ్ స్టేషన్ లు 1289,పోలింగ్ లొకేషన్లు 614, మొదటి విడత లో 11 మండలాలు 115 ,రెండవ విడత లో 09మండలాలు 112, మొత్తం 227 ఏంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు 4, రిసిప్షన్ సెంటర్లు 4, స్ట్రాంగ్ రూమ్స్ 3, కౌంటింగ్ సెంటర్స్ 3 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హార్స్ చౌదరి, డిపిఓ జయసుధ , పత్రిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులకు పాత్ర కీలకం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- విధులు పగడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయంగా పని చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబందించి , రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకకు ఎన్నికల విధులు, బాధ్యత లు, నియమ నిబంధన ల పైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ల తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత,రిటర్నింగ్ అధికారిదేనని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్‌కు సంబంధించిన సామాగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుదీర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ కీలకమైనదని అన్నారు. అదనపు కలెక్టర్ నామినేషన్లపై రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డిఆర్‌డిఎ శ్రీనివాస్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, డిఆర్‌ఓ మంగీలాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర, ఆర్ అండ్ బి ఇఇ శ్రీధర్ రెడ్డి, ఎన్నికల నిర్వహణకై వివిధ అంశాలకు కేటాయించిన ఆర్వో లు, ఏఆర్వోలు, ఎంపీడీవో లు మండల స్పెషల్ ఆఫీసర్లు, మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
07 అక్టోబర్ 2025

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** సోమవారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ లు, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయక పోవడం చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చదువు కుంటున్నటువంటి ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఈ ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వలన విద్యకు దూరమై ప్రైవేట్ యాజమాన్యాలకు ఫీజులు కట్టలేక మధ్యలోనే విద్యను మానేసి లారీ డ్రైవర్ లుగా, బైక్ రిపేర్ వివిధ రంగాలలో పనిచేస్తున్నారని అన్నారు. మరోవైపు బెస్ట్ అవెలబుల్ పాఠశాలలో కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వలన ఆయా పాఠశాలల యాజమాన్యలు విద్యార్థుల తల్లి దండ్రులకు మాకు ప్రభుత్వం ఫీజులు చెల్లించడం లేదు మీరే



కట్టండి లేకపోతే ప్రభుత్వం చెల్లించిన తరువాత మీ పిల్లలని బడికి పంపించండి అని లేఖలు పంపు తున్న పరిస్థితి ఈ బెస్ట్ అవెల బుల్ పాఠశాల, కళాశాలలో చదువుకునే విద్యార్థులు అంతా కూలి పనిచేసే కార్మికుల పిల్లలు, రైతు కూలిలా పిల్లలు, హమాలి కూలిల పిల్లలు కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నికల మేనిఫెస్టో లో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు చెల్లిస్తామనిహామీ ఇచ్చి నేటికీ చెల్లించక పోవడం పేద విద్యార్థుల భవిష్యత్ లకు చాలా దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీసం త్రాగే నీరు, మరియు మూత్రశాలలు కూడా లేవని అన్నారు.మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల పై కప్పు పెచ్చులు ఊడి పోతున్న ఈ ప్రభుత్వం వాటిపైన చొరవ తీసుకోకుండ చూసి చూడనట్లుగా ఉండడం సరి అయినది కాదని అన్నారు. కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒకసారి అలోచించి ఈ సమస్యలను పరిష్కరించి విద్యా ర్థులకు న్యాయం చేయాలని అన్నారు. లేని యెడల అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి. ఎస్. ఎఫ్. డివిజన్ అధ్యక్షులు రాంచందర్, బహుజన కళావేదిక జిల్లా అధ్యక్షులు గుడిపల్లి శ్రీకాంత్, నాగరాజు నాయకులు సురేష్, సిద్ధు, సాయి కుమార్, వి. చరణ్, కె. చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



**తూప్రాన్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల భాగంగా తూప్రాన్ డివిజన్‌లోని 6 మండలాలకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ కొరకు తూప్రాన్ మండలం, లింగారెడ్డిపేట గ్రామ శివారులో గల నోబెల్ ఫార్మసీ కాలేజీలో కౌంటింగ్‌హాల్‌ను ప్రతిపాదించేందుకు సౌకర్య, భద్రత నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై గౌరవ జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగం వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల నుండి ఫిర్యాదులను ఎస్పీ పరితోష్ పంకజ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..



సమస్యలను ఓపికగా విని, సమస్య జాప్యానికి గల కారణాల గురించి సంబంధిత ఎస్.హెచ్.ఓ లకు ఫోన్ ద్వారా మాట్లాడి.. వివరాలను తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, ప్రతి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేసి, బాదితులకు అండగా నిలవాలని యస్.హెచ్.ఓలకు సూచనలు చేయడం జరిగింది. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పరిష్కారం దొరకని సందర్భంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, స్వచ్ఛందంగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించి, సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో "ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ అవుతుందని, ప్రతి సమస్య పరిష్కారంలో జిల్లా పోలీస్ శాఖ ముందుండి పనిచేస్తుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# కార్మిక సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

- ఈ నెల 18, 19న జిల్లా మహాసభలు
- రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** సంగటిత అసంఘటితరంగాల కార్మికుల పక్షాన న్యాయమైన హక్కుల కోసం వేతనాల కోసం పోరాడి అండగా నిలిచేది సిఐటియు మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ తెలిపారు. సోమవారం సంగారెడ్డి లోని సుందరయ్య భవన్ లో సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని. పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తూ 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తున్నాయని ఆరోపించారు. శిగాచి వంటి పరిశ్రమలో కార్మికులు చనిపోతే బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు పూర్తిస్థాయి పరిహారం దక్కలేదని అనేక తరహాలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన పూర్తిస్థాయిలో న్యాయం




జరగలేదన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. మల్లేశం సాయిలు మాట్లాడుతూ ఈనెల 18, 19వ తేదీలలో జిల్లా మహాసభలు సదాశివపేట పట్టణంలో రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ సీనియర్ నాయకులు వీరయ్య ,పాలడుగు భాస్కర్ ఆధ్వర్యంలో వెయ్యి మంది ప్రతినిధులతో నిర్వహిస్తున్నామన్నారు. సంగటిత రంగంలో లక్షన్నర అసంఘటిత రంగంలో మూడున్నర లక్షల మంది కార్మికులు జిల్లాలో పనిచేస్తున్నప్పటికీ వారికి న్యాయపరంగా రావాల్సిన హక్కులు గాని, కనీస వేతనాలు కానీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. యాజమాన్యాలు లోపబోయిష్టంగా లాభార్జన లక్ష్యంగా అన్ స్కిల్డ్ లేబర్ తో పనిచేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ప్రధానంగా ఉత్తరాది చెందిన కార్మికులు ఎక్కువగా ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల మహాసభలో మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలు సాధించిన ప్రగతి భవిష్యత్ తరాల్లో చేయాల్సిన కార్యచరణ నూతన కమిటీ ఎన్నికపై సమావేశాల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 28 మండలాలు వివిధ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్మికులు ఎక్కువ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు మాణిక్యం, యాదగిరి ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగ కుల ధృవీకరణ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

- కలెక్టరేట్ ఏవోకు కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ వినతి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక ఎన్నికలల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయు అభ్యర్థు కొందరు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి అంతకు ముందు నుండి క్రిస్టియన్స్, కన్వర్టెడ్ క్రిస్టియన్స్,కన్వర్టెడ్ ముస్లింలు తమను తాము ఎస్సీలుగా, బీసీలుగా ఆచరిస్తున్నట్లు దొంగ సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలిసిందని వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ఏవో జయసుధకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలల్లో తప్పుడు కుల సర్టిఫికెట్ తీసుకొని ప్రభుత్వ అధికారులను ఎలక్షన్ కమిషన్



ను తప్పుదోవ పట్టించి ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వీరికి కొన్ని రాజకీయ పార్టీలు వత్తా సు పలికి తమ అభ్యర్థులుగా ప్రకటింపజేసుకునే ప్రయత్నా లు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మతం మారి హిందూ మతాన్ని విడిచిపెట్టి క్రిస్టియన్స్‌గా ప్రతి ఆదివారం చర్చిలకు పోయి క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న కొందరు హరిజనులు మాల మాదిగలు ఇంకా హిందూ మతంలోనే ఉన్నట్లు తమకు ఎస్సీ సర్టిఫి కెట్లు తీసుకున్న వారిని గుర్తిం చాలని కోరారు. హైకోర్టులు, సుప్రీంకోర్టు కూడా హిందూ మతం మారిన హరిజన, గిరి జనులను ఎస్సీలుగా, ఎస్టీ లుగా, బీసీలుగా గుర్తించ రాదని స్పష్టమైన తీర్పులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మతం మారిన హరి జనుల, గిరిజనుల నుండి నిజమైన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం కలిగే ప్రమాదం ఉందన్నారు.నిజమైన హరిజన, గిరిజన, బడుగు బల హీన వర్గాలకు న్యాయం జర గాలంటే అధికారుల పరిధిలో ఉన్న అన్ని రకాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కుల సర్టిఫికెట్లను స్పష్టంగా క్షేత్ర స్థాయి విచారణ చేసి అసలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరిగే విదంగా ఇదివరకు తీసుకున్న తప్పుడు కుల సర్టిఫికెట్లను రద్దు చేయాలని కోరారు.

## సినీ హీరో విజయ్ దేవరకొండకు త్రుటిలో తప్పిన ప్రమాదం

**మానవపాడు, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ఉండవెల్లి మండలం సీడ్ కాటన్ మిల్లు సమీపములో: సినీ హీరో విజయ్ దేవరకొండ కారుకు యాక్సిడెంట్.. మేనేజర్ రవికాంత్ యాదవ్, డ్రైవర్ అందే శ్రీకాంత్తో కలిసి విజయ్ దేవరకొండ పుట్టపర్తి వెళ్లారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు కారులో



బయల్దేరారు. అయితే గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం 44వ జాతీయ రహదారి వరసిద్ధి వినాయక పత్తి మిల్లు దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. నందికొట్కూరు నుంచి పెబ్బేరుకు పశు వులను తీసుకొని వెళ్తున్న బస్సు సడన్ బ్రేక్ వేయడంతో బొలెరో వాహనాన్ని విజయ దేవరకొండ వాహనం ఢీకొంది. దీంతో విజయ్ దేవరకొండ కారు పాక్షికంగా దెబ్బతింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అందే శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన అనంతరం మరో కారులో విజయ్ దేవరకొండ హైదరాబాదుకు వెళ్లారు.

# రెగ్యులర్ బస్సులలో స్పెషల్ చార్జీల వడ్డన ఆపాలి

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ బస్సు డిపో మేనేజర్ యాదయ్య కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర మాజీ ఈసీ మెంబెర్ పృథ్వీరాజ్, జిల్లా ఇంచార్జ్ కళ్యాణ్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పండగల పూట ప్రజా రవాణా సంస్థ ద్వారా ప్రజలపై అదనపు చార్జీల భారం మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తూందని అన్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి రాష్ట్రములో అతి పెద్ద పండగలు అనీ పండగల పేరుతో ప్రజా రవాణాను ప్రభుత్వం ఈ రకంగా దుర్వినియోగం చేయడం తగదన్నారు. ప్రజా రవాణా ప్రయివేట్ వాహనాల ద్వారా నిరంతరం జరుగుతున్న ఆర్టీసీనీ ఆదరిస్తున్న ప్రజలపై అదనపు చార్జీల వడ్డన తగదన్నారు. పండగలు అయిపోయి 2-3 రోజులు గడిచాక కూడా ఇంకా స్పెషల్ చార్జీలు వసూలు చేయడం ఏంటని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఫీజు రీ ఎంబర్స్మెంట్ పెండింగ్, ఆరోగ్య శ్రీ బిల్లుల్లు పెండింగ్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కు ఇవ్వాల్సిన



బిల్లులు పెండింగ్ ఇలా ప్రతిదీ పెండింగ్ పెడుతూ, పెండింగ్ గవర్నమెంట్ గా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ బస్సులలో స్పెషల్ చార్జీల వడ్డన ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా కోశాధికారి దాస్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బోనాసి భాస్కర్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు రాంచందర్, నాయకులు మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

- జిల్లా ఎన్నికల కన్వీనర్ ఎస్. రామచంద్రారెడ్డి

**మల్దకల్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** త్వరలో జరగబోయే ఎంపిటిసి,జడ్పిటిసి స్థానాలను బిజెపి కైవసం చేసుకోవాలని బిజెపి జిల్లా ఎన్నికల కన్వీనర్ ఎస్ రామచంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బిజెపి కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత పార్లమెంటు ఎలక్షన్లలోమల్దకల్ మండలంలో 5000 మెజార్టీతో ఓట్లు, 52 బూతులలో మెజార్టీ సాధించిందని, బిజెపి పార్టీ మిగతా 52 బూతులలో రెండు పార్టీలు కలిసి కూడా బిజెపి పార్టీకి వచ్చిన ఓట్లకు సమానం కాదని,గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారని,ప్రతి ఎంపీటీసీ,జెడ్పిటిసి స్థానాలకు బిజెపి పార్టీ నుండి మొత్తం స్థానాలకు పోటీ చేస్తుందన్నారు.ఒక్కొక్క స్థానానికి ముగ్గురు ఐదు మంది వరకు పోటీదారులు ఉండడం చాలా సంతోషం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలనినెరవేర్చలేదన్నారు. రాబోయే స్థానిక ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలను కచ్చితంగా బిజెపి పార్టీ గెలుస్తుందని, స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి



వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఇంచార్జ్ నల్లారెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు, జిల్లా కన్వీనర్ డి.నాగరాజ్, తిమ్మన్న జిల్లా కౌన్సిల్ నెంబర్ ఏవి రెడ్డప్ప, వాసురెడ్డి కృష్ణారెడ్డి, మురలీధర్ రెడ్డి, బీజేవైఎం ఉపాధ్యక్షులు శివప్రసాద్, వెంకటేష్, తిమ్మప్ప, రాజశేఖర్, తిమ్మారెడ్డి, సాయినాథ్ రెడ్డి, ప్రతాప్, గోకారి, రామకృష్ణ, నరసింహ, ఎద్దుల గోకారి, రఘు, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్మికులకు పర్మినెంట్ చేయాలి

- అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** కాంట్రాక్ట్ ఔర్సోర్సింగ్ ఉద్యోగులకు కార్మికులకు పర్మనెంట్ చేయాలనీ, స్కీం వర్కర్లను కార్మికులకు ఉద్యోగాలుగా గుర్తిస్తూ పర్మనెంట్ చేయాలనీ,వారికి కనీస వేతనాలు అమలు చేయాలనీ ఉద్యోగ సాంఘిక భద్రతను గ్యారంటీ చేయాలని సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ కు వినతి పత్రం అందజేసినట్లు ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి జమ్మి చెడు కార్తీక్ అన్నారు. పాలక సర్వీస్ రంగాల్లో దశాబ్ద కాలంగా వివిధ ప్రవేటు విభాగాల్లో శ్రమిస్తూ ఉత్పత్తిలో సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కార్మికుల, స్కీమ్ వర్కర్ల వేతనాలను పెంచాలని దీర్ఘకాలంగా అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగ సాంఘిక భద్రత కనీస వేతనాలు పని స్థలాల్లో రక్షణ తదితరుల సమస్యల పరిష్కార విషయంలో సంవత్సరాల తరబడి ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు సంబంధిత అధికార యంత్రం పట్టించుకోకపోగా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని



అన్నారు. 2020-21 నాటికి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సర్వీస్ కొనసాగింపు ఉత్తర్వులు సంవత్సరానికి ఒకసారి మార్చే పద్ధతి ఉండేది ఈ పద్ధతి ఆరు నెలలకు కుదించి నాలుగేళ్లుగా అమలు చేస్తున్నారనీ, ఇది కార్మికులకు అత్యంత నష్టకరమైనది కనీస వేతనాలు అమలు చేయడం లేదనీ, 74 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్లో పనిచేస్తున్న ఒక పూట 20 లక్షల మంది కార్మికులకు ఉద్యోగులను ఉద్దేశించబడిన కనీస వేతనాలు జీవోల కాలం దశబ్ద కాలం కావస్తున్న విడుదల కాలేదనీ, 1947 అధికార మార్పిడి మొదలు 2014 వరకు గ్రామపంచాయతీ కార్మికుల వేతనం 500 నుండి 25 వేల వరకు ఉండేదనీ, కార్మికులు పోరాట ఫలితంగా వేతనాన్ని 2005 సెప్టెంబర్ 29 నాటికి జీవో ఎంఎస్ నెంబర్ 51 ప్రకారం 1,271 రూపాయి పంచాయత్ లో పనిచేస్తున్న సుమారు 42,000 మంది కార్మికులకు వేతనం 8,500 నుండి 9,500 వరకు ఇస్తున్నారు అంటే కనీస వేతనం లేని వ్యక్తి చాకిరి కార్మికులుగా జీవనం కొనసాగిస్తున్నారనీ, రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులతో సహా 14 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ రంగాల్లో పనిచేస్తున్నటువంటి చాలామంది కార్మికులు పనిచేస్తున్నారు వీరి జీవన ప్రమాణాలను తగ్గినట్టుగా ఆదాయం లేదు ఇక వీరికి కనీస వేతనాలు సమాన పనికి సమాన వేతనం సామాజిక భద్రత ఓసి లేదు ఉపాధి ఉద్యోగ భద్రత గ్యారెంటీ లేదు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొండపురం నర్సింలు, మల్లెం దొడ్డి రాముడు, బిజ్వారం గోవిందు, బుడ్డన్న, వెంకటేష్,తిమ్మన్న,గంజిపేట కోళ్ల అంజి,బీరెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రథమ కర్తవ్యం



**మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా నలుమూలల నుండి వచ్చిన పౌరులను కలిసారు. ఈ సందర్భంగా మొత్తం 10 వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి పిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ, సంబంధిత విభాగాల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల ప్రతి సమస్యను గౌరవప్రదంగా విని తక్షణ చర్యలు తీసుకుంటామని, త్వరితగతిన న్యాయం జరగేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, పారదర్శకతతో సేవలు అందించడం పోలీసు విభాగం ప్రధాన ధ్యేయమని తెలిపారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసు విభాగం ఎల్లప్పుడూ భరోసా నిస్తుంది అని ఎస్పీ హామీ ఇచ్చారు.

## ప్రజలను మోసం చేసింది..

# అవినీతికి పాల్పడింది బీఆర్ఎస్సే

- పదేళ్ల పాలనలో తెలంగాణాను దోచుకున్నారు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో బీఆర్ఎస్ ధోకా కార్డు పత్రాల ఆవిష్కరణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజలను మోసం చేసింది.. అవినీతికి పాల్పడింది బిఆర్ఎస్సేనని, పదేళ్ల పాలనలో తెలంగాణాను దోచుకున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ధ్వజమెత్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ చేసిన మోసాలకు వివరిస్తూ ముద్రించిన బీఆర్ఎస్ ధోకా కార్డు పత్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాలలో తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ దుష్ప్రచారం చేయడం చాలా సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి విస్మరించింది వాస్తవం కాదా అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని అనేక వాగ్దానాలు చేసి ఆ పార్టీ ప్రజలను ధోకా చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందన్నారు. అన్ని రంగాల్లో మోసం చేసింది బీఆర్ఎస్సే నని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తుందని, రానున్న రోజుల్లో భూపాలపల్లి అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతానని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో టిపిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పిసిసి సభ్యులు చల్లూరి మధు, పరకాల మాజీ మార్కెట్ చైర్మన్ చాడ రఘునాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ లీడర్లు, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, బుర్ర కొమురయ్య, ముంజాల రవీందర్, దాట్ల శ్రీను, పెరుమాండ్ల తిరుపతి, సుంకరి రాంచందర్, తోట రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి బాకీ అనే పదం ఎత్తే అర్హత లేదు

- మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది బిఆర్ఎస్
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ పార్టీకి బాకీ అనే పదం ఎత్తే అర్హత లేదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విమర్శించారు. సోమవారం హనుమకొండలోని డిసిసి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డు ప్రచారం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని మండిపడ్డారు. బీఆర్ ఎస్ పాలనలో 7 లక్షల కోట్ల అప్పులు చేసింది మీరు కాదా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఆ అప్పులకు వడ్డీలు కడుతూనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ మద్దతు ఇవ్వకుండా బిజెపి కొమ్ము కాసిందని విమర్శించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ లను నియమించకుండా విద్యార్థులకు అన్యాయం చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్నారు, ఇంటికో ఉద్యోగం ఇలా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. 40 లక్షల మంది పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా బాకీ పడ్డది భారత రాష్ట్ర సమితి కాదా అని నిలదీశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాలను సరి చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో పాటు యువతకు 59 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఈ స్థాయిలో ప్రజా సంక్షేమానికి కృషి చేసిన రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేస్తుంది బాకీ కార్డ్ కాదు అని అది డోకా కార్డు అని విమర్శించారు. ఈ డోకా కార్డు ద్వారా ప్రజలకు ఆధారాలతో సహా నిజాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజుల్లో అండగా నిలవాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం నిలిపివేయండి

- మంచిర్యాల జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** జిల్లాలో చిన్నపిల్లలలో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని మంచిర్యాల జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.జి. హెచ్.ఎస్.), తెలంగాణ రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే ఆపాలని, సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీ పురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎన్ఆర్-13 నుండి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వల్ల చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించడం జరిగిందని, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అనేక మంది పిల్లల మరణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు, ఫార్మసీ కేంద్రాలు, చిన్నపిల్లల వైద్యులు, ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదని, సిరప్ నిల్వలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో / టోల్ ఫ్రీ నం. 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రభావిత బ్యాచ్ సిరప్ నిల్వలను గుర్తించి, నిలిపివేయడానికి ఫార్మసీలు, హోల్ సేల్ వ్యాపారులు, ఆసుపత్రులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని గ్రామాలలో ఉన్న ఫార్మసీల వద్ద ఉన్న సిరప్ ల వివరాలు తీసుకోవాలని తెలిపారు. 2 సం॥ల వయస్సు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని, తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని, ఫార్మాసిస్టులు / డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 06(జనంసాక్షి) :** ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలసి ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కొరకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం జరగకుండా కార్యదీక్షతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి విషయంలో అత్యంత జాగ్రత్త పాటించాలన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి రిటర్నింగ్ అధికారులు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి మండలంలో మూడు లేదా నాలుగు ఎంపీటీసీ లకు ఒక రిటర్నింగ్ అధికారినీ, ప్రతి జెడ్పిటిసి కు రిటర్నింగ్ అధికారిని నియమించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ నియమావళి ప్రకారం ఎన్నికల నోటీసు ఇవ్వాలని, నామినేషన్ల పేపర్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీసు బోర్డు పై స్వీకరించిన అభ్యర్థుల నేషన్ పత్రాల జాబితా, స్వీయ ప్రకటన ప్రతులను ప్రచురించాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఏదేని నామినేషన్ పత్రాన్ని తిరస్కరించినచో దానికి గల కారణం తెలపాలని, నామినేషన్ పత్రాల జాబితా ప్రచురించాలని, అభ్యర్థుల ఉపసంహరణ నోటీసు స్వీకరించాలని, పోటీ చేయు జాబితా, గుర్తులు కేటాయింపు పోస్టల్ బ్యాలెట్ పేపర్ పోలింగ్ కేంద్రాలు ఉపయోగించే బ్యాలెట్ పేపర్ ముద్రణ, ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడినప్పటి నుండి ఫలితాలు ప్రకటించేవరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు,మాస్టర్ ట్రైనర్లు, పాల్గొన్నారు.

# పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్పై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 6 (జనం సాక్షి) :** దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపు ఉత్సవాల్లో భక్తులపై దురుసుగా ప్రవర్తించి , దాడి చేసిన సబ్ ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలో దుర్గాదేవి ఊరేగింపు ఉత్సవ సందర్భంగా మహిళలు అని కూడా చూడకుండా దాడి చేయడం పట్ల ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో జైనూరు ఘటన నుండి ప్రతిచోట ఏదో ఒక రకంగా ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్గా చేసుకొని పోలీసు అధికారులు నిబంధనలు అతిక్రమిస్తూ, హద్దులు మీరుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# వరుస దొంగతనం కేసుల్లో ముగ్గురు అరెస్టు

- 213 గ్రాముల బంగారం, రూ.లక్షా13 లక్షలు స్వాధీనం



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 6 (జనం సాక్షి) :** కాగజ్ నగర్ పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల ను భయాందోళనలకు గురి చేస్తున్న దొంగలను పోలీసు అధికారులు ఎట్టకేలకు పట్టుకున్నారు. సోమవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో డి.ఎస్.పి వహీయోద్దీన్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఓల్డ్ కాలనీకి చెందిన స్కావెంజర్ గా పనిచేస్తున్న గాలోత్ కుశాల్ మరి ఇద్దరితో కలిసి పట్టణంలోని పలువురి ఇండ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. వీరి వద్దనుండి రు.1.13 లక్షలు నగదు, 20 తులాల 13 గ్రాముల బంగారు నగలను స్వాధీన పరుచుకున్నట్లు డిఎస్పి వివరించారు. కుశాల్ మరో వ్యక్తి స్థానికంగా ఓల్డ్ కాలనీలో నివసిస్తున్న ఓర్సు అనిల్, మరో వ్యక్తి కుశాలకు బంధువైన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జై కుమార్ తో కలిసి వ్యూహాత్మకంగా తాళం వేసిన ఇళ్లను పగటిపూట గుర్తించి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడేవారని వివరించారు. పట్టణానికి చెందిన కిషోర్ కుమార్ లోయ వ్యాపారి, ఎస్పీ ఉద్యోగి సింగని లక్ష్మణ్, మరో ఎస్పిఎం ఉద్యోగి భూపాల్ రావు, ఎస్పీఎం కాంట్రాక్టర్ హేమచంద్రరావు, మరో ఎస్పీ ఉద్యోగి నరేంద్ర వర్మ లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి ఆధారంగా విచారణ చేపట్టగా ఓల్డ్ కాలనీ చెందిన గాలోత్ కుశాల్ ఈ దొంగతనాలకు సూత్రధారిగా వివరించి దొంగతనాలు చేసినట్లు డి.ఎస్.పి వహీయోద్దీన్ వివరించారు. ఈ సమావేశంలో కాగజ్ నగర్ పోలీసు అధికారి ప్రేమ్ కుమార్, కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ లు పాల్గొన్నారు.


# వంతెనపైకి నీటి ప్రవాహం

- అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్తో చేరిన నీరు
- ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం



**మహదేవపూర్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ ప్రవహించడంతో చంద్రుపల్లి వంతెనపై నీటి ప్రవాహం పెరగడంతో వంతెన మునిగి ఆ గ్రామాల్లో ప్రజల రాకపోకలకు నిలిచిపోయినవి. గత ఐదు సంవత్సరాల 5 సంవత్సరాల నుండి అన్నారం బ్యారేజ్ బ్యాక్ వాటర్ తో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో పంట చేన్లలోకి నీరుచేరి పంట నష్టం జరుగుతుందని ప్రభుత్వం పంట నష్ట పరిహారం కూడా ఇవ్వడం లేదని, గోదావరి నీటిమట్టం అధికముగా పెరగడంతో చంద్రుపల్లి వంతెనపై నీరు చేరడం వల్ల చుట్టూ గ్రామాల్లో ప్రజల రాకపోకలకు అంతరాయం జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులు పర్యవేక్షణ చేసి హై లెవెల్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## నెక్కొండ రైల్వేస్టేషన్లో సౌకర్యాలేవీ?



**నెక్కొండ (జనంసాక్షి) :** నెక్కొండ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ లో ఆదాయం ఎక్కువగా ఉన్న రైల్వే ప్రయాణికులకు రైల్వే స్టేషన్లో రైళ్ల కోసం ప్రయాణికులు నిల్చోళ్ళు ఉండాలి గాని వారికి కనీస కూర్చోవడానికి బెంచీలు, మిద్దెలు ఏమీ లేవు. నర్సంపేట, చెన్నారావుపేట, గూడూర్, పర్వతగిరి నుండి ప్రయాణికులు నెక్కొండ రైల్వే స్టేషన్ ఒకటి మాత్రమే ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతునట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.సోమవారం హనుమకొండ లోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వరంగల్ హనుమకొండ జనగామ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్, రిజ్వాన్ బాషా షేక్, డిసిపిలు, ఏసీపిలు, జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారుఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్ పోస్టుల ఏర్పాటు, బందోబస్తు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై పోలీస్ కమిషనర్, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీసీపీలు, జిల్లా పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈవోలు, ఆర్డీవోలు, ఏసీపిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ హనుమకొండ వరంగల్ జనగామ జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. గత ఎన్నికల నిర్వహణలో అనుసరించిన విధానం, నమోదైన కేసులపై పరిశీలన చేయాలని అధికారులకు, ఏసీపిలకు కమిషనర్ సూచించారు. రూట్ లు, జోన్ల వారిగా మ్యాపులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టు లను, ఎస్ఎస్టీ బృందాలను ఏర్పాటు చేసి డబ్బు, మద్యం తరలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి చర్చించిన అంశాలలో పోలీస్ శాఖ తరపున చేయాల్సిన అన్ని చర్యలు చేపడతామన్నారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రూట్ మ్యాపులను ఎంపీడీవో లు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్ల వారీగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్ట్, ఎస్ఎస్ టి బృందాలు తనిఖీలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు నియమించు సిబ్బంది, పోలింగ్ కేంద్రాల, రూట్ ల ఏర్పాటు పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు.జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో సజావుగా ఎన్నికల నిర్వహణపై సమీక్ష చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అంత సిద్ధంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి సంధ్యారాణి, జడ్పీ సీఈఓ లు రవి, రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు కల్పన, లక్ష్మీ రమాకాంత్, సస్వరూప, ఆర్డిఓ ఉమారాణి, ఇతర అధికారులతో పాటు ఏసీపీలు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలని

# బాకీ కార్డు ఉద్యమం

- హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడం ఖాయం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి
- భూపాలపల్లిలో ఇంటింటికి తిరుగుతూ కార్డులు పంపిణీ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ బాకీ కార్డు పేర ఉద్యమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లి, భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి 'కాంగ్రెస్ బాకీ కార్డు' లను ఇంటింటికి ఇచ్చి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ప్రజలకు బాకీ ఉన్న హామీలపై వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఎన్నికల హామీలు అమలు అయ్యే వరకు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అందుకోసమే కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ప్రతి ఇంటికి ఇచ్చి, ఎన్నికల హామీలను ప్రజలకు గుర్తు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే విధంగా ప్రజలు సిద్ధంగా ఉండాలని, వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు, కాంగ్రెస్ బాకీ కార్డులను ఉద్యమంలా తిరుగుతూ పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, ఎన్నికల హామీలను అమలు చేసి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీడర్లు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్దు, కటకం జనార్ధన్, మందల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించిన మహిపాల్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య



**యాలాల్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** యాలాల మండల కేంద్రంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రెస్ మీట్ లో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా యాలాల మండలం లక్ష్మీనారాయణ పూర్ గ్రామంలో దుర్గామాత నిమజ్జనం రోజు దుర్గామాత మంటపం దగ్గర మ్యాతరీ వెంకటప్ప మెడలో నుండి టవల్ తీసి పారేయడం జరిగింది.ఇట్టి విషయాన్ని మరుసటి రోజు రాత్రి లక్ష్మీనారాయణ పూర్ గ్రామంలో మాల రమేష్ కిరాణా షాపు దగ్గర మ్యాతరీ వెంకటప్ప కురువ.మహిపాల్ ని నిన్న ఎందుకు నామెడల నుండి టవల్ తీసి పడవేసినావని ప్రశ్నించగా, మహిపాల్ అసభ్య పదజాలంతో తిట్టి కులం పేరుతో మ్యాతరీ వెంకటప్ప ను దూషించి విచక్షణ రహితంగా దాడి చేసి మళ్ళీ ఇంటికి వెళ్లి గంట తర్వాత మళ్లీ వచ్చి రెండవసారి దాడి చేయడం జరిగిందని తెలిపారు.వికారాబాద్ జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో దళితులపైన,అనగారిన వర్గాలపైన దాడి చేయడం గాని కులం పేరుతో దూషించడం గాని దౌర్జన్యాలు అధికంగా అయినవి అని ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వికారాబాద్ జిల్లా నుండి ప్రాతినిధ్య వహిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యొక్క జిల్లాలోనే అణగారిన వర్గాల పైన దళితులపైన దాడులు జరుగుతు ఉంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దళితుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించారు.లక్ష్మీనారాయణ పూర్ గ్రామంలో దళితుల పైన అగ్రవర్ణాల వారు కుల ఆధిపత్య ధోరణి తోటి దళితులను అవమాన పరుస్తూ దాడులు,దౌర్జన్యాలు చేస్తున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలో వినాయక నిమజ్జనం,దుర్గామాత నిమజ్జనం లో భాగంగా దళితులని అవమానపరుస్తూ కించపరిచే విధంగా ఆధిపత్య కులాలు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. దళితుడైన మ్యాతరీ వెంకటప్పను కులం పేరుతో దూషించి దాడి చేసిన కురువ మహిపాల్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తాండూర్ డిఎస్పీ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేతరి వెంకటప్ప పై దాడి చేసి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పోలీసులు పట్టించుకోవడం లేదు అని అన్నారు.ఈ కార్యక్రమంలో బాధితుడు మ్యాతరీ వెంకటప్ప,మ్యాతరీ నర్సమ్మ,నాయకులు చెన్నారం రవికుమార్, అనంతప్ప,అనంతప్ప,లాలూ ప్రసాద్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో అక్రమార్కులకు అధికారులు బాధ్యత వహించాలి



**మహేశ్వరం, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఓటరు జాబితాలో జరుగుతున్న అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ పిలుపుమేరకు సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో ఓటు చోరీ పై సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమ ఓటు చోరీపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా యుద్ధం చేస్తుందన్నారు.అర్హులైన ఓట్లను నమోదు చేయాలన్నారు.ఎలక్షన్ నోటిఫికేషన్ కు ముందే ఫోటోలతో కూడిన ఓటర్ లిస్టును బహిరంగ పరచాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టేల మల్లేష్ యాదవ్, నందిగామ నర్సింహ,కాకి ఈశ్వర్,నడికూడ శివ,శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, నర్సింహ యాదవ్, రాజు నాయక్, ఏపూరి నర్సింహ,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెనుబల్లిలో అరుదైన నక్షత్ర తాబేలు లభ్యం



**పెనుబల్లి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామంలో తాబేలు జాతిలో అరుదైన నక్షత్ర తాబేలు సోమవారం ఓ వ్యక్తికి తారసపడింది, పెనుబల్లి గ్రామపంచాయతీ నాయకుల బజారుకు చెందిన నడిపి అనే వ్యక్తి వాగుల్లో, కాలువల్లో చేపలు పట్టేందుకు వెళ్లిన సమయంలో ఈ అరుదైన నక్షత్ర తాబేలు దొరికింది, ఆ వ్యక్తి తాబేలును తన ఇంటి వద్ద భద్రపరిచాడు, అంతరించిపోతున్న నక్షత్ర తాబేలు ఓ సామాన్య వ్యక్తికి దొరకడంతో ఆ తాబేలు చూ పరులను ఆకర్షిస్తుంది. ఈ తాబేలు భారత్, శ్రీలంక, పాకిస్తాన్ దేశాలలో చాలా అరుదుగా కనిపిస్తుంది, సముద్రపు ఒడ్డున అడవుల్లో నేలపై జీవించే ఓ అరుదైన తాబేలు.

# ఘనంగా సీరతున్ నబి జల్సా

- మనిషికి భూలోకం శాశ్వతం కాదు పరలోకమే శాశ్వతం
- భూలోకంలో చేసిన ప్రతి పనికి పరలోకంలో అల్లాకు జవాబు చెప్పాల్సి ఉంటుంది
- అతిథులకు యువకులు భారీ ర్యాలీతో స్వాగతం



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ప్రస్తుత తరుణంలో మనిషి స్వార్థపూరితమైన నా, నేను, నాకు అనేటువంటి జీవితం కొనసాగిస్తున్నాడని, భూలోకం మనిషికి శాశ్వతం కాదని పరలోకం శాశ్వతమని, భూలోకంలో చేసిన ప్రతి పనికి పరలోకంలో అల్లాకు జవాబు చెప్పాల్సి ఉంటుందని హజ్రత్ మౌలానా మహ్మద్ అబ్దుల్ రహీంబ నయీమ్ సాబ్, హజ్రత్ మౌలానా ముఫ్తి సయ్యద్ అంజద్ అలీ ఖాస్మి సాబ్, హాఫిజ్ అబ్దుల్ అజీజ్ సాబ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఈద్గా కమిటీ, మదర్సా మిస్బా ఉల్ ఉలుమ్, ఇస్లాహే ముఆష్ రా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ సిరతున్ నబి జల్సా కార్యక్రమంలో దాదాపు 3,000 మంది సమక్షంలో రెండు సామూహిక వివాహాలు జరిపారు. ఈ జల్సా కార్యక్రమంలో వీరితోపాటు హజ్రత్ మౌలానా మహ్మద్ ఉమర్ అబిదీన్ ఖాస్మి సాబ్, హజ్రత్ మౌలానా ఎహ్సానోద్దీన్ సాబ్, హజ్రత్ మౌలానా నిజామోద్దీన్ సాబ్, నాజిమ్ జల్సా హజ్రత్ మౌలానా ఖవి సాబ్, ముఫ్తి జావీద్ హుస్సేన్ ఖాస్మి సాబ్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి అమూల్యమైన ప్రసంగాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజాన్ని అనేక చెడులు రుగ్మతలు పట్టిపీడిస్తున్నాయని వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా దైవ విశ్వాసులపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉందన్నారు. చావు పుట్టుకల మధ్యన ఉన్న జీవితం ఒక పరీక్షలు వంటిదని దీనిపైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉంటాయని అన్నారు. అనంతరం అతిథులకు శాలువాలతో సత్కరించి వారి దువాను పొందారు. ఈ జల్సాలో మహిళలు, యువకులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులకు భారీ ర్యాలీతో యువకులు స్వాగతం పలికారు. స్థానిక ఏఎస్పీ మౌనిక ఐపీఎస్, సీఐ వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ సమయంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన సందర్భంగా ముస్లిం సమాజం తరఫున కమిటీ అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు. ఈ జల్సా కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమొద్దీన్, ఇస్లాహే ముఆశారా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాజా మొహినుద్దీన్, ఇలియాస్ పటేల్, ఈద్ కమిటీ, ఇస్లాహే ముఆశారా కమిటీ సభ్యులు, ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

- జిల్లా విద్యాధికారి రేణుకా దేవి



**మర్పల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకా దేవి అన్నారు. సోమవారం మర్పల్లి మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ మర్పల్లి పాఠశాలను సందర్శించి, అక్కడ ఉన్న తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఫిజిక్స్ ల్యాబ్ లకు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పాఠశాలలో గల సౌకర్యాలను అన్నింటిని వినియోగించుకొని మంచి ఉత్తీర్ణత సాధించి మంచి భవిష్యత్తును నిర్మించుకొని సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజిలయ్య, ఉపాధ్యాయులు నీలకంఠం, యాదయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారి

- వరద నీటికి రోడ్డు పక్కన భారీ గుంతలు
- మృత్యువాతకు ఎదురుచూస్తున్న వైనం..?
- జాడ లేని ఆర్ అండ్ బి శాఖ అధికారులు
- తక్షణమే స్పందించి ప్రమాద నివారణ చర్యలు కొనసాగించాలంటూ విజ్ఞప్తి



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి ప్రధాన రహదారి వర్షపు వరద నీరుకు కొట్టుకుపోయి భారీ గుంతలుగా ఏర్పడి మృత్యువాత కి ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో ప్రధాన రహదారి అయిన అన్నపురెడ్డిపల్లి మెయిన్ రోడ్డు గల జి సి సి పెట్రోల్ బంకు ప్రాంతంలో భారీగా గుంతల ఏర్పడటమే కాకుండా వాహనదారులు సైతం చీకటలో ప్రయాణించే సందర్భంలో కవలెంబించినట్టు కొందరు ప్రత్యేక సాక్షులు సైతం మీడియాకి తెలుపుతున్నారు. అదే కాకుండా ఇటువంటి ప్రమాదకరమైన గుంతలలో టూవీలర్లు ప్రమాదవశాత్తు పడినట్లయితే ప్రాణాలు సైతం విడిచిపెట్టే పరిస్థితి కనిపిస్తుందని ఇక భారీ వాహనాల పరిస్థితి ఏమిటో అధికారులే అర్థం చేసుకోవాలని ప్రజానీకం అధికారులు తీరు తప్పుపడుతున్నారు ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తక్షణమే నివారణ చర్యలు చేపడితే మనుషుల ప్రాణాలను నిలబెట్టే వారు అవుతారని అధికార యంత్రాంగం స్పందించాలంటూ అన్నపురెడ్డిపల్లి ప్రజలు కోరుకుంటున్నారు.

## తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



- వాగ్దానాలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- అలయ్ బలయ్‌లో మాజీ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల కేంద్రంలో అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అలయ్ బలయ్ కార్యక్రమానికి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ఆసరా పింఛన్ లు, కల్యాణ లక్ష్మి, తులం బంగారం ఇలా అన్ని హామీలను నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆందోల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ,ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, రాహుల్ కిరణ్ చంటి, రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంతూర్ శశికుమార్, వట్పల్లి నాయకులు వీరారెడ్డి, నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను కోరుకుంటున్న ప్రజలు



- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని మాజీమంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 22 నెలల నుంచి ప్రజలకు ఇచ్చిన మోసాలను ఎన్నికల హామీ బాకీ కార్డులను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ 22 నెలల నుంచి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు.కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్లు అడగానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను మభ్యపెడుతుందన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను బీఆర్ఎస్ శ్రేణులు గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, నాయకులు హన్మగల్ల చంద్రయ్య,కర్రోల్ల చంద్రయ్య ముదిరాజ్, అంబయ్య యాదవ్,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని ఆమనగల్లు పశువైద్యశాల సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు



**వేములపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** అందుబాటులో ఉండి సమయపాలన పాటించి పశువులకు నిరంతరం మెరుగైన వైద్య సేవలను అందించాల్సిన పశువైద్యశాల సిబ్బంది ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ సకాలంలో విధులకు హాజరుకాకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నామని ఆమనగల్లు గ్రామ పాడి రైతులు నార్ల అనంతయ్య, కోలా మిన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానికంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పశువైద్యశాల వైద్యుడు, సిబ్బంది సమయపాలన పాటించకుండా ఎప్పుడు పడితే అప్పుడు విధులకు హాజరు కావడంతో పశువైద్యాధికారి ఎప్పుడు ఆసుపత్రికి వస్తారో ఎప్పుడు వెలతారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.పశువైద్యశాల ఎప్పుడూ చూసిన మూసే ఉంటుందని వర్షాకాలంలో పశువులు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతుండగా వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చినట్లయితే వైద్యుడు సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్నారు. ప్రభుత్వం పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులను సరఫరా చేస్తున్నప్పటికీ ఆసుపత్రిలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నామన్నారన్నారు. వ్యవసాయ ఆధారిత పాడి పంటలపై జీవనం సాగించే ఆమనగల్లు గ్రామంలో పాడి గేదెలతో పాటు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవించే రైతులకు సమయానికి పాడి గేదెలకు గొర్రెలకు అవసరమైన టీకాలు నట్టలు మందులు వేయక పోవడంతో మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నప్పటికి తమ గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు . పశువుల ఆసుపత్రిలో సమయపాలన పాటించని వైద్యుడు సిబ్బంది తన రికార్డులలో మాత్రం గేదెలకు గొర్రెలకు మందులు టీకాలు ఇచ్చినట్లు మందులు ఇచ్చినట్లు రాసుకొని పోతున్నారన్నారు. ప్రతిరోజు పశు వైద్యశాల వద్ద డాక్టర్ కోసం వేచిచూడాల్సిన పరిస్థితి దుస్థితి ఏర్పడిందని పాడి రైతుల సమస్యను ఎవరికిచెప్పుకోవాలోలేనిఅయోమయ పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్, స్వీపర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి పశు వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌ను కేటాయించాలని కోరారు.

## పక్కాగా అసైన్డ్, భూదాన్, ప్రభుత్వ భూముల సర్వే

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లాలోని ఆయా మండలాలలో గల అసైన్డ్ భూములు, భూదాన్, ప్రభుత్వ భూముల సర్వేను పక్కాగా జరిపించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, అన్ని మండలాల తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా అసైన్డ్, భూదాన్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సర్వేయర్లచే పక్కాగా సర్వే జరిపించి, విస్తీర్ణం, హద్దులు, సర్వే నెంబర్ తదితర సమగ్ర వివరాలను సేకరించాలని, జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. భూభారతి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామాల వారీగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో సేకరించిన దరఖాస్తుల కంటే ముందు ఆన్లైన్ లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అర్జీలను ఆయా మాడ్యుల్స్ లో విభజించిన నేపథ్యంలో, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలిస్తూ, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చుకుని పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని ఆదేశించారు. ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం గ్రామ పాలన అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓ రాజేంద్రకుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ అశోక్, అన్ని మండలాల తహసిల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.







### బస్సులకు డిజిటల్ పాస్‌లు..

# యాప్‌లో బుకింగ్

**హైదరాబాద్:** తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం నిర్వహిస్తున్న 'మీటికెట్' యాప్ ద్వారా త్వరలో టీజీఆర్‌టీసీ ఇంటర్‌సిటీ బస్సు సేవలు %ఒ% క్యూ ఆర్ ఆధారిత డిజిటల్ బస్ పాస్‌లు అందుబాటులోకి రానున్నాయి. స్టేట్ స్మార్ట్ మొబిలిటీ ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఈ విస్తరణతో ప్రయాణికులకు మరింత సౌకర్యం లభించనుంది. ఇక నుంచి బస్సు టికెట్లు, నెలవారీ పాస్‌లు మొబైల్‌లోనే పొందవచ్చు. 2025 జనవరి 9న ప్రారంభమైన మీటికెట్ యాప్ ఇప్పటికే మంచి ఆదరణ పొందుతోంది. ఇప్పటి వరకు 1.35 లక్షల డౌన్‌లోడ్లు, 2.6 లక్షల టికెట్ బుకింగ్స్, రూ.2 కోట్లకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. యాప్ రేటింగ్ 3.5కు పైగా ఉండగా, ప్రస్తుతం 221 ప్రదేశాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ మెట్రో, 123 పార్కులు, 16 దేవాలయాలు, ఆరు మ్యూజియాలు, ఖుత్బ్ షాహీ సమాధులు వంటి ప్రదేశాలు ఈ సేవల్లో ఉన్నాయి.టీజీఆర్‌టీసీ సేవలు చేర్చడంతో ఇకపై సాధారణ, మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, గ్రీన్ మెట్రో లగ్జరీ (ఏసీ), పుష్పక్ ఏసీ బస్సులకు కూడా డిజిటల్‌గా టికెట్లు, పాస్‌లు పొందవచ్చు. ఇది విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు వంటి ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా చెల్లింపు చేసుకోవచ్చు. దీంతో క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదు.ప్రస్తుతం మీటికెట్ పరిధిలో 98 అటవీ ప్రదేశాలు, 52 పర్యాటక బోటింగ్ సెంటర్లు, 16 దేవాదాయ శాఖ దేవాలయాలు, 9 వారసత్వ ప్రదేశాలు ఉన్నాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం, గాంధీ సెంటెనరీ మ్యూజియం వంటి ప్రదేశాలను కూడా ఈ యాప్‌లో చేర్చారు. పర్యాటకులు, స్థానికులకు ఇది సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. టీజీఆర్‌టీసీ సేవల అధికారిక ప్రారంభ తేదీ త్వరలో ప్రకటించనున్నట్లు ఈఎస్‌డీ విభాగం వెల్లడించింది. ఇది రాష్ట్రంలో పౌర సౌకర్యాలను పెంచుతూ, డిజిటల్ గవర్నెన్స్ వైపు తెలంగాణ మరో ముందడుగు అని అధికారులు పేర్కొన్నారు.

# కొనుగోళ్ల జోరు..

## భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు • 25 వేలు దాటిన నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొను గోళ్ల మద్దతుతో వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ మన సూచీలు రాణించాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 25 వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 81,274.79 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,207.17) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,846.42 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 582.95 పాయింట్ల లాభంతో 81,790.12 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 183.40 పాయింట్ల లాభంతో 25,077.65 వద్ద



ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.82గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఎటెర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్, ట్రెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఆసియా మార్కెట్లలో జపాన్ నిక్కీ రాణించగా.. హాంకాంగ్ నష్టాల్లో ముగిసింది. చైనా, దక్షిణ కొరియా మార్కెట్లు పనిచేయలేదు. యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.52 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,943.57 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# కొత్త రకాల వీసాలను ప్రకటించిన యూఏఈ

ప్రపంచ ప్రతిభను ఆకర్షించడానికి, పర్యాటకాన్ని పెంచడానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాలుగు కొత్త విజిట్ వీసా కేటగిరీలను ప్రకటించింది. రెసిడెన్సీ వ్యవస్థలోనూ మార్పులు చేసింది.వీటిలో ఏఐ, ఎంటర్‌టైన్మెంట్, ఈవెంట్, క్రూయిజ్ టూరిజం కోసం నాలుగు కొత్త వీసా కేటగిరీలు ఉన్నాయి.అంతే కాకుండా, వ్యాపార, ట్రక్ డ్రైవర్ వీసాలకు సంబంధించి కూడా మార్పులు చేశారు. మానవతా సహాయం, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు, నివాసితుల బంధువులు, స్నేహితులకు కూడా రెసిడెన్సీ అవకాశం కల్పిస్తున్నారు.

**నాలుగు కొత్త విజిట్ వీసా కేటగిరీలు ఇవే..**

ఏఐ స్పెషలిస్ట్ వీసా: ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని నిపుణుల కోసం ఉద్దేశించినది. ఇందు కోసం టెక్ ఫోకస్డ్ కంపెనీ నుంచి స్పాన్సర్ షిప్ అవసరం అవుతుంది. ఒకటి లేదా ఎక్కువ ఎంట్రీలకు అనుమతి ఉంటుంది.

**ఎంటర్‌టైన్మెంట్ వీసా:** కమర్షియల్ ఎంటర్ టైన్ మెంట్ సెక్టార్ లోని వ్యక్తుల కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన వీసా ఇది. విశ్రాంతి లేదా ప్రదర్శన నిమిత్తం వచ్చే ప్రముఖులకు దీన్ని కేటాయిస్తారు.

**ఈవెంట్ వీసా:** పండుగలు, ఎగ్జిబిషన్లు, కాన్ఫరెన్సులకు హాజరయ్యేవారికి ఈ ఈవెంట్ వీసాలు జారీ చేస్తారు. అయితే వీటిని ఈవెంట్ నిర్వాహకులచే స్పాన్సర్ చేయాలి.

**క్రూయిజ్ టూరిజం వీసా:** క్రూయిజ్ ట్రావెలర్లకు మల్టిపుల్ ఎంట్రీ వీసా ఇది. లైసెన్స్ పొందిన మారిటైమ్ సంస్థల ద్వారా స్పాన్సర్ చేస్తారు. రెసిడెన్సీ, ఇతర వీసా అప్‌డేట్‌లు

**హ్యూమానిటేరియన్ రెసిడెన్స్ పర్మిట్:** సంక్షోభ పరిస్థితుల నుంచి వచ్చే వ్యక్తులకు ఒక సంవత్సరం పునరుద్ధరించతగిన వీసా. స్నేహితులు, బంధువుల కోసం విజిట్ వీసా: నివాసితులు తమ బంధువులకు దీన్ని స్పాన్సర్ చేయవచ్చు.

**ట్రక్ డ్రైవర్ వీసా:** లాజిస్టిక్స్ లో కార్మిక కొరతను పరిష్కరించే వీసా. లైసెన్స్ పొందిన కంపెనీల ద్వారా స్పాన్సర్ షిప్ అవసరం అవుతుంది. వితంతువులు, విడాకులకు **రెసిడెన్సీ:** నిర్వచించిన పరిస్థితులలో ఒక సంవత్సరం పునరుద్ధరణ అనుమతి.

**బిజినెస్ ఎక్స్ ప్లోరేషన్ వీసా:** బిజినెస్ ప్రారంభించేందుకు వచ్చే ఆర్థిక సాల్వెన్సీ రుజువు ఉన్న వ్యాపారవేత్తలకు జారీ చేస్తారు.

## దూసుకెళ్తున్న అరట్టై..

### 75 లక్షల డౌన్‌లోడ్స్!

**న్యూఢిల్లీ:**భారతదేశపు ఐటీ కంపెనీ జోహో అభివృద్ధి చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ 'అరట్టై'కు ఆదరణ రోజు రోజుకు పెరుగుతోంది. ఈ యాప్ శుక్రవారం నాటికి మొత్తం 75 లక్షల డౌన్‌లోడ్‌లను అధిగమించింది. అంటే అంతమంది దీనిని డౌన్‌లోడ్ చేసుకున్నారన్న మాట. దీన్ని బట్టి చూస్తే ఇది ఇటీవలి కాలంలో.. అతి తక్కువ కాలంలో ఎక్కువ డౌన్‌లోడ్స్ పొందిన యాప్‌లలో ఒకటిగా నిలిచింది.ఇప్పటి వరకు చాలామంది భారతీయులు.. మెటా యాజమాన్యంలోని వాట్సప్‌ను వినియోగిస్తున్నారు. అయితే ఇక దేశీయ యాప్ అరట్టైను ఉపయోగించాలని పలువురు మంత్రులు, వ్యవస్థాపకులు, సీఈఓలు పిలుపునిచ్చారు. దీంతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేవారు సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ ఆపిల్ యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉంటుంది. అరట్టై అంటే.. తమిళంలో సరదాగా ముచ్చటించుకోవడం అని అర్థం. దీనిని జోహో సంస్థ.. వాట్సప్‌కు పోటీగా అభివృద్ధి చేసింది. ఇది వాట్సప్ కంటే ఎక్కువ ఫీచర్స్ కలిగి ఉంది. దీనికి అశ్వినీ వైష్ణవ్, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్ వంటి కేంద్రమంత్రులు కూడా మద్దతు ప్రకటించారు.

## ఏథర్ సరికొత్త మైలురాయి

### 5 లక్షల ఎలక్ట్రిక్ స్కూటర్లు..

బెంగళూరు: దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్వాహన ఉత్పత్తిలో సరికొత్తమైలురాయినిఅధిగమించింది. తమిళనాడులోని హొసూర్‌లో ఉన్న తమ తయారీ ప్లాంట్ నుండి 5 లక్షలవ వాహనాన్ని రోల్-అవుట్ చేయడం ద్వారా ఒక ముఖ్యమైన ఉత్పత్తి మైలురాయిని సాధించినట్లు ఏథర్ ప్రకటించింది. ఈ మైలురాయి వాహనం ఏథర్ ఫ్లాగ్‌షిప్ ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా. "5,00,000 స్కూటర్లను అధిగమించడం ఏథర్‌కు ఒక ప్రధాన మైలురాయి. మా మొట్టమొదటి ప్రోటోటైప్ నుండి నేటి వరకు, మా ప్రయాణం కేవలం వాహనాలను నిర్మించడం మాత్రమే కాదు, స్కేలబుల్, నమ్మకమైన, స్థిరమైన తయారీ వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించింది "అనిఏథర్ ఎనర్జీ సహ-వ్యవస్థాపకుడు, సీటీవో స్వప్నిల్ జైన్ పేర్కొన్నారు.ఏథర్ ప్రస్తుతం తమిళనాడులోని హొసూర్‌లో రెండు తయారీ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఒకటి వాహన అసెంబ్లీ కోసం, మరొకటి బ్యాటరీ ఉత్పత్తి కోసం. హొసూర్ ప్లాంట్ సంవత్సరానికి 4,20,000 స్కూటర్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెరుగుతున్న డి మాండ్‌ను తీర్చడానికి, ఏథర్ తన మూడవ తయారీ కేంద్రాన్ని మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లోఏర్పాటు చేస్తోంది.




**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,10,700 | ₹ 1,20,770 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,67,000

# పతాకస్థాయికి ఇజ్రాయెల్ దాష్టీకం

- గాజా సహాయ నౌకాయాత్ర బృందంపై దాడి
- గ్రెటా థన్‌బర్గ్ నిర్బంధం.. దౌర్జన్యం
- పర్యావరణ ఉద్యమ కార్యకర్తల ఆరోపణ

**టెల్ అవీవ్:** గాజాకు మానవతా సాయం తీసుకెళ్లిన నౌకాయాత్ర సభ్యురాలైన స్వీడన్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌తో ఇజ్రాయెల్ అధికారులు అనుచితంగా ప్రవర్తించారని సహ కార్యకర్తలు ఆరోపించారు.ఆమెను నిర్బంధంలోకి తీసుకుని దురుసుగా ప్రవర్తించారని.. ఆ యాత్రలో పాల్గొన్న పలువురు పర్యావరణ ఉద్యమ కార్యకర్తలు తెలిపారు.టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ కథనం ప్రకారం.. గాజాకు సహాయాన్ని తీసుకెళ్లిన నౌకలో ప్రయాణించిన 137 మంది పర్యావరణ ఉద్యమ కార్యకర్తలను ఇజ్రాయెల్ బహిష్కరించింది. వారు శనివారం ఇస్తాంబుల్‌కు చేరుకున్నారు. ఈ బృందంలో 36 మంది టర్కిష్ జాతీయులు సహా అమెరికా, యూఏఈ, అల్జీరియా, మొరాకో, ఇటలీ, కువైట్, లిబియా, మలేషియా, మౌరిటానియా, స్విట్జర్లాండ్, ట్యునీషియా, జోర్డాన్ తదితర దేశాలకు



చెందిన వారు ఉన్నారు. గ్రెటా థన్‌బర్గ్‌పై జరిగిన దురుసు ప్రవర్తనను కళ్లారా చూశామని.. మలేషియా జాతీయుడైన హజ్వానీ హెల్మీ, అమెరికన్ పౌరుడు విండ్‌ఫీల్డ్ బీవర్ అనే ఇద్దరు కార్యకర్తలు రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. 'అదొక విపత్తు. మమ్మల్ని జంతువుల్లా చూశారు. గ్రెటా థన్‌బర్గ్‌ను జుట్టు పట్టుకొని లాగి, ఇజ్రాయెల్ జెండాను ముద్దు పెట్టుకోమని బలవంతం చేశారు'.. అని 28 ఏళ్ల హెల్మీ ఆవేదన వ్యక్తం చేశారు. శుభ్రమైన ఆహారం, నీరు కూడా ఇవ్వలేదన్నారు. నల్లులున్న గదిలో బంధించి..: గ్రెటా థన్‌బర్గ్ అనుచరులకు స్వీడిష్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పంపిన ఒక ఈమెయిల్‌లో.. థన్‌బర్గ్‌ను నల్లులున్న గదిలో ఉంచారని, సరైన ఆహారం, నీరు ఇవ్వలేదని పేర్కొన్నట్లు 'ది గార్డియన్' పత్రిక వెల్లడించింది. 'రాయబార కార్యాలయం గ్రెటా థన్‌బర్గ్‌ను కలవగలిగింది. తనకు నీరసంగా ఉన్నట్లు ఆమె తెలిపింది. తగినంత నీరు, ఆహారం అందలేదు. శరీరమంతా దద్దుర్లు వచ్చాయి.. అవి నల్లుల వల్లే వచ్చాయని అనుమానిస్తున్నట్లు కూడా ఆమె తెలిపింది..' అని ఈమెయిల్‌లో వెల్లడించారు. అయితే, ఈ ఆరోపణలన్నీ అబద్ధాలని ఇజ్రాయెల్ కొట్టిపారేసింది.

## బరిలో ప్రముఖ సింగర్.. బీజేపీ నేతలతో భేటీ

**న్యూఢిల్లీ:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల సందడి మొదలయ్యింది. పార్టీలలో ఉత్సాహం పెరిగింది. టిక్కెట్ల ఆశావహులు వివిధ పార్టీలలో చేరుతున్నారు. తాజాగా ప్రముఖ బాలీవుడ్ గాయని మైథిలి ఠాకూర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్‌లను కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఆమె త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో దర్భంగా నుండి బీజేపీ టికెట్‌పై పోటీ చేయవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. వినోద్ తావ్డే తన 'ఎక్స్' హ్యాండిల్‌లో మైథిలి ఠాకూర్‌తో సమావేశం అయిన ఫోటోలను షేర్ చేశారు. 1995లో లాలూ ప్రసాద్ యాదవ్ పదవీకాలంలో బీహార్‌ను విడిచిపెట్టిన మైథిలి ఠాకూర్ కుటుంబం రాష్ట్ర పురోగతిని చూసిన తర్వాత తిరిగి ఇక్కడికి రావాలని కోరుకుంటున్నట్లు తావ్డే ఆ పోస్ట్‌లో తెలిపారు. కాగా మైథిలి ఠాకూర్ తన 'ఎక్స్' హ్యాండిల్‌లో 'బీహార్ అభివృద్ధి కోసం కలలుకనే వ్యక్తులను కలుసుకున్నాను. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.మైథిలి ఠాకూర్ బీహార్‌లోని మధుబనిలోని బెనిపట్టికి చెందినవారు. ఆమెను ఎన్నికల సంఘం బీహార్ 'స్టేట్ ఐకాన్'గా కూడా నియమించింది. భారతీయ శాస్త్రీయ, జానపద సంగీతంలో శిక్షణ పొందిన ఆమె, బీహార్ జానపద సంగీతానికి చేసిన కృషికి గాను 2021లో సంగీత నాటక అకాడమీ నుండి ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్‌ను అందుకున్నారు.





# ఎవరెస్టుపై మంచు తుపాను..

## వందల మందికి అత్యంత భయానక రాత్రి!

**ఖట్మాండు:** ఎవరెస్ట్ పర్వతంపై భారీ మంచు తుఫాన్ పర్వతంతో ఒక్కసారిగా అలజడి రేగింది. సుమారు 1,000 మంది పర్వతారోహకులు ఈ తుపానులో చిక్కుకునిపోగా..వారిని రక్షించే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టిబెట్ వైపు ఈ పరిణామం చోటు చేసుకోవడంతో చైనా ప్రభుత్వం ఈ సహాయక చరయలను పర్యవేక్షిస్తోంది.మౌంట్ ఎవరెస్ట్‌పై టిబెట్ అవైపు అక్టోబర్ 3న తేదీన భారీ మంచు తుఫాన్ ప్రారంభమైంది. ఈ ప్రభావంతో కర్మా వ్యాలీ, కాంగ్షుంగ్ వైపు ట్రెక్కింగ్ చేస్తున్న వాళ్లు క్యాంప్ సైట్ల వద్ద చిక్కుకునిపోయారు. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో మంచు తొలగిస్తూ దారులను క్లియర్ చేస్తున్నారు.రెస్క్యూ బృందాలు ఇప్పటిదాకా 350 మందిని కాపాడినట్లు సమాచారం. వాళ్లందరినీ ఆదివారం నాటికే క్యూదాంగ్ పట్టణానికి తరలించారు. మరో 200 మందిని దశలవారీగా కిందకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.హైపోథర్మియా కారణంగా పర్వతారోహకులు తీవ్ర భయాందోళనకు గురైనట్లు స్పష్టమవుతోంది. "ఇది తమ జీవితంలోనే అత్యంత భయంకరమైన రాత్రి" అని పలువురు మీడియాకు రోదిస్తూ చెప్పారు. మంచు తుఫాన్ ధాటికి టెంట్లు కుప్పకూలిపోయాయి. దీంతో పర్వతారోహకులు సురక్షిత ప్రాంతాల వైపు తరలిపోతున్న దృశ్యాలతో ఓ వీడియో రికార్డు బయటకు వచ్చింది.అయితే పర్వతారోహకులు అలా తరలిపోతుండడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దారి తప్పిపోయే అవకాశం ఉండడం, పైగా హైపోథర్మియాతో పాటు ఆక్సిజన్ కొరత వాళ్ల ప్రాణాలకు ముప్పుగా మారే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### తుఫాన్ తీవ్రంగానే..

కర్మా లోయ సముద్ర మట్టానికి 4,200 మీటర్ల ఎత్తులో ఉంది. నేపాల్‌లో భారీ వర్షాలు, మెరుపు వరదలు,కొండ చరియలు విరిగిపడి 47 మంది మరణించారు. ఈ ప్రతికూల వాతావరణ ప్రభావంతో.. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎవరెస్ట్‌పై మెరుపులు ఉరుములతో కూడిన భారీ వర్షం, ఆపై భారీ మంచు తుపాను సంభవించింది. మరోవైపు.. తుపాను నేపథ్యంలో తింగ్రీ కౌంటీ టూరిజం సంస్థ అన్ని టికెట్ అమ్మకాలు, ప్రవేశాలను శనివారం నుంచే నిలిపివేసింది.

### గతంలోనూ..

ప్రపంచంలో అత్యంత ఎత్తైన శిఖరం.. మౌంట్ ఎవరెస్ట్. అయితే దీనిని అధిరోహించే క్రమంలో అధికారిక లెక్కల ప్రకారం.. ఇప్పటిదాకా 340 మరణించారు. అలాగే గతంలో ప్రకృతి విపత్తుల కారణంగానూ ఇక్కడ ప్రాణ నష్టం సంభవించింది కూడా. 1996 మే 10-11 తేదీల్లో మౌంట్ ఎవరెస్ట్ తుపాను కారణంగా ఎనిమిది మంది మరణించారు. అలాగే.. 2014 ఏప్రిల్ 18వ తేదీన మంచు శిఖరాలు కూలిపోవడంతో 16 మంది నేపాలీ గైడ్లు మృతి చెందారు. అయితే భద్రతా లోపాలు, పైగా ఈ ఘటనలో భాదిత కుటుంబాలకు తక్కువ పరిహారం చెల్లించడంతో గైడ్లు సమ్మెకు దిగడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. 2015 నేపాల్ భూకంపం కారణంగా.. ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌పై మంచు కుప్పలు కూలి 22 మంది మృతి చెందారు. చరిత్రలో అత్యంత ఘోరమైన ఎవరెస్ట్ విపత్తుగా దీనికి గుర్తింపు లభించింది.

## భారత్ అందరికీ స్వర్గధామంలా మారింది

గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.గోకర్ణ గుహలో రహస్యంగా జీవించిన నైనా కుటినా (40), తన ఇద్దరు కుమార్తెలు ప్రస్తుతం పోలీసుల సంరక్షణలో ఉన్నారు. తన భర్త ఇజ్రాయెల్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అని ఆమె వెల్లడించారు. ఆ కుమార్తెల తండ్రిని తానేనని, వారిని రష్యాకు తరలించొద్దని ఇజ్రాయెల్ దేశస్థుడు గోల్డ్‌స్టీన్ ఇటీవల సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో విచారణ జరిగింది. "వాళ్లు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారు. ఈ దేశం అందరికీ స్వర్గధామంగా మారింది. ఎవరైనా వచ్చి ఇక్కడ ఉండిపోవచ్చని అనుకుంటున్నారు" అని అసహనం వ్యక్తం చేసింది. జులై 11న గుహలో నైనా కుటినాను గుర్తించగా.. అప్పుడు ఆమె వద్ద ఎలాంటి చట్టబద్ధ పత్రాలు లభించలేదు. దీనిపై స్పందించిన రష్యా ఎంబసీ అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేసింది. అప్పుడే గోల్డ్‌స్టీన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఇద్దరు తన పిల్లలని, వారిని రష్యాకు తరలించవద్దని కోరారు. తన పిల్లల జాడ తెలియకపోవడంతో గత ఏడాది పనాజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని కూడా తెలిపారు. అయితే హైకోర్టు అతడి పిటిషన్‌ను కొట్టివేసింది. నైనా, ఆమె పిల్లల్ని రష్యాకు పంపేలా కేంద్రం తీసుకుంటున్న చర్యలను అనుమతించింది.సాధ్యమైనంత త్వరగా తాను రష్యా వెళ్లాలనుకుంటున్నానని ఎంబసీ వద్ద నైనా చెప్పిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. మరోవైపు ఆ తల్లీపిల్లలు గుహలో ఎందుకు జీవిస్తున్నారో గోల్డ్‌స్టీన్ న్యాయస్థానం ఎదుట సరైన సమాధానం చెప్పలేకపోయారు. తాజా విచారణలో సుప్రీంకోర్టు కూడా అదే ప్రశ్న వేసింది. అసలు మీ హక్కు ఏంటి? మీరు ఎవరు? అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఆ పిల్లలకు తండ్రినని సమాధానం ఇవ్వగా.. దానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగింది.

## వరదలకు మానవ నిర్మిత విపత్తే కారణం:మమత

**కోల్‌కతా:** రాష్ట్రంలో సంభవించిన వరదలకు, ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌లో తలెత్తిన దుర్భర పరిస్థితులకు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (వీడీవీసీ) కారణమంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరదలను ఆమె మానవ నిర్మిత విపత్తుగా అభివర్ణించారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఎటువంటి సమన్వయం లేకుండా రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణమని మమతా ఆరోపించారు. శనివారం నుంచి నమోదవుతున్న రికార్డు స్థాయి వర్షపాతం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న డార్జిలింగ్, చుట్టుపక్కల ప్రాంతాలలో డీవీసీ చేపట్టిన చర్యలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రూ. ఐదు లక్షల పరిహారం, ఒకరికి హొమ్‌గార్డ్ ఉద్యోగం ప్రకటించారు. డబ్బుతో ప్రాణ నష్టాన్ని పూడ్చలేమని, అయితే ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ఆమె తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు బాగ్డోగ్రాకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన మమతా బెనర్జీ డీవీసీపై పలు ఆరోపణలు చేశారు. జారండ్‌ను వరదల నుంచి రక్షించేందుకు డీవీసీ మైథాన్,పాంచెట్ రిజర్వాయర్ల నుంచి ఇష్టం వచ్చినట్లుగా నీటిని విడుదల చేసిందదన్నారు

# బీజేపీ ఎంపీపై 500 మంది మారణాయుధాలతో దాడి..

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో కలకలం. వరద బాధితుల్ని పరామర్శించేందుకు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలపై సుమారు 500 మంది దాడికి తెగబడ్డారు. చేతికి దొరికిన మారణాయుధం, చెప్పులు, కర్రలు, రాళ్లతో దాడికి దిగాయారు. కమలం నేతలు ప్రయాణిస్తున్న వాహనాన్ని ధ్వంసం చేశారు. ఇక నిందితులు జరిపిన దాడిలో బీజేపీ ఎంపీకి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన ధరించిన కుర్తా సైతం రక్తంతో తడిసి ముద్దైంది. అందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఇటీవల కురిసిన భారీ వర్షాలు పశ్చిమ బెంగాల్‌ను అతలాకుతలం చేశాయి. వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. కొండచరియలు విరిగిపడి భారీ ఎత్తున ప్రాణ నష్టం జరిగింది. డార్జిలింగ్ జిల్లాలో అక్టోబర్ 4న రాత్రి కురిసిన ఎడతెరిపి లేకుండా భారీ వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడి 14 మంది మృతి చెందినట్లు సమాచారం. మిరిక్, కుర్సియాంగ్ ప్రాంతాల్లో దూదియా ఐరన్ బ్రిడ్జి కూలిపోవడంతో రవాణా పూర్తిగా స్తంభించింది.ఈ క్రమంలో పశ్చిమ బెంగాల్ మల్దహా ఉత్తర లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ ఖాగెన్ ముర్ము,అదే నియోజకవర్గ ఎమ్మెల్యే శంకర్ ఘోష్,బీజేపీ బెంగాల్ యూనిట్ చీఫ్ సమ్మిక్ బట్టాచార్య సోమవారం (అక్టోబర్6) జల్‌పైగురి జిల్లా వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరద బాధితుల్ని పరామర్శించారు. వారికి కావాల్సిన నిత్యవసర వస్తువుల్ని పంపిణీ చేశారు.ఆ సమయంలో సుమారు 500 మంది మారణాయుధాలతో బీజేపీ నేతలపై దాడికి తెగబడ్డారు. వరద బాధితుల్ని పరామర్శించేందుకు వచ్చిన బీజేపీ నేతలు వెంటనే ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. వారిని బయపెట్టేందుకు ఎంపీ ఖాగెన్ ముర్ముపై రాళ్లు, చెప్పులు, కర్రలు, ఇతర మారణాయుధాలతో దాడి చేశారు. ఆ దాడిలో ఖాగెన్ ముర్ముతోపాటు ఇతర బీజేపీ నేతలు తీవ్రంగా గాయపడ్డారు.దాడిలో గాయపడి నొప్పి తాళలేక హాహాకారాలు చేస్తున్న కమలం నేతల్ని అత్యవసర చికిత్స నిమిత్తం బీజేపీ శ్రేణులు ఆస్పత్రికి తరలించాయి. . ప్రస్తుతం వారికి వైద్య చికిత్స కొనసాగుతోంది. ఆ దృశ్యాలు వెలుగులోకి రావడంతో బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ పశ్చిమ బెంగాల్ మమతా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.వరద బాధితులకు సహాయం చేసేందుకు వెళ్లిన బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ఇతర నేతలపై దాడి జరిగింది. వరద బాధితుల్ని రక్షించేందుకు టీఎంసీ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ కానీ టీఎంసీ ఇతర నేతలు ముందుకు రాలేదు. కానీ వరద బాధితుల్ని అండగా నిలిచేందుకు వెళ్లిన బీజేపీ ఎంపీతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులపై దాడి చేయడం హేయం అంటూ ఖండించారు.

# కథలాపూర్ స్థానిక ఎన్నికల సంస్థగత సన్నాహక సమావేశం

- పాల్గొన్న ప్రభుత్వవిప్ ఆది శ్రీను
- ప్రజల్లోకి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి వివరించాలని ప్రతి కార్యకర్తకి సూచన



**కథలాపూర్ అక్టోబర్ 6 (జనంసాక్షి) :** కథలాపూర్ మండలం లోని సిరికొండ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రోజున నిర్వహించిన టువంటి స్థానిక సంస్థగత ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు అలాగే నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీను ఆయా గ్రామలకు సంబంధించిన గ్రామ శాఖ అధ్యక్షులను ముఖ్య నేతలను మాట్లాడవలసిందిగా కోరారు, వారు మాట్లాడిన అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్దాల కల సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేశాం ప్రస్తుతానికి మత్తడి పనులు నడుస్తున్నాయి వచ్చే వర్షాకాలంలో నీరు స్టోరేజ్ చేసుకోవడానికి సిద్ధం అవుతుంది అని తెలిపారు,

ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి రేషన్ కార్డులు ఇందిరమ్మ గృహాలు200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అలాగే రెండు లక్షల వరకు రుణమాఫీ ఇలా ప్రభుత్వ ఏర్పడి రెండు సంవత్సరాల లోపే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజల శ్రేయస్సుకై దిగ్విజయంగా నిర్వహిస్తుందని దీనిని ప్రజల లోకి తీసుకెళ్లవలసిన పూర్తి బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పైన ఉన్నదని దిశానిర్దేశం చేయడం జరిగింది,ఇట్టి కార్యక్రమంలో కథలాపూర్ మండల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అజీమ్,రాష్ట్ర కార్యవర్గ పిసిసి సభ్యుడు తోట్ల అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి, కథలాపూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేగ్గారాపు శ్రీహరి, రాష్ట్ర చేనేత కార్యదర్శి పులి హరిప్రసాద్, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి కల్లెడ గంగాధర్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు ధనుంజయ రెడ్డి,జగిత్యాల జిల్లా మున్నూరు కాపు అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ,కథలాపూర్ మండల్ కార్యవర్గ సభ్యుడు జవ్వాజి రవి, సీనియర్ నాయకుడు వెలిచలా సత్యనారాయణ, ఎస్సీ సెల్ పంబాల శంకర్, బీసీ సెల్ లింగ గౌడ్, నియోజకవర్గయూత్ ఉపాధ్యక్షులు, కాశవత్రి వంశీ, ఎండి రెహన్, నియోజకవర్గ ఎన్ఎస్ యూ ఐ అధ్యక్షులు ఆకుల సంతోష్, మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, డైరెక్టర్ ఎం డి ఆఫీస్, మ్యదరవేణి రాజు, ముంజ జలంధర్,పిడుగు తిరుపతిరెడ్డి, బైరదేవు యాదవ్, గడ్డం స్వామి రెడ్డి, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి,తలారి మోహన్, అంగ మహేష్, కూన శ్రీనివాస్ లింగారావు, పబ్బ శ్రీనివాస్, చారి, ముట్టారపు నర్సయ్య, న్యావనంది శేఖర్, సత్యనారాయణ, కారపు గంగాధర్,వేముల కృష్ణ,లవన్ కుమార్, ముదాం శేఖర్, అలాగే మండలంలోని పలు హోదాలో నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

# సింగరేణి ఆర్‌జీ-1లో వివిధ వృత్తి నైపుణ్య శిక్షణ

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం ఏరియా-1 సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత స్వయం ఉపాధి కల్పన (సీఎస్ఆర్)లో భాగంగా సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పిల్లలకు, సింగరేణి ప్రభావిత గ్రామాలు, గోదావరి ఖని ప్రాంత నిరుద్యోగ యువతులకు, మహిళలకు జీవనోపాధి కల్పించటానికి టైలరింగ్, బ్యూటీషి యన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్/జూట్/ బంజారా బ్యాగ్స్ వివిధ వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను ఉచితంగా నిర్వహించి ధృవీకరణ పత్రాలను కూడా అందజేస్తామని సింగరేణి యాజ మాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వృత్తి నైపుణ్యత శిక్షణలో శిక్షణ పొందటానికి ఆర్‌జీ-1లోని అన్ని గనుల సంక్షేమా ధికారి కార్యాలయాలు/వివిధ డిపార్ట్మెంట్స్/జియం ఆఫీస్,సింగరేణి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కొరకు సంప్రదించాలని యాజమాన్యం సూచించింది. పూరించిన దరఖాస్తు ఫారాలతో పాటు అధార్ కార్డ్ జిరాక్స్, సర్టిఫికెట్స్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో ఈ నెల15లోగా ఆర్‌జీ-1 సింగరేణి సేవా సమితి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సింగరేణి ఆర్‌జీ-1 యాజమాన్యం కోరింది.




# నవంబర్ 12లోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

## రైస్ మిల్లర్లలకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచన

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం సిఎంఆర్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశము ఐడిఓసి మీటింగ్ హాల్ నిర్వహించి, ఖరీఫ్ 2024-25 సీజన్లలో బకాయి ఉన్న మిల్లర్లను గడువు 2025 నవంబర్ 12 లోగా సీఎంఆర్ పూర్తి చేయాలని మరియు మిల్లర్లకు రోజు వారీ టార్గెట్ పూర్తి చేయాలని, ప్రతి మిల్లును ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విజిట్ చేయాలని ఆదేశించినారు మరియు ప్రస్తుతం ప్రారంభం అయిన ఖరీఫ్ 2025-26 సీజన్‌కి దాన్యం సేకరణకుకి గాను మిల్లుకు కేటాయించిన దన్యాన్ని దించుకొని వెంటేనే ట్రక్ చిట్‌ని పిపిసి సెంటర్ ఇంచార్జీలకు ఇవ్వాలని మరియు మిల్లర్ అక్నాలెడ్జ్మెంట్ చేయాలని, ఇందువలన రైతు కు త్వరగా డబ్బులు ఖాతాలో జమ అవుతాయని మిల్లర్లను ఆదేశించారు, ఇట్టి సమీక్ష సమావేశములో జిల్లా కలెక్టర్ పౌర సరఫరాలు, ఎఫ్సీఐ డిపో మేనేజర్, నిజామాబాద్ మరియు జిల్లా సివిల్ సప్లై అధికారి మరియు జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## జుక్కల్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే అరుణతార



**పిట్లం అక్టోబర్,06 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం పిట్లం మండలంలో మండల అధ్యక్షులు సాయి రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో మండలంలోని అన్ని ఎంపిటిసి స్థానాలకు, జడ్పిటిసి స్థానానికి, మరియు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సర్పంచ్ అభ్యర్థులను ఖరారు చేయడం జరిగి ంది. ఇట్టి కార్యక్రమానికి మండల ఇన్చార్జిగా మర్రి బాలకిషన్ రావడం జరిగింది. ముఖ్య అతిథిగా జుక్కల్ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే అరుణతార జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాము హాజరు కావడం జరిగింది వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఎంపీటీసీ సర్పంచ్ జడ్పిటిసి స్థానాలు బిజెపి పార్టీ గెలిచే విధంగా అవసరమైన సలహాలు సూచనలు ఇస్తూ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు ఉపాధ్యక్షులు వివిధ మోర్చాల అధ్యక్షులు అన్ని గ్రామాల భూత్ అధ్యక్షులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

### జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బొల్లి సత్యనారాయణ

**సుల్తానాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా బొల్లి సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్స వం పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రం లోని వాగేశ్వరి డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన గురుస్ స్టూడెం ట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయారు చేస్తూ విశిష్ట సేవలు అందించిన సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొల్లి సత్యనారాయణను గురుస్ స్టూడెంట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా చైర్మన్,జాతీయ అధ్యక్షుడు గంగారపు మల్లేశం తో పాటు సంస్థ ప్రతినిధులు, ఉత్తమ ఉపాధ్యాయుడుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గురుస్ సంస్థ ప్రతినిధులకు బొల్లి సత్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వచ్చే ఎన్నికల్లో గులాబీ సైనికులదే విజయం

- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కెసిఆర్‌కు గిఫ్ట్ కావాలి
- కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చందర్



**రామగుండం, జనంసాక్షి :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన గులాబీ సైనికులదే విజయం అని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,కార్మిక సంఘాల నాయకులు కౌశిక హరీ అన్నారు.రామగుండం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన అంతర్గాం మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. పార్టీకి బలమైన నాయకత్వం ఉందని. పార్టీ ఎవరిని ప్రతిపాదించిన ప్రజలు ఓట్లేసి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని.అంతర్గాం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా కౌశిక లత బరిలో ఉండబోటుందని. ఆమెతో పాటు ఎంపీపీ. సర్పంచ్. ఎంపిటిసి స్థానాలు ప్రజల ఆశీర్వాదం.దీవెనలతో మొత్తం స్థానాలు గెలిచి మండలంలో గులాబీ జండా ఎగురవేసి. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు గిఫ్ట్ గా ఇవ్వాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడిచిన నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.ఎక్కడ చూసిన గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్దే కనిపిస్తుందని అన్నారు.బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరు ఉన్న వారి గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలనీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్ నాయకులపై వేధింపులు పెరిగాయని.పోలీసులతో కార్యర్తలపై కేసులు పెడుతూ బెదిరిస్తున్నారని, కార్యకర్తలందరికి పార్టీ అండగా ఉంటుందని ఎవరు అధైర్యపడవద్దని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీల గ్యారంటీ కార్డు ప్రకారం ప్రభుత్వం ఇవ్వవలసిన ప్రజా సంక్షేమ హామీలను.బీఆర్ఎస్ ముద్రించిన బాకీ కార్డులను ఈ సందర్భంగా ప్రారంభించారు.పార్టీ మండల అధ్యక్షులు కోల సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసీ అభ్యర్థి కౌశిక లత.నాయకులు మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి. అభిషేక్ రావు. గోపు ఐలయ్య యాదవ్. జెవి రాజు. పర్లపల్లి రవి. కొలిపాక మధుకర్ రెడ్డి. ధర్ని రాజేష్.మండలంలోని ముఖ్య నాయకులు.కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదలో ఆదుకోవాల్సింది పోయి, రాజకీయమా?



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనం సాక్షి) :** అగ్గి పెట్టి దొరుకని హరీష్ రావు, కామారెడ్డిలో చెల్లుతావా అని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రిగా, కామారెడ్డి నియోజకవర్గం నుండి పోటీ చేసి, ప్రతి పక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్న మీ నాయకుడు కేసీఆర్‌కు కామారెడ్డి ప్రజల ఓట్లు కావాలి కానీ, వారు ఆపదలో ఉంటే వచ్చి మాట్లాడించే సమయం ఉండదు, ఫామ్ హౌస్‌లో పండుకుంటాడు. దొంగలు పడ్డంక ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు, ఆపదలో రానీ చుట్టము, రాజకీయం చేయడానికి ఇప్పుడు వచ్చి ముసలి కన్నీరు కార్చడం మీకు అలవాటుగా మారింది. వరదలు వచ్చినప్పుడు ప్రజలకు మేమున్నామని మీ ప్రతిపక్ష నాయకుడుగాని, మీరు గాని, మీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గానీ ఎక్కడ పండుకున్నారు. కామారెడ్డి నియోజకవర్గ ప్రజల ఓట్లు మాత్రం మీ కెసిఆర్‌కు కావాలి, ఆపదలు వస్తే మాత్రం ప్రజల కు అండగా ఉండవలసిన మీ కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఎంజాయ్ చేస్తాడు. మీరు ఆరోపణలు చేసే ముందు మీ చరిత్ర ఏందో తెలుసుకొని చేయండి. అందుకే కామారెడ్డి జిల్లా ప్రజలు మిమ్ములను బండ కేసు కొట్టిన, మీ బుద్ధి మారటం లేదు. ఇకనైనా ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ, అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచిస్తున్నాం. ప్రజలు గమనిస్తున్నారు, సరైన సమయంలో నీకు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరిస్తున్నా. ప్రజా పాలన నడిపిస్తున్న ప్రభుత్వంపై గాని, రేవంత్ రెడ్డిపై గాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే, ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాం అన్నారు.

# "ఆర్ఆర్ఆర్"కు రైతులు భూములివ్వడానికి సిద్ధంగా లేరు

- కోట్ల రూపాయల భూములకు లక్షల పరిహారమా?
- ఏ ఒక్కరైతు అన్యాయానికి గురైనా ఢిల్లీ తరహాలో రైతాంగ ఉద్యమం
- హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద భూనిర్వాసితుల ధర్నా






**రంగారెడ్డి, అక్టోబర్ 06 (జనంసాక్షి):** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. 2013 చట్టంలోని షెడ్యూల్ 1లో చూపిన విధంగా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల యాజమానులు, ధనికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే అలైన్మెంట్లో ప్రభుత్వం మార్పులు చేస్తున్నదని విమర్శించారు. ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై సోమవారం హైదరాబాద్లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్వెస్లీ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్మెంట్ మారుస్తున్నారని విమర్శించారు. పోలీసులను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు ప్రకటించి హద్దులు పెడుతున్నారని అన్నారు. భూమి ఇవ్వడానికి సిద్ధంగా లేరని చెప్పారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదని చెప్పారు. ఎకరా రూ.10 కోట్లు, రూ.ఐదు కోట్లు ఉంటే ప్రభుత్వం రూ. పది లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలు పరిహారం ఇస్తున్నదని వివరించారు. చర్చలు జరపం, నిర్బంధం ప్రయోగిస్తామంటే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుందని చెప్పారు. ప్రభుత్వం స్పందించకుంటే గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులను సంఘటితం చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

అధ్యక్షత వహించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ మాట్లాడుతూ ఏ ఒక్క రైతు అన్యాయానికి గురైనా భవిష్యత్లో ఢిల్లీ తరహాలో రైతాంగ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్ మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఆర్ఆర్ఆర్ ఉంటుందనీ తొలుత ప్రకటించారనీ, ఇప్పుడు 28 కిలో మీటర్లకు, 25 కిలోమీటర్లకు ఎందుకు తగ్గిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు మాట్లాడారు. అనంతరం హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి ధర్నా శిబిరం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను సీపీఐ(ఎం) నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, బి ప్రసాద్, కొండమడుగు నర్సింహ్మా, ప్రజాసంఘాల నాయకులు కోట రమేష్, ఎం శోభన్నాయక్ తదితరులు పాల్గన్నారు.

### భూసేకరణ కోసం గ్రామసభలను నిర్వహిస్తాం : రవీందర్ రెడ్డి

ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ తయారుచేసి హెచ్ఎండీఏ మాస్టర్ప్లాన్లో పొందుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి చెప్పారు. అలైన్మెంట్ మీద వచ్చిన అభ్యంతరాలు, సూచనలను క్రోఢీకరించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ఉత్తర భాగం పూర్తయ్యిందనీ, దక్షిణ భాగం ప్రభుత్వానికి పంపిస్తామని వివరించారు. భూసేకరణ వరకు ఇంకా వెళ్లలేదన్నారు. అలైన్మెంట్ గురించి పబ్లిక్ నోటీసు ఇచ్చామని అన్నారు. గ్రామసభలు భూసేకరణ ప్రక్రియలో ఉంటాయన్నారు. ఈ వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు.

# న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ న్యాయవాదుల ధర్నా

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక న్యాయవాది గూళ్ల రమేష్‌పై కొంతమంది దాడి చేయటాన్ని నిరసిస్తూ సోమవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు కోర్టు నుంచి ఖని ప్రధాన చౌరస్తా వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ నిత్యం న్యాయం కోసం పరితపించే న్యాయవాదులపై పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో బీరుసీసాలతో దాడి చేయడం దారుణమన్నారు.రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని దాడులకు పాల్పడ్డ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, సంయుక్త కార్యదర్శి ముచ్చకుర్తి కుమార్, క్రీడా..సాంస్కృతిక కార్యదర్శి ఎరుకల ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు దేశెట్టి అంజయ్య, సీనియర్ కార్యవర్గ సభ్యులు పంగ శంకర్,కార్యవర్గ సభ్యులు పులిపాక రాజ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు బల్మూరి అమరేందర్‌రావు, మేడ చక్రపాణి, చందాల శైలజ,పెట్టం శ్రీనివాస్, గోశిక ప్రకాష్,కోసన శ్రీనివాస్ రావు, వేల్పుల అరుణ్‌కుమార్‌యాదవ్, అవినాష్, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఈత, తాటి వనాలకు నష్టపరిహారం చెల్లించాలి

## మంథని ఆర్డిఓకు వినతి పత్రం అందజేసిన గీత కార్మిక సంఘం నాయకులు

**మంథని, (జనంసాక్షి) :** మంథని నియోజక వర్గం పరిధిలోని రామగిరి మండలం మేడిపల్లి శివారులో ఏర్పాటు చేయబోతున్న కోకో కోల కంపెనీ, ఇండస్ట్రియల్ పార్క్ క్రింద తమ తాటి వనం, ఈత వనం పూర్తిగా కోల్పోతున్నామని తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ మంథని ఆర్డిఓ సురేష్ కు రత్నాపూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. సోమవారం రామగిరి మండల తాసిల్దార్ కార్యాలయంలో భూములు కోల్పోతున్న మేడిపల్లి శివారు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని మంథని ఆర్డీవో సురేష్, రామగిరి తాసిల్దార్ సుమన్ లు నిర్వహించారు. మేడిపల్లి శివారు సర్వే నెంబర్ 152 లో 1,000 తాటి చెట్లు, 150 ఈత చెట్లు ఉన్నాయని.. ఈ చెట్లు మొత్తం పోతున్నందున గీత కార్మికులకు ఉపాధి కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, గీత వృత్తి కార్మికులకు మెరుగైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు సమావేశంలో మంథని ఆర్డీవోకు అందజేసిన వినతిపత్రంలో కోరారు.



## అర్హులైన లబ్ధిదారులందరికీ

# ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

- రేకుర్తిలోని లక్ష్మీ నరసింహ కాలనీ లబ్ధిదారుడి ఇంటికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన సుడా చైర్మన్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి):** అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రేకుర్తి లోని లక్ష్మి నరసింహ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారుడు మహమ్మద్ అబ్దుల్లా ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన లబ్ధిదారులకు ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని రానివారు ఎవ్వరు ఆందోళన చెందవద్దని రెండో విడతలో అవకాశం వస్తుందని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. భూమి లేని నిరుపేదలకు గాంధీ నగర్ లోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తి చేసి కొంతమందికైనా ఇచ్చి ఆదుకుంటామని నరేందర్ రెడ్డి అన్నారు. నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులు మొదలు పెట్టిన మహమ్మద్ అబ్దుల్లాకు శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు ఆస్తాపురం రమేష్, ఎండి చాంద్, ఊరడి లత, అస్తపురం తిరుమల, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పర్వతం మల్లేశం, ఆవూరి లత, వారాల నర్సింగం, లక్కెపెల్లి మల్లేశం, మ్యాక శ్రీనివాస్, దుబ్బుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ జాగృతిలో చేరికలు

- సమస్యలు లేని సామజిక తెలంగాణ సాధన నే కవితక్క లక్ష్యం
- 42 శాతం బిసి రిజర్వేషన్ తోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి.
- కరీంనగర్ జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్.

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి):** సోమవారం రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ జాగృతిలో బిసి కుల సంఘాల నాయకులు శ్రీరాముల రమేష్ , గర్షకుర్తి విద్యాసాగర్, కోత్వాల అంజనేయులు తదితరులు జాగృతిలో చేరినారు. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువ కప్పి జాగృతి లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... కవితక్క నాయకత్వంలో తెలంగాణ జాగృతిని కరీంనగర్ జిల్లాలో బలోపేతం చేయడం జరుగుతుందని మన సంస్కృతి, సంప్రదాయాలు, మన అస్తిత్వాన్ని కాపాడటం కోసం నిరంతరం జాగృతి కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు సేవా చేయటమే లక్ష్యంగా కవితక్క జాగృతిని స్థాపించిందని ఇప్పుడు జాగృతిని, అనుబంధ సంఘాలను బలోపేతం చెయ్యాటమే లక్ష్యంగా పని చేస్తాం అన్నారు. 42 శాతం రిజర్వేషన్ తోనే ఎన్నికలు జరపాలని కోర్టు బిల్ ను కొట్టివేస్తే మా దగ్గర ప్లాన్ బి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ బిసిలకు రిజర్వేషన్ విషయంలో మోసం చేస్తే ప్రజలు కూడ కాంగ్రెస్ పార్టీని కతంచేసే ప్లాన్ తోనే ఉన్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు కవితక్క నాయకత్వాన్ని కోరుకుంటున్నారని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఇప్పుడు అన్ని రంగాలలో వెనుకబడి పోయిందని సమస్యలు లేని సామాజిక తెలంగాణను సాధించాటమే కవితక్క లక్ష్యం అని గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

# ప్రభుత్వం మక్క కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ : కోరుట్ల ఎమ్మెల్యే డా కల్వకుంట్ల సంజయ్
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు



**మెట్‌పల్లి, అక్టోబర్ 6 జనం సాక్షి :**
మొక్కజొన్న రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)కు అదనంగా బోనస్ ఇచ్చి క్వింటాలుకు 2,800 రూపాయలకు పంట కొనుగోలు చేయాలని బీఆర్ఎస్‌లోని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ డిమాండ్ చేశారు. మెట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 'వరంగల్ రైతు డిక్లరేషన్' పేరిట అన్ని పంటలను మెరుగైన మద్దతు ధరలతో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మర్చిపోయారని ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. "ప్రస్తుతం మొక్కజొన్నకు 2,400 రూపాయల మద్దతు ధర ఉంది. అందుకు 400 రూపాయల బోనస్ కలిపి 2,800కు ప్రభుత్వం కొనుగోలు చేయాలి. కానీ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో పడి తీవ్ర నష్టాలు సహతున్నారు" అని ఆయన చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు మొదట 2,000 రూపాయలకు కొనేవారు, ఇప్పుడు 1,800 కూడా ఇవ్వడం లేదని, ధరలు మరింత తగ్గి 1,600కు చేరాయని సంజయ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున పంట తడిచిపోయే ప్రమాదం ఉండటంతో రైతులు దిక్కులేక దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. దీనివల్ల ప్రతి ఎకరానికి 1,000 రూపాయలు, 30 క్వింటాల్స్ పంట వచ్చిన ఎకరానికి 30 వేల రూపాయలు నష్టం జరుగు తోందని ఆయన వివరించారు.

"రైతుల కష్టాలు తీర్చడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత. గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి, పంటను 2,800కు కొనాలి. లేకపోతే రైతులతో కలిసి బీఆర్ఎస్ పక్షంగా పోరాటాలకు దిగుతామ" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులకు సూచనలు జారీ చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సంజయ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అక్టోబర్ 8న టాస్క్ సెంటర్‌లో జాబ్ మేళా

- నిరుద్యోగ యువకులకు అవకాశాలు
- న్యూఇండియా పార్టీకి షోకా నోటీసు:
- ఆడిట్ అకౌంట్లు సమర్పించకపోవడంపై చర్యలు
- యూరియా పంపిణీపై అప్రమత్తత
- అక్టోబర్ చివరి వరకు రైతులకు సమస్యలు రాకుండా చర్యలు
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, అక్టోబర్ 6: జనం సాక్షి** జిల్లా నిరుద్యోగ యువకులకు 'టెలీ పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ లిమిటెడ్'లో ఉద్యోగాలు కల్పించేందుకు అక్టోబర్ 8 (బుధవారం) పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని టాస్క్ సెంటర్ వద్ద జాబ్ మేళాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటించారు. కస్టమర్ సర్వీస్ అసోసియేట్, కంటెంట్ మోడరేటర్, అనలిస్ట్ పోస్టులకు ఏ డిగ్రీ, బీటెక్ లేదా పీజీ ఉత్తీర్ణత కలిగిన స్త్రీ-పురుషులు (వయసు 18-35 సంవత్సరాలు) దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్ల జెరాక్సులు, రెస్యూమే తీసుకొని హాజరుకావాలి. మరిన్ని వివరాలకు 9059506807కు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

**న్యూఇండియా పార్టీకి షోకా నోటీసు**
రిజిస్టర్డ్ పార్టీలు వార్షిక ఆడిట్ అకౌంట్లు, ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష హెచ్చరించారు. భారత రాజ్యాంగం 324వ విభాగం, ప్రజాప్రతినిధి చట్టం 1951 సెక్షన్ 29-ఎ ప్రకారం, 'న్యూఇండియా పార్టీ' 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాల ఆడిట్ అకౌంట్లు సమర్పించకపోవడంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షోకా నోటీసు జారీ చేశారు. పార్టీ ప్రతినిధులు నిర్దిష్ట సమయంలో సమాధానం ఇవ్వాలిబీ లేకపోతే గుర్తింపు రద్దు సాధ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

**అక్టోబర్ చివరి వరకు యూరియా పంపిణీపై అప్రమత్తత**
వ్యవసాయ అవసరాలకు రైతులకు యూరియా సరఫరాలో అక్టోబర్ నెలాఖరు వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో యూరియా లభ్యత, పంపిణీపై వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, పిక్ డిమాండ్ ముగిసినా రిలాక్స్ కాకుండా పెండింగ్ డిమాండ్‌ను తీర్చాలని, జిల్లా నుంచి పక్క జిల్లాలకు అక్రమ దారి తీసువలు నిరోధించాలని ఆదేశించారు. అదే సమయంలో, ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా వ్యవసాయ విస్తరణ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనీ, శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# మానవత్వం మరిచి..

## అత్తను హత్య చేసిన కోడలు అరెస్టు

- హత్య సంఘటన వివరాలు వెల్లడించిన వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు




**వనపర్తి క్రైమ్ అక్టోబర్ 6 జనం సాక్షి :**
అత్త అమ్మతో సమానం అన్నారు ఓ కోడలు ఆ నానుడిని మరిచి వృద్ధాప్యంలో అన్ని తానై చూసుకోవాల్సింది పోయి కర్కోటకంగా మారి అచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచి చంపిన సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో చోటు చేసుకుంది.. సోమవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని సిఐ కార్యాలయంలో డిఎస్పి వెంకటేశ్వరావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.. ఈ నెల 4న రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన నిందితురాలు దొడ్డి బొగురమ్మ, తన అత్త దొడ్డి ఎల్లమ్మ,(75) గోలీలకు, తిండికి, ఖర్చులకు పైసలు ఇయ్యమని ఒకటే పోరు పెడుతూ నానా ఇబ్బందులకు గురి చేస్తుందని, ఆదివారం ఆమెతో పైసల కోసం గొడవ పెట్టుకోగా, ఆమెను చంపి పీడ వదిలించుకోవాలనే ఉద్దేశంతో, ఆమె ఇంట్లో, చుట్టుప్రక్కల ఎవ్వరు లేనిది చూసి ఆమె ఇంట్లోకి పోయి, తన అత్తా చేతి కట్టెతో నడుము భాగంలో కొట్టి, ఇంట్లో ఉన్న ఇనుప పెంకు తీసుకొని ఆమె తలపై వీపుపై తొడల భాగంలో పెంకు కొన భాగంతో భలంగా కొట్టగా బలమైన రక్త గాయాలతో మంచం మీద వెల్లకిల పడి మాట్లాడకుండా పడి పోయింది. తరువాత ఆమె చనిపోయిందని నిర్ధారించుకొని, ఈ విషయం నా మొగుడికి తెలిస్తే నన్ను చంపుతాడని భయపడి ఎవరికీ తెలియకుండా మంచంపై మరియు భూమి పై పడిన రక్తం మరకలు తుడిచి ఏమి తెలియనట్టు ఉన్నది.. మొదట ఆమె కుటుంబ సభ్యులు ఆమె అత్తా మృతిని ముసలి వయస్సు కారణంగా చానిపోయి ఉండవచ్చని అనుకున్నారు. అయితే మృతురాలి అంతక్రియలకు సిద్ధమయ్యే సమయంలో, వెన్నుపూస, తొడలపై గల రక్త గాయాలను గమనించి, నిందితురాలు బొగురమ్మను నిలదీయగా, ఆమె చేసిన హత్యను ఒప్పుకున్నది. తర్వాత, బొగురమ్మ గుడ్లనర్వ గ్రామం (బిజినపల్లి మండలం)లో తన తల్లిదండ్రుల ఇంటికి పారిపోయింది .సోమవారం రేవల్లి పోలీసులు బొగురమ్మను గుడ్లనర్వ గ్రామంలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె యొక్క నేరం ఒప్పుకోను ఆధారంగా, రక్తం మరకలు ఉన్న ఇనుప పెనం, మృతురాలి చేతి కర్ర, రక్తపు మరకలు తుడిచిన బట్టలు వంటి సాక్ష్యాలను సీజ్ చేసి పంచనామా చేసారు.
ఈ కేసును చేదించడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ, కృష్ణయ్య, రేవల్లి ఎస్సై, రజిత మరియు పోలీసు కానిస్టేబుళ్లు,అంజనేయులు, రామకృష్ణ, మౌలానలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు..ఈ సమావేశంలో వనపర్తి సిఐ, కృష్ణయ్య, రేవల్లి ఎస్సై,రజిత, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు...

# జీతాలు ఇప్పిస్తానని మాటమార్చిన సింగరేణి జియం

## జియం ఆఫీసు ముందు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 6 జనంసాక్షి :**
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 4నెలల జీతాలను ఇప్పిస్తానని చెప్పి జీఎం మాట మార్చారని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని టీఆర్పీ పార్టీ మంచిర్యాల జిల్లా నాయకులు మహేష్ వర్మ పేర్కొన్నారు .సోమవారం నాడు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ జియం కార్యాలయం ముందు సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆ ధర్నాకు టీఆర్పీ పార్టీ మంచిర్యాల జిల్లా నాయకులు మహేష్ వర్మ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీరాంపూర్ సింగరేణి ఓసి గనుల్లో మట్టి పొరలు (ఓబీ) తొలగించడానికి కాంట్రాక్ట్ పొందిన సిఆర్ఆర్ కంపెనీ, ఉదయ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయించుకొని 4నెలలుగా జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, కార్మికులను విధులకు కూడా తీసుకోకుండా కంపెనీ పూర్తిగా ఎత్తేశారని అన్నారు. కాంట్రాక్టర్ కు సంబంధించి ఎవరు లేకపోవడంతో ఎవరిని సంప్రదించాలని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై శ్రీరాంపూర్ సింగరేణి జనరల్ మేనేజర్ ని కలవగా డబ్బులు ఇప్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి ఇప్పుడు మాకు సంబంధం లేదని మాట మార్చారని మండిపడ్డారు. కార్మికుల జీతాలు ఇప్పిస్తానని మాటమార్చిన జనరల్ మేనేజర్ అధికారి గా అనర్హుడని అన్నారు. కీలక బాధ్యత లో ఉన్న అధికారి కార్మికుల జీతాలు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇలాంటి మోసపూరిత కంపెనీలకు కాంట్రాక్టు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. కార్మికుల శ్రమ దోచుకున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, వాటిని బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని, వాటి లైసెన్స్ ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాలు వడ్డీతోసహా చెల్లించాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సింగరేణి యాజమాన్యంపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంట్రాక్ కంపెనీల, సింగరేణి యాజమాన్యం ముక్కుపిండి వసూల్ చేస్తామని, బాధిత కార్మికులకు తెలంగాణ రాజ్యాధికార అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పాకాల దినకర్, దాస్యపు దీపక్ కుమార్, పడాల శివతేజ, సిపతి సాయి కుమార్, ఎండి లతీఫ్ పాల్గొన్నారు.





# రాజన్న ఆలయంలో ఈ నెల 11 నుండి

# దర్శనాల రద్దు జరిగేనా?

- ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు ముందడుగు
- రూ 4 కోట్లతో భీమేశ్వర ఆలయంలో కొనసాగుతున్న పనులు
- భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లపై అధికారుల దృష్టి
- ఆలయం మూసివేస్తే ఆందోళన చేస్తామంటున్న ప్రతిపక్షాలు
- ఆలయంలోని దర్గాను తొలగించాలంటున్న భాజపా, హిందూ సమాజం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనంసాక్షి) :**
దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేయనున్నట్లు సమాచారం. ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టడంలో భాగంగా భక్తులకు ప్రత్యామ్నాయంగా భీమేశ్వరాలయంలో దర్శనాలు కల్పించేందుకు పనులు కొనసాగుతున్నాయి.కాగా రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపివేస్తే ఆందోళన చేస్తామంటూ ప్రతిపక్షాలు,హిందూ సంఘాలు పేర్కొంటున్నాయి.మరోవైపు ఆలయ విస్తరణ పనులు చేపడితే ముందుగా ఆలయంలోని దర్గాను తొలగించాలని బాజాపా నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు ముందడుగు పడుతుంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవడానికి తెలంగాణతో పాటు దేశంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు.దేశంలో ఏ శివాలయంలో ఎక్కడా లేనివిధంగా ఆలయంలో భక్తులు కోడె మొక్కులను చెల్లించుకుంటారు.భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్నడటంతో ఆలయంలో సరైన వసతులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆలయ విస్తరణ చేపట్టాలని భక్తులు, పట్టణ ప్రజల నుంచి ఏళ్లుగా డిమాండ్ ఉంది.ఈ క్రమంలో గత బారాస ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం ఏటా రూ 100 కోట్లు బడ్జెట్లో కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆలయ అభివృద్ధి విస్తరణ పనులకు మోక్షం కలగలేదు.

**విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో...**
ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ప్రభుత్వ విప్ బాధ్యతలు చేపట్టిన ఆది శ్రీనివాస్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు.ఈ క్రమంలో వేములవాడ ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబుతో చర్చించి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా చొరవ తీసుకు న్నారు. బడ్జెట్లో రూ 150 కోట్లు కేటాయించడమే గాక మొదటి విడతగా రూ 75. కోట్లతో ఆలయ విస్తరణ పనులు చేపట్టనున్నారు. నిత్య కళ్యాణమండపం, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, అభిషేక సంకల్ప మండపంతో పాటు రూ 35 కోట్లతో నిత్యం అన్నదాన సత్రం నిర్మించనున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణం లోని ఈవో కార్యాలయ భవనం, ప్రసాద తయారీ భవనం, కళాభవన్ ఇతర కట్టడాలను కూల్చి వేశారు.

**భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శనాలు.**
ఆలయ అభివృద్ధిలో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేయనున్నాట్లు అంతర్గత సమాచారం. స్వామివారికి నిత్య పూజలు యధావిధిగా కొనసాగనున్నాయి. భక్తులకు ప్రత్యామ్నాయంగా భీమేశ్వరాలయంలో దర్శనాలు కల్పించేందుకు రూ 4 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే భక్తులు కోడె మొక్కులు చెల్లించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్యూలైన్లు అభిషేకం కళ్యాణం సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకోవడానికి మండపాలు సిద్ధం చేస్తున్నారు. కాగా నెల రోజుల్లోనే పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆదేశించినప్పటికీ రెండు నెలలు కావస్తున్న పనుల్లో ఆశించినంత వేగం లేదు ఈనెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభం ప్రారంభం కానుండగా త్వరలోనే సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తుంది.ఈ క్రమంలో భక్తుల రద్దీ అధిక సంఖ్యలో పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు సరైన ఏర్పాట్లు చేయాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

**19,20న శృంగేరి పీఠాధిపతి రాక.**
ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా పలుమార్లు ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఆలయ అధికారులు శృంగేరి పీఠాధిపతిని కలిసి వచ్చారు. ఆలయ నమూనాలు చూపించి స్వామి వారి సలహాలు సూచనల మేరకు పనులు చేపడుతున్నారు.ఈ క్రమంలో శృంగేరి పీఠాధిపతి ఈనెల 19, 20 న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రానున్నారు.శృంగేరి పీఠాధిపతి పర్యటన అనంతరం ఆలయ పనుల్లో వేగం పుంజుకొనుంది.

**వాతావరణం సహకరించకపోవడమే పనుల్లో కాస్త జాప్యం.**
ఆలయ ఈవో రమాదేవి.
రాజన్న ఆలయ అభివృద్ధి పనులు భాగంగా భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శన సౌకర్యం కల్పించేందుకు పనులు ప్రారంభించాము ఇటీవల కాలంలో అకాల వర్షాలు కురవడం వాతావరణ సహకరించకపోవడం వల్ల కొంతమేర పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. వాతావరణం అనుకూలిస్తే భీమేశ్వర ఆలయం లో పూర్తిస్థాయి పనులు పూర్తిచేసి వారం రోజుల్లో భక్తులకు భీమేశ్వరాలయంలో దర్శన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



# ఎన్‌సిడి న్యూ యాప్‌పైన ఎంఎల్ హెచ్‌పిలకు అవగాహన

## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పైన సమీక్ష : డిఎం,ఎచ్ఓ డా.వాణి శ్రీ

**పెద్దపల్లి,అక్టోబర్ 06(జనంసాక్షి) :** సమగ్ర జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం లోని మినీ సమావేశ మందిరంలో సోమవారం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌లకు తెలంగాణ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రాం యాప్ నిర్వహణ పైన శిక్షణ కార్యక్రమమును మరియు ఎన్‌సిడి (అసంక్రామిక వ్యాధులు) కార్యక్రమం పై సమీక్ష నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. వాణిశ్రీ గారు అని అన్నారు. ఈ శిక్షణ యందు ఎన్.సి.డీ స్క్రీనింగ్ నిర్వహించినప్పుడు కేసుల వివరాల నమోదు, పరీక్షల వివరాలు, చికిత్స, రెఫరల్ వివరాలు మరియు ఫాలో అప్ చేసిన వివరాలు ఇందులో నమోదు చేస్తారు అని అన్నారు. జాతీయ అసంక్రామిక వ్యాధుల నివారణ కార్యక్రమంలో 12 రకాల ప్రోగ్రాంలు నిర్వహిస్తామని అన్నారు. అందులో ఎన్‌సిడి, పాలియాటివ్ కేర్, ఎల్డర్లీ కేర్, టొబాకో, అయోడిన్, క్లైమేట్ చేంజ్, మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ లాంటివి నిర్వహిస్తారు అని అన్నారు.ప్రతి గర్భిణీ స్త్రీ ని ప్రభుత్వ దావఖానా లో ప్రసవం అయేలాగా ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రతి క్షయ వ్యాధి గ్రస్తులను మందులను సక్రమంగా వాడేవిదంగా చూడాలని అన్నారు. ఇంటింటికి జ్వరాల సర్వే చేసి చికిత్స అందించండి.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా.ఆర్.రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. కె.వి. సుధాకర్ రెడ్డి, డా. బి. కిరణ్ కుమార్‌లు, ఎన్‌సిడీ. జిల్లా కోఆర్డినేటర్‌లు ఎ. మధుసూదన్, టి. రాజేశం, జిల్లా డేటా మేనేజర్ మహీందర్ మరియు ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.ఎన్ క్వాస్ సర్టిఫికేషన్ కు సిరిపురం ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ అదే విధంగా ఈ రోజు ఉదయం గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిరిపురం ఉపకేంద్రంను సందర్శించడం జరిగింది అని అన్నారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కార్యక్రమం క్రింద సిరిపురం ఉప కేంద్రంను ఎంపిక చేయడానికి ఎక్స్టర్నల్ అసెస్మెంట్ చేయడానికి డిల్లీ నుండి టీం, డా .ప్రశాంత్, డా .కనుప్రియ పరిశీలించడం జరిగింది అని అన్నారు.

## భూభారతి పెండింగ్ దరఖాస్తులను

# సత్వరమే పరిష్కరించాలి

## నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 06 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు సకాలంలో తమ భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేలా చొరవ చూపాలని, దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటదివెంట అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన వర్ని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసిల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష జరిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ఒకింత జాప్యం జరుగుతుండడాన్ని గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.
దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీఓటీ లకు సంబంధించిన అప్లికేషన్ లను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని అన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారం లో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
7 అక్టోబర్ 2025

# హైడ్రాకు హైకోర్టు అభినందన

- చెరువుల పునరుద్ధరణను యజ్ఞంలా చేస్తోంది
- బతుకమ్మకుంటను చూస్తే ముచ్చటేస్తోంది
- టీడీఆర్‌పై ప్రభుత్వం సరైన విదానాన్ని రూపొందించాలి
- హైడ్రాను ప్రశంసించిన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** హైడ్రా పని తీరును హైకోర్టు అభినందించింది. నగరంలో చెరువుల అభివృద్ధిని ఓ యజ్ఞంలా చేస్తోందని కితాబిచ్చింది. అందుకు నగరంలో అభివృద్ధి చెందిన చెరువులే సాక్ష్యమని పేర్కొంది. మరీ ముఖ్యంగా బతుకమ్మకుంట అభివృద్ధిని చూస్తే ముచ్చటేస్తోంది. ఆక్రమణలకు గురై చెత్తకుప్పలా, పిచ్చిమొక్కలతో అటువైపు చూడాలంటే భయంగా ఉన్న ప్రాంతాన్ని చెరువుగా అభివృద్ధి చేసిన తీరు హర్షణీయమని, బతుకమ్మకుంట సర్వాంగ సుందరంగా మారి.. ఆ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తోందని న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. ఆ పరిసర ప్రాంతాలకు వరద ముప్పు తప్పించడమే కాకుండా.. భూగర్భ జలాలను కూడా పెంచిందని, గచ్చిబౌలిలోని మల్కం చెరువును చూసినా ఆహ్లాదంగా కనిపిస్తోందని, నగరంలో ఇలాగే మరో 5 చెరువుల అభివృద్ధి జరుగుతోందని, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఎవరివైనా ఇంటి స్థలాలు, భూములు ఉంటే టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద వారికి సరైన నష్టపరిహారం ఇవ్వాలని, ప్రభుత్వం ఇందుకోసం సరైన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు పరిధిలోని రెండు ఎకరాలకు సంబంధించిన టీడీఆర్ కేసు విచారణలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్ రెడి సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. టీడీఆర్ విషయంలో ప్రభుత్వం సరైన విధానాన్ని పాటిస్తే.. చెరువుల అభివృద్ధికి ఆటంకం ఏర్పడదని, టీడీఆర్ కేసును వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఎస్ శ్రీధర్ కూడా జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి వ్యాఖ్యలను ఏకీభవించారు. బతుకమ్మ కుంట ప్రస్తావన తీసుకువచ్చి హైడ్రా పనితీరుకు ఇది నిదర్శనమంటూ శ్రీధర్ కితాబిచ్చారు. తమ్మిడికుంటలో భూములు కోల్పోయిన వారికి సరైన టీడీఆర్ అందించాలంటూ శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

### హైడ్రా ప్రజావాణికి 41 ఫిర్యాదులు

అనుమతులు లేని లే ఔట్లలో రహదారులు, పార్కులు ఆక్రమణకు గురౌతున్నాయి. 60 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన రహదారులను ఇరువైపులా ఆక్రమణలు జరుగుతున్నాయి. డబ్బాలు పెట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారని.. ఖాళీ చేయమంటే దాడి చేస్తున్నారంటూ పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొని సరైన రహదారులు, పార్కులు లేక ఇబ్బందులు పడొద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. హెచ్ ఎండీఏ, డీటీసీపీ అనుమతి పొందిన లే ఔట్లలో ప్లాట్లు కొంటే రహదారులు, పార్కులు నిర్దేశిత లెక్కల ప్రకారం ఉంటాయన్నారు. బొల్లారం మున్సిపాలిటీలోని ఎన్‌రిచ్ ప్రాంతంలో సర్వే నంబరు 83లో వరకుంట చెరువు కబ్జాలను నివారించాలని.., బాచుపల్లి మండలంలోని నిజాంపేట సర్వే నంబరు 233/15లో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం జవహార్‌నగర్ విలేజ్‌లో తన తండ్రి ఆర్మీ ఉద్యోగి కావడంతో అప్పట్లో ఇచ్చిన భూమిని స్థానికంగా ఉన్నవారు కబ్జా చేసేశారని అతని కుమారుడు ఫిర్యాదు చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 41 ఫిర్యాదులందాయి. ఇందులో ఎక్కువగా రహదారులు, పార్కుల ఆక్రమణలే ఉన్నాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి వాటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 6(జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సోమవారం స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. జిల్లాల్లో ముఖ్య నాయకులతో సంప్రదించి ఏకాభిప్రాయంతో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునే విధంగా పని చేయాలని మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు. ఎన్నిక ప్రచారం కోసం క్షేత్రస్థాయిలో నేతలు చేపట్టాల్సిన కార్యక్రమాలను, ప్రజలకు వివరించాల్సిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటినుంచే ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆరు గ్యారంటీల అమలుపై ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా నియోజకవర్గ, పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# రాజ్యాంగంపై దాడి చేసినట్టే..

- జస్టిస్ గవాయిపై దాడిని తీవ్రంగా ఖండించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి ఘటనను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. ఇది క్షణికావేశంలో జరిగిన దాడి కాదని, పథకం ప్రకారం కుట్రపూరితంగా చేసిన దాడి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్ అని, దాని ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టే అని ఆమె పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిపై దాడి చేయడం భారత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీతక్క డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం మన అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను ప్రసాదించిందని, ఆ విలువలను కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆమె పిలుపునిచ్చారు.

# పెట్రోల్ బంకు వద్ద కారులో మంటలు

- అప్రమత్తం అయి మంటలు ఆర్పిన సిబ్బంది

**హైదరాబాద్, అక్టోబర్6 (జనంసాక్షి) :** హైదరాబాద్ పంజాగుట్టలో పెద్ద ప్రమాదం తప్పింది. పెట్రోల్ బంకులో కారులు సడెన్ గా మంటలు చెలరేగటంతో ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వెంటనే అలర్ట్ అయిన సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సోమవారం పెట్రోల్ కొట్టించడానికి వచ్చిన కార్ లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్పందించిన పెట్రోల్ పంపు సిబ్బంది.. అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పేశారు. దీంతో పెట్రోల్ బంకుకు ప్రమాదం తప్పటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. పెట్రోల్ బంక్ లో ఉన్న కార్ లో మంటలు రావడంతో సిబ్బంది, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. మంటలను చూసి వాహనదారులు దూరంగా పరిగెత్తారు. మంటలను ఆర్పిన వెంటనే కార్ ను పెట్రోల్ బంక్ నుండి బయటికి తీసుకెళ్లారు.



పంజాగుట్ట లోని ఎర్రమంజిల్ లో ఉన్న పెట్రోల్ బంకులో ఈ ప్రమాదం జరిగింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బిజెపి కసరత్తు

- నేడు అభ్యర్థిని ఖరారు చేసేందుకు నేతల భేటీ



**హైదరాబాద్, అక్టోబర్6 (జనంసాక్షి) :** భాజపా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ మంగళవారం సమావేశం కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఈ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజవర్గం నుంచి సమాచారం సేకరించారు. ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపించనుంది. బుధవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేసులో జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేసి మూడో స్థానానికే పరిమితమయ్యారు. ప్రస్తుతం భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు ఉప ఎన్నిక టికెట్ దక్కుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయనకు టికెట్ ఇవ్వని పక్షంలో జూటూరు కీర్తి రెడ్డికి టికెట్ దక్కే అవకాశముందని సమాచారం. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న లంకల దీపక్ రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డిలో ఒకరు జూబ్లీహిల్స్ ఉపపోరులో నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓవైసీపై పోటీ చేసి ఓడిపోయిన మాధవి కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇకపోతే అభ్యర్థి ఎంపికతో పాటు, గెలిపించుకోవడం బిజెపికి ముఖ్యంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాంచంద్రరావుకు సవాల్‌గా మారనుంది. త్రీమెన్ కమిటీ తీసుకునే నిర్ణయం ఆధారంగా ఎంపిక జరుగనుంది.

# ట్రాప్‌హౌజ్ పార్టీపై పోలీసుల ముమ్మర దర్యాప్తు


**వికారాబాద్, అక్టోబర్6 (జనంసాక్షి) :** మొయినాబాద్ చెర్రీవోక్స్ ఫాంహౌస్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ట్రాప్ హౌస్ పార్టీలో ఆర్గనైజర్లు, డీజే ప్లేయర్లు సహా 65 మంది పాల్గొన్నట్లు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సమాచారంతో 59 మంది యువతి, యువకులు పార్టీకి వచ్చారు. 22 మంది మైనర్లు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ఇషాన్ అనే యువకుడు పార్టీ నిర్వహించినట్లుగా గుర్తించారు. ఇషాన్ ఇటీవలే కెనడా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్‌హౌస్ పేరిట పేజీ క్రియేట్ చేశాడు. అక్టోబర్ 4న చెర్రీవోక్స్ ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహించాడు. ఒక్కరికైతే రూ.1,600, జంటగా వస్తే రూ.2,800గా ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఇది చూసిన మైనర్లు పార్టీకి సిద్ధమయ్యారు. మత్తులో జోగుతున్న సమయంలో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న వారికి నిర్వహించిన డ్రగ్ పరీక్షలో ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్టు నిర్ధరణ అయింది. ఆరుగురు నిర్వాహకులను, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మొయినాబాద్ ఠాణాలో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# నటుడు విజయ్ కారుకు ప్రమాదం

- జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఘటన

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** హీరో విజయ్ దేవరకొండ కారుకు ప్రమాదం జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి దగ్గర ముందు వెళ్తోన్న బొలెరో వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో విజయ్ కారు ఢీ కొట్టింది. దీంతో విజయ్ దేవరకొండ కారు పాక్షికంగా దెబ్బతింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విజయ్ పుట్టపర్తి వెళ్లి తిరిగి హైదరాబాద్ తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విజయ్ ఆదివారం పుట్టపర్తిని దర్శించుకున్నారు. తిరిగి హైదరాబాద్ వచ్చేటపుడు జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి శివారులోని వరసిద్ధి వినాయక పత్తి



మిల్లు దగ్గరకు రాగానే విజయ్ కారు ప్రమాదానికి గురైంది. విజయ్ దేవర కొండ డ్రైవర్ అందే శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటన తర్వాత మరో కారులో విజయ్ దేవరకొండ హైదరాబాద్ కు వెళ్లారు. విజయ్ ,రష్మిక నిశ్చితార్థం వార్తలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పుట్టపర్తిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహా సమాధిని దర్శన సమయంలో విజయ్ చేతికి ఉన్న రింగ్ వైరల్ అవుతోంది. విజయ్,రష్మిక ఎంగేజ్ మెంట్ రింగ్ అని అందరు చర్చించుకుంటున్నారు. విజయ్ తన నిశ్చితార్థం తర్వాత తొలిసారిగా బహిరంగ ప్రదేశంలో కనిపించడం, అదీ తన కుటుంబ సమేతంగా ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లడం... ఈ రెండు సంఘటనలూ అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ఆయన కుడిచేతి ఉంగరం వేలికి మెరుస్తున్న రింగ్ ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ రింగ్ బంధమే విజయ్–రష్మిక నిశ్చితార్థానికి బలమైన ఆధారాన్ని ఇస్తోందని నెటిజన్లు గట్టిగా నమ్ముతున్నారు

# ఎన్నికలలోపే అభివృద్ధి పనులు పూర్తి

- షేక్‌పేటలో సిసి రోడ్డు పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన



**హైదరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఎన్నికలతో సంబంధం లేకుండా నెల రోజుల్లోనే జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జూబ్లీహిల్స్ లోని షేక్ పేట తేజా కాలనీలో సీసీ రోడ్డు, డ్రైయిన్స్ పనులకు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి . ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించడంతో మంత్రితో కేక్ కట్ చేయించారు స్థానికులు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వివేక్ వెంకటస్వామి.. నెల రోజుల ముందు సీసీ రోడ్డులు లేవని స్థానికులు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు సాంక్షన్ చేయించా. ఇక్కడ ప్రజల కోసం రూ. 40 లక్షలతో మొదలు పెట్టాం. ఎన్నికలతో సంబంధం లేకుండా నెలలో పనులు పూర్తి చేస్తాం. గతంలో బీఆర్ఎస్ ఓట్లు వేసుకొని గాలికి వదిలేసింది. 10 ఏళ్ళలో బీఆర్ఎస్ ఎలాంటి పనులు చేయలేదు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల నుంచి మంచి ఫీడ్ బ్యాక్ ఉంది.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారు. ప్రజలు అందరు పనులు చేయిస్తున్నామని సంతోషంగా ఉన్నారు. ఇంకా మూడేళ్లు మేమే అధికారంలో ఉంటాం. ముందు ఉండి అన్ని అభివృద్ధి పనులు చేయిస్తాం అని అన్నారు. మరో వైపు జూబ్లీహిల్స్ బైపోల్ కు షెడ్యూల్ ప్రకటించింది ఈసీ. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా.. 14న కౌంటింగ్ జరగనుంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత పోటీపడుతుండగా.. కాంగ్రెస్,బీజేపీ ఇంకా అభ్యర్థులను ఫైనల్ చేయలేదు.

# కార్యరూపం దాల్చేలా పోలవరం పనుల నిర్వహణ

- రూ. 900 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం
- వచ్చే మే నెల చివరి వరకు 28,946 మందికి లబ్ది
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో మంత్రి నిమ్మల చర్చలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** పడకేసిన పోలవరం పనులను కార్యరూపం దాల్చేలా పనిచేస్తున్నామని ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 2026 మే నెల చివరి వరకు 28,946 మందికి రూ. 900 కోట్లతో పునరావాసం కల్పిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 మార్చి వరకు పోలవరం నిర్వాసితులను పునరావాసం పూర్తి చేస్తామని తెలిపారు. తాజాగా ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌తో భేటీ అయ్యారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ డిజైన్స్ అనుమతులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. పోలవరం పనులు జరుగుతున్న తీరు పట్ల కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కేంద్రం పోలవరం నిర్మాణానికి ఇచ్చే ప్రతి రూపాయిను సద్వినియోగం చేస్తున్నామని తెలిపారు. 2027 డిసెంబర్ నాటికి ప్రధాని చేతుల మీదుగా పోలవరాన్ని జాతికి అంకితం చేసేందుకు ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను ఆహ్వానించినట్లు చెప్పారు. బీహార్ ఎన్నికల తర్వాత ఆయన వస్తానని చెప్పారన్నారు. 7.2లక్షల ఎకరాలకు కొత్తగా నీరు అందించే ప్రాజెక్టు పోలవరం అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 25.03 లక్షల ఎకరాలకు స్థిరీకరణ అందించే ప్రాజెక్టు పోలవరం అన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ అందించే ప్రాజెక్టు పోలవరంను గత ప్రభుత్వం హయాంలో అనిశ్చితిలోకి నెట్టివేసింది. కూటమి ప్రభుత్వం లో పోలవరానికి అమితమైన ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఏపి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ వల్ల పనులు తిరిగి వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఏపి సీఎం నిర్దేశిరచిన 2027 లక్ష్యానికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. వర్షాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. చిత్తశుద్ధి తో పనులు పూర్తి చేస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం 2019లో కూడా కొనసాగినట్లయితే ఇప్పటికే పోలవరం పనులు పూర్తయ్యేయి. గత ప్రభుత్వ హయాంలో 17 నెలల పాటు పోలవరం పనులు జరగలేదు. డయాఫ్రం వాల్ దెబ్బ తినడానికి గత ప్రభుత్వ తప్పిదాలే కారణం. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేశారు. కేంద్రం హెచ్చరికలను పట్టించుకోకుండా జగన్ సర్కార్ పోలవరం ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్ పేరుతో అడ్డుకుంది. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే మా ప్రభుత్వం చేసిన పనులను ప్రజలు గుర్తించాలి. 900 కోట్ల వ్యయంతో డయాఫ్రం వాల్ నిర్మాణం కొత్తగా చేపట్టాల్సిరావడానికి కారణం జగన్ సర్కార్ నిర్వాకం! గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని మంత్రి వ్యాఖ్యానించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370